thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 196 కరీంనగర్ మంగళవారం, 23 సెప్టెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్‌పై 15 లక్షల సైబర్ అటాక్స్ చేసిన పాక్..

భారత్‌ను దెబ్బ తీయడానికి పాక్ అన్ని రకాలుగా కుట్రలు చేస్తూనే ఉంది. ఓ వైపు పాకిస్తాన్ ఆర్మీ కాల్పుల విరమణకు తూట్లు పొడుస్తూ .. సరిహద్దుల వెంబడి కాల్పులకు తెగబడుతూ ఉంది. మరో వైపు పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు అమయాక భారతీయుల్ని పొట్టనపెట్టుకుంటూ ఉన్నారు. ఈ రెండు రకాలుగానే కాకుండా .. మూడో రకంగా కూడా భారత్‌ను దెబ్బ తీయడానికి పాక్ కుట్రలు చేస్తూనే ఉంది. ఎవ్వరూ ఊహించని విధంగా భారీ స్థాయిలో సైబర్ అటాక్స్‌కు పాల్పడుతోంది. పహల్గామ్ టెర్రర్ అటాక్ తర్వాత పాకిస్తాన్‌కు చెందిన హ్యాకర్లు దేశ వ్యాప్తంగా 15 లక్షల సైబర్ అటాక్స్ జరిపినట్లు తేలింది.



राजू दादा @ कट्टा रामचंद्र रेड्डी
सेंट्रल कमेटी मेंबर (CCM)
भारतीय कम्युनिस्ट पार्टी (माओवादी)



KOSA @ Kadari Satyanarayan Reddy
Central Committee Member (CCM)
CPI (Maoist)



RAJU @ Katta Ramachandra Reddy
Central Committee Member (CCM)
CPI (Maoist)

# ఇద్దరు మావో స్తంభాల కాల్చివేత

## ఆ ఇద్దరిది పూర్వ కరీంనగర్ జిల్లా ఒక్కొక్కరిపై రెండేసి కోట్ల రివార్డ్

## ఒకరు టీచర్,మరొకరు టీచర్ కొడుకు

## కొన్ని గంటల ముందే సోనుపై లేఖ రాశారు

మావోయిస్టు పార్టీ ఇద్దరు టాప్ నేతలను సోమవారం ఛత్తీస్గఢ్ పోలీస్ బలగాలు కాల్చి చంపారు.ఆపార్టీ ముఖ్య నేతలు కదరీ సత్యనారాయణ రెడ్డి అలియాస్ కోసా అలియాస్ అభయ్,డీకే ప్రతినిధి వికల్ప్ అలియాస్ కట్టా రామచంద్ర రెడ్డి ఈ రోజు మధ్యాహ్నం కాగర్ ఆపరేషన్ బృందం కాల్చి చంపారు.వేణుగోపాల్ రావు,సత్యనారాయణ రెడ్డి ఇద్దరు అభయ్ పేరుతో కొనసాగుతున్నట్టు సమాచారం.ఈ ఘటన గురించి చర్చించుకుంటున్న సమయంలో లేఖ రాసిన ఇద్దరు మిత్రులు ఒకే చోట ఎన్కౌంటర్ అయ్యారు.మరణించిన వారిలో ఇద్దరు కేంద్రకమిటీ సభ్యులుగా ఉన్నారు.మావోయిస్టు టాప్ లిస్టు క్యాడర్ ను కేంద్రం కనిపెట్టిందని ఈ ఎన్కౌంటర్ ద్వారా అంచనా వేస్తున్నారు.మరణించిన ఇద్దరిపై వివిధ రాష్ట్రలో రెండేసి కోట్ల రూపాయల మేర నగదు రివార్డ్ లు ఉన్నాయని పోలీసులు తెలిపారు

ఆ ఇద్దరు నేతలు విడుదల చేసిన లేఖలో ఏమీ ఉన్నదో చదవండి

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)కేంద్ర కమిటీ

శత్రువుకు ఆయుధాలు అప్పగించి జనజీవన స్రవంతిలో కలిసి ప్రజల ప్రయోజనాలకు ద్రోహం చేయడం మా విధానం కాదు.

మారిన సామాజిక పరిస్థితికి తగినట్టుగా వెనకంజలోని విప్లవోద్యమాన్ని పురోగమింపచేయడానికి వర్గపోరాటాన్ని-ప్రజాయుద్ధాన్ని కొనసాగించడమే మా కర్తవ్యం.

సెప్టెంబర్ 17 నుండి ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలో మా పార్టీ పొలిట్ బ్యూరో (పీబీ) సభ్యుడు కామ్రేడ్ సోను, అభయ్ పేరుతో విడుదల చేసిన పత్రికా ప్రకటన, దాని ఆడియో ఫైల్, విప్లవ ప్రజలకు విజ్ఞప్తి అనే ప్రకటనలు విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. మారిన అంతర్జాతీయ, దేశీయ పరిస్థితుల రీత్యా, దేశ ప్రధానమంత్రి, హోంమంత్రి నుండి మొదలుకుని పోలీసు ఉన్నతాధికారుల వరకు, ఆయుధాల్ని వీడి జనజీవన స్రవంతిలో కలవాలని చేస్తున్న విజ్ఞప్తుల రీత్యా మేము ఆయుధాలు వదిలిపెట్టాలని నిర్ణయం తీసుకున్నాం' అని ఆయన ఇందులో ప్రకటించాడు. ఇది మా పార్టీ ప్రధాన కార్యదర్శి అమరుడు కామ్రేడ్ బసవరాజు శాంతిచర్చల కోసం చేసిన ప్రయత్నంలో భాగమని కూడా ఆయన చెప్పాడు.

కామ్రేడ్ సోను చేసిన ఈ ప్రకటన ఆయన వ్యక్తిగత నిర్ణయమే. ఆయన చేసిన ఈ ప్రకటనను మా కేంద్రకమిటీ, పొలిట్ బ్యూరో, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ పూర్తిగా తిరస్కరిస్తున్నాయి. ఖండిస్తున్నాయి. మారిన అంతర్జాతీయ, దేశీయ పరిస్థితులు సాయుధ పోరాటాన్ని వదిలి పెట్టాలని సూచించడం లేదు. దీనికి భిన్నంగా సాయుధ పోరాటాన్ని కొనసాగించాల్సిన అవసరాన్ని ఎత్తిచూపుతున్నాయి. వెనకబడిన దేశాల పీడిత జాతుల పై, ప్రజలపై సామ్రాజ్యవాద దోపిడి, పీడనలు మరింత తీవ్రతరమవుతున్నాయి. పెట్టుబడిదారీ - సామ్రాజ్యవాద దేశాల్లో పెట్టుబడిదారీ వర్గం అక్కడి కార్మికవర్గంపై, మధ్యతరగతి ప్రజానీకంపై పొదుపు చర్యల' పేరుతో దోపిడి, పీడనల్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. అక్కడి దోపిడీ వర్గాలు ఫాసిజాన్ని, రేసిజాన్ని అమలు చేస్తున్నాయి. ఇవన్ని రోజురోజుకు తీవ్రతరమవుతున్న సామ్రాజ్యవాద ఆర్థిక, రాజకీయ సంక్షోభ ఫలితమే, మనదేశంలో సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్లకు చెందిన విదేశీ, స్వదేశీ బడా కార్పొరేట్లు వ్యవసాయిక, పారిశ్రామిక, సేవారంగాలతో పాటు సామాజిక జీవితానికి చెందిన సకల రంగాల్లో దోపిడి, పీడనల్ని రోజురోజుకు తీవ్రతరం చేస్తున్నాయి. దీంతో పట్టణ, మైదాన, అటవీ ప్రాంతాల్లో విశాల ప్రజానీకం (పీడిత వర్గాలు, పీడిత సామాజిక సముదాయాలు, పీడిత జాతులు) సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల కూటమికి వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని మరింత విస్తృతం తీవ్రతరం చేయాల్సిన అవసరాన్ని ఎత్తిచూపుతోంది. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలోని విశాల ప్రజానీకంపై సామాజిక జీవితానికి చెందిన అన్ని రంగాల్లో చేస్తున్న ఫాసిస్టు దాడులను ప్రతిఘటించాల్సిన అవసరాన్ని ఎత్తిచూపుతోంది. ప్రపంచవ్యాప్తంగా, మనదేశంలో ఆర్థిక, సామాజిక అంతరాలు తీవ్రంగా పెరిగిపోతున్నాయి. మనదేశంలో కానీ, ప్రపంచంలో గానీ ప్రజల దైనందిన సమస్యలు గానీ, మౌలిక సమస్యలు గానీ పరిష్కారం కాలేదు. ఈ స్థితిలో మన దేశంలో గానీ, ప్రపంచంలో గానీ నేటి పరిస్థితులు చట్టబద్ధ - చట్టవ్యతిరేక, రహస్య-బహిరంగ పోరాట, నిర్మాలణ రూపాలను సమన్వయించుకుంటూనే సాయుధ పోరాటాన్ని కొనసాగించాల్సిన అవసరాన్ని ఎత్తిచూపుతున్నాయి.

మా పార్టీ ప్రధాన కార్యదర్శి అమరుడు కామ్రేడ్ బసవరాజు (బీఆర్) శాంతిచర్చల కోసం చేసిన ప్రయత్నంలో భాగమే ఆయుధాల విరమణ అని కామేడ్ సోను ప్రకటించడం వాస్తవాల వక్రీకరణ. అమరుడు కామ్రేడ్ బసవరాజు మే 7 నాటి ప్రకటనలో ఆయుధాల్ని వదిలి పెట్టడం గురించి మా కోర్ గ్రూపుతో చర్చిస్తామని ప్రకటన చేసినప్పటికీ త్వరలోనే అందులోని లోపాన్ని గుర్తించడంతో పాటు, మా పార్టీ చేసిన శాంతిచర్చల ప్రస్తావనను నిర్లక్ష్యం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ యుద్ధాన్ని కొనసాగిస్తుండడంతో, దాన్ని ఉపసంహరించుకుని 'కగార్' యుద్ధాన్ని ప్రతిఘటించాలని యావత్తు పార్టీకి, పీ.ఎల్.బీ.ఏ.కు, విప్లవ శిబిరానికి ఆయన పిలుపునిచ్చాడు. ఆయన ఇచ్చిన మార్గదర్శకత్వంలోనే నేడు దేశవ్యాప్తంగా పార్టీ, పీ.ఎల్.జీ.ఏ., విప్లవ శిబిరం 'కగార్' యుద్దాన్ని చట్టబద్ధ చట్టవ్యతిరేక రూపాల్లో శక్తిమేరకు ప్రతిఘటిస్తున్నాయి. ఈ వాస్తవాన్ని ఉద్దేశ్యపూర్వకంగా కామ్రేడ్ సోను వక్రీకరించాడు. ఈ దురుద్దేశ్యపూర్వ వక్రీకరణ కుటిలమైనది. ఖండించతగినది. సోమను కోరుతున్నాం. ఈ దుష్ట పరిణాన్ని తిప్పికొట్టాచ్చిందిగా ప్రజాసంఘాలకు, పార్టీ **(మిగతా 3వ పేజీలో)**





## కార్మికులు, సిబ్బందికి దసరా పండుగ అడ్వాన్స్

హైదరాబాద్ : ఆర్టీసీ కార్మికులకు యాజమాన్యం శుభవార్త చెప్పింది. దసరా పండుగ సమీపిస్తోన్న నేపథ్యంలో కీలక ప్రకటన చేసింది. కార్మికులు, సిబ్బందికి దసరా సందర్భంగా పండుగ అడ్వాన్స్ మంజూరు చేస్తూ సోమవారం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించి వెంటనే సప్లిమెంటరీ పే బిల్లులు తయారు చేసి చెల్లింపు చేయాలని సూచించారు. ఈ అడ్వాన్స్‌ను 2025 నవంబర్ జీతం నుంచి ప్రారంభమయ్యేలా పది సమాన వాయిదాల్లో తిరిగి వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.





# బీజేపీ మళ్లీ జమిలి జపం

జమిలి ఎన్నికలు బీజేపీ అజెండాలో ఉంది. దానికి సరైన సమయం కోసం మాత్రమే కుదరాల్సి ఉంది. నిజానికి 2024 ఎన్నికల్లో బీజేపీ కోరుకున్నట్లుగా 400 ప్లస్ ఎంపీ సీట్లు కనుక వచ్చి ఉంటే ఈపాటికి జమిలి విషయంలో చాలా దూకుడుగా ముందుకు సాగేది. అయినా సరే ఇపుడు కూడా జమిలి జపం అయితే బీజేపీ వీడడం లేదు. జమిలి ఎన్నికల వల్ల లాభం ఏమిటో జనాలకు వివరించే ప్రయత్నం చేస్తూ ఏదో రోజుల ఆ విధానం దేశంలో అమలు చేయాలని చూస్తోంది.

**అవగాహన కల్పించడమే :** జమిలి ఎన్నికల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు బీజేపీ తమ పార్టీ ఎంపీతో దేశంలో కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మేధావులతో చర్చా గోష్టులు పెడుతోంది. ఈ క్రమంలో కేంద్ర మాజీ మంత్రి దివగంత నాయకురాలు సుష్మా స్వరాజ్ కుమార్తె ఎంపీ అయిన బాన్సూరి స్వరాజ్ రాజమండ్రిలో జరిగిన వన్ నేషన్ వన్ ఎలక్షన్ సదస్సులో పాల్గొన్నారు. ఆమె జమిలి ఎన్నికల మీద కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఒకేసారి పార్లమెంటు అసెంబ్లీ ఎన్నికలు జరిగినట్లయితే, దేశ ఆర్థిక పరిస్థితి మెరుగవడమే కాదు, స్థిరత్వం ఏర్పడుతుందని చెప్పారు. అంతే కాదు ఎన్నికలకు అయ్యే ఖర్చు లక్షల కోట్లతో తగ్గుతుందని ఆమె చెప్పారు.

**ప్రజల పన్నులతో ఎన్నికలు :** దేశంలో చూస్తే ఎక్కడో ఒక చోట ఎన్నికలు ప్రతి సంవత్సరం జరుగుతూ ఉండటం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని ఆమె అన్నారు. ఒక విధంగా చెప్పాలంటే ప్రజలు పన్నులు రూపంలో కట్టే నిధులు వృథా అవుతున్నాయని ఆమె చెప్పారు. అందుకే ఎన్నికల సంస్కరణలు జరగాలని, జమిలి ఎన్నికలు నిర్వహించడం వల్ల అనేక మానవ వనరులు కూడా కలిసివస్తాయని ఆమె తెలిపారు. ప్రజల్లో జమిలి ఎన్నికల పట్ల అవగాహన కల్పించడం కోసమే ఇలాంటి సదస్సులు దేశంలో నిర్వహిస్తున్నట్టుగా ఆమె పేర్కొన్నారు.

**గొలుసు కట్టు తెగకుండా :** సాధారణంగా జమిలి ఎన్నికలు అంటే కలిగే సందేహాలు ఏమిటి అంటే ఒక అసెంబ్లీకి నెగ్గిన ప్రభుత్వం మధ్యలో కుప్ప కూలితే మళ్ళీ ఎన్నికలు పెడతారు కదా అలా అయిదేళ్ళకు ఆ ప్రభుత్వం వస్తే ఈ జమిలి గొలుసు కట్టి తెగిపోతుంది కదా అన్నది.

అయితే దీనికి బాన్సూరి స్వరాజ్ సమాధానం ఇచ్చి కొంత స్పష్టత కలిగించారు. ఒకేసారి కేంద్రానికి రాష్ట్రాలకు జమిలి ఎన్నికలు జరిగిన నేపథ్యంలో ఏదైనా కారణం చేత అసెంబ్లీ రద్దు అయితే ఆ మిగిలిన మిగిలిన కాలానికే ఎన్నికలు నిర్వహించే పరిస్థితి ఉంటుందని ఆమె చెప్పుకొచ్చారు.

అంటే ఒక శాసన సభ అయిదేళ్ళ పదవీ కాలంలో మధ్యలో రద్దు అయితే మిగిలినది రెండేళ్ళు ఉంటే ఆ కాలానికే మళ్ళీ ఎన్నికలు ఉంటాయన్న మాట. ఇప్పటిదాకా మధ్యంతర ఎన్నికలు వస్తే మరో అయిదేళ్ళ పాటు సభ కాలం ఉండేది. సో ఈ విషయంలో క్లారిటీ వచ్చేసింది. ఇదే విధానంలో ఎంపీలు ఎమ్మెల్యేలు మధ్యలో తప్పుకున్నా రాజీనామా చేస్తే కూడా ఎన్నికలు పెడతారు అని అంటున్నారు.





# లాభాల్లో 34 శాతం...

# సింగరేణి కార్మికులకు దసరా బోనస్

## ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్: సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం దసరా బోనస్ ప్రకటించింది. సింగరేణి లాభాల్లో 34 శాతం బోనస్ (రూ. 819 కోట్లు)ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. సింగరేణి 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాలలో కార్మికులకు వాటా ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దసరా పండుగ సందర్భంగా సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటించారు. రెగ్యూలర్ కార్మికులకు రూ. 1,95,610 బోనస్ ప్రకటించగా.. కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5,500 బోనస్ ఇస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

**దీపావళికి మళ్లీ బోనస్ ప్రకటిస్తామన్న రేవంత్ రెడ్డి...** సింగరేణి సంస్థ కోసం కార్మికులు ఎంతగానో శ్రమిస్తారు. పండుగ సమయంలో వారి కష్టాన్ని గుర్తించి సంస్థ లాభాల్లో కార్మికులకు 34 శాతం వాటాను అందిస్తున్నాం. దసరా సమయంలో వారి కుటుంబాల్లో సంతోషాన్ని నింపేందుకు ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. సింగరేణి మొత్తం లాభం రూ. 2360 కోట్లు అని రేవంత్ తెలిపారు. దీపావళి సందర్భంగా మళ్లీ బోనస్ ప్రకటిస్తామని మరో గుడ్ న్యూస్ చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సింగరేణి కార్మికుల పాత్ర మరిచిపోలేనిది అన్నారు.

**జీఎస్టీ సవరించడంతో 7000 కోట్లు నష్టం..** 'కార్పొరేట్ కంపెనీలతో పోటీ పడేలా సింగరేణిని తీర్చిదిద్దుతాం. సింగరేణి సంస్థ మొత్తం ఆదాయం రూ. 6394 కోట్లు. దీనిలో రూ. 4034 కోట్లు భవిష్యత్ పెట్టుబడులకు కేటాయించాం. ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిన గనులను సైతం తిరిగి సింగరేణికి అప్పగించేలా చూడాలని కార్మికులు కోరారు. ప్రైవేటు భాగస్వామ్యం పెరుగుతూ పోతే భవిష్యత్ లో సింగరేణి కాలరీస్ మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. ఈ సమస్యను పరిష్కారం దిశగా కేంద్రంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. సింగరేణి సంస్థను లాభాల బాటలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తాం. కేంద్రం జీఎస్టీ సవరణతో దాదాపు రూ. 7 వేల కోట్లు ఆదాయం తగ్గింది. తక్షణమే రాష్ట్రానికి జరిగే నష్టాన్ని కేంద్రమే పూడ్చాలని కోరతామని' రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్, ఎంపీలు బలరాం నాయక్, రఘురాం రెడ్డి, సింగరేణి సీఎండీ బలరాం, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.





# నాగార్జున సాగర్‌కు భారీగా వరద.. 26 గేట్లు ఎత్తి నీటి విడుదల

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు మరోసారి వరద ఉధృతి పెరిగింది. ఈ సీజన్‌లో 26 క్రస్ట్ గేట్లు తెరుచుకోవడం ఇది ఐదోసారి. భారీగా వరద వచ్చి చేరుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. 16గేట్లు ఐదు అడుగులు, 10 గేట్లు పది అడుగుల మేర పైకి ఎత్తి, స్పిల్ వే ద్వారా 2,68,749 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో 3,21,023 క్యూసెక్కులు వస్తుండగా, అంతే ఔట్‌ఫ్లోను దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 587.00 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 305.50 టీఎంసీలుగా కొనసాగుతోంది. జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

# వందే భారత్ వస్తోంది... గోల్కొండ ఆపేయండి!

నల్గొండ: 'ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చింది' అన్నచందంగా వందేభారత్ సూపర్ ఫాస్ట్ రైళ్ల రాకపోకల మూలంగా ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ల రైళ్లను గంటల కొద్ది ఆపడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మధ్యాహ్న సమయంలో యాదాద్రి భువనగిరి, ఆలేరు, జనగామ, కాజీపేట, వరంగల్‌కు వెళ్లే ప్రయాణికులు గోల్కొండ రైలు ఎక్కాలంటేనే వామ్మో అంటున్నారు.



ఆర్టీసీ బస్సుల్లో సీట్లు దొరక్క రైలు ఆశ్రయిస్తే గంటల తరబడి నిలిపివేస్తూ రైల్వేశాఖ ప్రయాణికులకు చుక్కలు చూపుతోంది.

**సరిపడ ట్రాకులున్నా..**

సికింద్రాబాద్- యాదాద్రి భువనగిరి- కాజీపేట జంక్షన్ రైలు మార్గంపై విశాఖపట్నం, నాగ్‌పూర్‌లకు వెళ్లే రెండు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం ఒంటి గంట మధ్య రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రైళ్లను కేవలం సికింద్రాబాద్ ఆ తర్వాత వరంగల్ రైల్వే స్టేషన్‌లలో మాత్రమే నిలుపుదల చేస్తున్నారు. వీటి కోసం కాజీపేట జంక్షన్ వయా భువనగిరి నుంచి సికింద్రాబాద్‌కు, సికింద్రాబాద్–భువనగిరి–కాజీపేటల మధ్య ప్రయాణం చేయాల్సిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లను అదేపనిగా గంటల తరబడి నిలిపివేస్తున్నారు. ప్రయాణించే సమయం పెరగడమే కాకుండా ప్రయాణికుల విలువైన సమయం వృథా అవుతోంది. రైల్వే ట్రాక్‌లు సరిపడా ఉన్నా ఎందుకు ఇలా నిలిపేస్తున్నారని అధికారులను అడిగితే సమాధానం ఇవ్వడం లేదు. యాదాద్రి భువనగిరి రైల్వేస్టేషన్‌లో డిజిటల్ డిస్‌ప్లే కోచ్ పొజిషన్ సిస్టం లేకపోవడంతో మ్యాన్‌వల్‌గానే రైల్వే టీసీ సిబ్బంది రైళ్లకు సంబంధించిన రిజర్వేషన్ కోచ్‌ల సమాచారం చదివేస్తున్నారు. ఇలా చేయడం వల్ల నిమిషం సేపు నిలిచే సూపర్‌ఫాస్ట్ రైలు ఎక్కే ప్రయాణికులు గాబరా పడుతున్నారు. వెంటనే డిజిటల్ డిస్‌ప్లే ఏర్పాటు చేయాలని ఎన్ని విజ్ఞప్తులు వెళ్లినా అధికారులు పట్టించుకోవడం లేదు.

**భువనగిరి స్టేషన్‌పై చిన్నచూపు...** భువనగిరి రైల్వేస్టేషన్‌లో ఉన్న మూడు ప్లాట్‌ఫారాంలపై మొత్తం 26 రైళ్లు మాత్రమే నిలుపుదల చేస్తున్నారు. వాటిలో 8 సూపర్‌ఫాస్ట్‌లు, 4 మెము ప్యాసింజర్లు, 14 ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. దక్షిణ్, గౌతమి, సిర్పూర్ కాగజ్‌నగర్, కృష్ణా, పుష్‌పుల్, కాకతీయ, భాగ్యనగర్, గోల్కొండ, ఈస్ట్‌కోస్ట్, బీదర్, ఇంటర్‌సిటీ రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. వందేభారత్, తెలంగాణ, శాతవాహన, పద్మావతి తదితర రైళ్లు ఆగడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. సికింద్రాబాద్‌కు దాదాపు 49 కిలోమీటర్ల దూరంగా ఉండే శ్రీయాదగిరి లక్ష్మీనరసింహస్వామి కొలువైన ఈ జిల్లా ప్రధాన రైల్వేస్టేషన్‌కు ద.మ.రై. ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణ రైజింగ్ కోర్ అర్బన్ అభివృద్ధిపై సీఎం రేవంత్ స్పెషల్ ఫోకస్

హైదరాబాద్, సెప్టెంబర్ 22 : తెలంగాణ రైజింగ్ కోర్ అర్బన్ ఏరియా అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇవాళ(సోమవారం) వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు అధికారులు. ఐదు ప్రధాన అంశాల ప్రాతిపదికన అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సీఎంకు వివరించారు అధికారులు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక వెండింగ్ జోన్స్‌ను ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. మల్టీ స్టోరేజ్ బిల్డింగ్స్, ఫైర్ సేఫ్టీ అంశాలపై పలు సూచనలు చేశారు ముఖ్యమంత్రి. వీధి దీపాలకు సోలార్ విద్యుత్ వినియోగం, కొత్తగా పునరుద్ధరిస్తున్న చెరువుల వద్ద పైలట్ ప్రాజెక్టుగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. కోర్ అర్బన్ రీజియన్‌లో వీధుల ఆధునీకరణ, సుందరీకరణ చేపట్టాలని మార్గనిర్దేశం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు ముఖ్యమంత్రి.



విద్యుత్ సబ్ స్టేషన్ల అప్ గ్రేడేషన్‌తో పాటు, విచ్చలవిడిగా ఉన్న ట్రాన్స్ ఫార్మర్లను స్ట్రీమ్ లైన్ చేసి రీ–లొకేట్ చేయాలని దిశానిర్దేశం చేశారు సీఎం. మంచినీటి, మురుగునీటి వ్యవస్థపై నిర్వహణ వేర్వేరుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతుల విషయంలో వివిధ విభాగాల మధ్య సమన్వయం ఉండేలా చూసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# 923 ఎకరాలను ఆక్రమణల నుంచి రక్షించాం: హైడ్రా కమిషనర్



హైదరాబాద్: ఇప్పటివరకు మొత్తం 923 ఎకరాలను ఆక్రమణల నుంచి రక్షించామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు రూ.50 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు రక్షించినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో దాదాపు 60 చెరువులు కనుమరుగయ్యాయని చెప్పారు. ఆరు చెరువులకు పూర్తిగా పునరుజ్జీవం కల్పించినట్లు వివరించారు. "గాజులరామారంలో కొందరు రౌడీషీటర్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. ఆదివారం అక్కడి ప్రభుత్వ భూమిలోని ఆక్రమణలనే తొలగించాం. ఇందులో నకిలీ పట్టాలు తీసుకుని నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ భూమిలోని 260 నిర్మాణాలను తొలగించాం. ప్రస్తుతం 51 డీఆర్‌ఎఫ్ బృందాలు ఉన్నాయి. త్వరలోనే 72కు పెంచుతాం. నగరంలో 150 మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ ఉన్నాయి. నాలాల వద్ద ఆక్రమణలు గుర్తించి తొలగిస్తున్నాం. వాటిలో పూడిక తొలగింపును ముమ్మరం చేశాం. వర్షం నీరు చెరువుల్లోకి వెళ్లే పరిస్థితి, నీరు నిల్వ చేసే పరిస్థితి లేదు. కాంక్రీటైజేషన్ వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకడం లేదు. అధిక కాలుష్యం వల్ల నగరాల్లోనే వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయి. భవిష్యత్ అంతా యువతరానిదే కాబట్టి పార్కులు, చెరువుల గురించి జన్ జడ్ ఆలోచించాలి" అని రంగనాథ్ సూచించారు.



# కారు పార్టీ.. అక్రమంగా తెచ్చిన లగ్జరీ కార్లపై నడుస్తోందా..?

హైదరాబాద్: కారు పార్టీ అక్రమంగా తెచ్చిన లగ్జరీ కార్లపై నడుస్తోందా? అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. "లగ్జరీ కారు స్కామ్ నిందితుడు బసరత్ ఖాన్ దిగుమతి చేసిన ల్యాండ్ క్రూజర్లలో కేటీఆర్ ఎందుకు తిరుగుతున్నారు? ఆ కార్లు కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన కంపెనీల పేర్లతో ఎందుకు రిజిస్టర్ అయ్యాయి? మార్కెట్ ధర చెల్లించారా? లేదా తక్కువగా చూపించి కొనుగోలు జరిగిందా? పేమెంట్లు బినామీ పేర్లతో జరిగాయా? నకిలీ ఆదాయమా? లేదా మనీలాండరింగ్ ద్వారానా? ఈ స్కామ్‌లో కేసీఆర్ కుటుంబం నేరుగా ప్రయోజనం పొందినట్లు అనుమానించాల్సి వస్తోంది. వాస్తవాలు బయటకు రావాలి.. సంబంధిత శాఖలు దర్యాప్తు చేయాలి" అని బండి సంజయ్ అన్నారు.

# హైడ్రా బుల్డోజర్ పేదల ఇళ్లపైకే వెళ్తుంది.. పెద్దల ఇళ్లకు వెళ్లదు: కేటీఆర్



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చివేస్తోందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెలవు రోజుల్లో కూల్చివేతలు వద్దని హైకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. కానీ ఆదివారం సెలవురోజునే గాజులరామారంలో పేదల ఇళ్లు కూల్చారని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే.. బుల్డోజర్ రాజ్యానికి లైసెన్స్ ఇచ్చినట్లే అని వ్యాఖ్యానించారు. హైడ్రా బుల్డోజర్ పేదల ఇళ్లపైకే వెళ్తుందని.. పెద్దల ఇళ్లకు వెళ్లదన్నారు. "భారత రాష్ట్ర సమితి కార్యకర్త సర్దార్ ఇంటిని ప్రభుత్వం కూల్చివేసింది. ఆయనకు మళ్లీ ఇల్లు నిర్మించి ఇచ్చే బాధ్యత నాది. నిన్న మోదీ హెచ్1 బీ వీసా గురించి మాట్లాడతారని ఆశించాం. దాని గురించి మాట్లాడకుండా జీఎస్టీ పండగ అని చెప్పారు. నిన్నటి వరకు రక్తం తాగి.. ఇప్పుడు పండగ చేసుకో అంటున్నారు. జీఎస్టీ పేరు మీద 8 ఏళ్ల పాటు ప్రజల నుంచి ఎంతో భారం వేశారు. మోదీ గతంలో చెప్పినట్లు ప్రజలందరికీ రూ.15 లక్షలు ఇస్తే పండగ చేసుకుంటాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.



# వరంగల్ శ్రీ భద్రకాళీ అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు

దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని వరంగల్‌లోని శ్రీ భద్రకాళీ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తొలిరోజు బాలా త్రిపురసుందరీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం ఉదయం నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు.




# పాలకవీడు డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద ఉద్రిక్తత

## పాలకవీడు డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద ఉద్రిక్తత.. ఎస్సై, కానిస్టేబుళ్లకు గాయాలు

నేరేడుచర్ల: సూర్యాపేట జిల్లా పాలకవీడు డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిన్న వారాంతపు సెలవు రోజున వినోద్ (45) అనే కార్మికుడు అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అతడిని సిమెంట్ పరిశ్రమలోని ఆస్పత్రికి తోటి కార్మికులు తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ బిహార్ కార్మికులు ఆందోళనకు దిగారు. సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద ధర్నాకు దిగారు. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకొని ఆందోళనల్ని అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఘటనాస్థలం వద్దకు వచ్చిన పోలీసులపైనా కార్మికులు దాడికి దిగారు. ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లను పరుగెత్తించి కర్రలతో దాడి చేశారు. బిహార్ కార్మికుల దాడిలో ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక హోంగార్డుకు గాయాలయ్యాయి.

పోలీసుల వాహనంపైనా రాళ్లు రువ్వారు. పరిశ్రమ కార్యాలయం అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం చేశారు. 200 మందికి పైగా బిహార్ కార్మికులు ఉండటంతో సిబ్బంది చేతులెత్తేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేసే వరకు ధర్నా కొనసాగిస్తామని కార్మికులు తెలిపారు. స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఆందోళన విరమించేదిలేదని తేల్చి చెప్పారు. అయితే, ఇక్కడి పరిస్థితిని ఎస్సై తన పైఅధికారులకు సమాచారం ఇవ్వడంతో పెద్ద సంఖ్యలో పోలీసులు చేరుకొని కార్మికులను చెదరగొట్టారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితి అదుపులోకి వచ్చింది. కార్మికులు ఒకరిద్దరు వస్తే పరిహారం గురించి మాట్లాడతామని కంపెనీ యాజమాన్యం చెబుతోంది.



# 'ఫోన్ ట్యాపింగ్ కేసు.. విచారణకు ప్రభాకర్‌రావు ఏమాత్రం సహకరించడం లేదు'

దిల్లీ: తెలంగాణలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావు మధ్యంతర బెయిల్ రద్దు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ వాయిదా పడింది. రెండు వారాలకు వాయిదా వేస్తున్నట్లు అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. తదుపరి విచారణ వచ్చేనెల 8న చేపడతామని న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న వెల్లడించారు. ఈ కేసులో విచారణకు ప్రభాకర్‌రావు ఏమాత్రం సహకరించడం లేదని మరోసారి కోర్టుకు సొలిసిటర్ జనరల్ (ఎస్‌జీ) తుషార్ మెహతా చెప్పారు.

ప్రభుత్వం ఇచ్చిన ల్యాప్‌టాప్, కంప్యూటర్ల పాస్‌వర్డ్ చెప్పేందుకు ఆయన సహకరించడం లేదన్నారు. విచారణకు సహకరించని ప్రభాకర్‌రావు మధ్యంతర బెయిల్ రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థలూథ్రా కోరారు. కోర్టు నోటీసులు జారీ చేసిన తర్వాత రాష్ట్రానికి రాకుండా వేరే చోట నుంచి అమెరికా పారిపోయారన్నారు. ఆయన ఇంట్లో కంప్యూటర్ నుంచి ఆధారాలు తొలగించారన్న విషయంపైనా దర్యాప్తు చేయాల్సి ఉందని చెప్పారు. అధికారికంగా ఇచ్చిన ల్యాప్‌టాప్, కంప్యూటర్, మొబైళ్లను ఫ్యాక్టరీ రీసెట్ చేసి ఆధారాలన్నీ చెరిపేసినట్లు ఫోరెన్సిక్ నివేదికలో స్పష్టమైందని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజకీయ నేతలు, అధికారుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని.. కానీ వాటన్నింటినీ తొలగించే ప్రయత్నాలు చేశారని పేర్కొంది. గుర్తు లేదు.. తెలీదు అన్న రీతిలో ప్రభాకర్‌రావు సమాధానం ఇస్తున్నారు తప్ప.. దర్యాప్తునకు ఏమాత్రం సహకరించడం లేదని తుషార్ మెహతా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

ప్రభుత్వం మారినప్పుడు అధికారులు తమకు ఇచ్చిన అన్ని పరికరాలను యథాతథంగా వెనక్కి ఇవ్వాలని నిబంధనలు ఉన్నాయని.. కానీ వాటిని తుంగలోతొక్కి డేటా మొత్తాన్ని ప్రభాకర్‌రావు డిలీట్ చేశారన్నారు. విచారణకు ఎప్పుడు పిలిచినా ప్రభాకర్‌రావు వెళ్లారని ఆయన తరఫు సీనియర్ న్యాయవాది శేషాద్రినాయుడు కోర్టుకు తెలిపారు. 15 సార్లు విచారించారన్నారు. రాజకీయ కారణాలతో ఆయన్ను వేధిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరినీ పిలిచి ప్రభాకర్‌రావుకు వ్యతిరేకంగా స్టేట్‌మెంట్ ఇవ్వాలని బలవంతంగా సంతకాలు చేయిస్తున్నారని తెలిపారు. మధ్యంతర బెయిల్ రద్దు చేయాలన్న పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం ఇవ్వాలని శేషాద్రి నాయుడు కోరగా.. రెండు వారాల సమయమిస్తూ విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

# ఇద్దరు మావో స్థంబాల కొల్చివేత

(మొదటి పేజీ తరువాయి)సభ్యులకు వివిధ స్థాయిల వార్డ్ కమిటీలకు, జైల్లా, బందీలుగా ఉన్న పార్టీ నాయకులకు, పార్టీ సభ్యులకు, విప్లవాభిమానులకు, ప్రజాస్వామిక, ప్రగతిశీల, వామపక్ష శక్తులకు, సంస్థలకు పిలుపునిస్తున్నాం. భారత విప్లవోద్యమం ఓటమి పాలయిందని చెప్పుతూ, దీనికి కారణం పార్టీ అనుసరించిన అతివాద ఒంటెత్తుపోకడతో కూడిన తప్పిదాలని కామ్రేడ్ సోను 'విప్లవ ప్రజలకు విజ్ఞప్తి' అనే ప్రకటనలో పేర్కొన్నాడు. పార్టీ అతివాద ఎత్తుగడలను ఆదరించిందని తను అనుకుంటే పార్టీలో ఉంటూ వాటిని సరిదిద్దడానికి కృషి చేయడం పోలిట్ బ్యూరో సభ్యుడిగా ఆయన బాధ్యత. కానీ ఆయన ఈ విప్లవకర పద్ధతికి తిలోదకలిచ్చి జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకున్నాడు.

"ఇప్పటికైనా, దీర్ఘకాల ప్రజాయుద్ధ సంధా అంటూ, సాయుధ పోరాటం అంటూ, పరిస్థితులలోని మార్పులతో, స్థలకాలాలతో నిమిత్తం లేకుండా, చైనా పంథా, రష్కా పంథా అనే పిడివాద ఆచరణకు స్వస్తి చెప్పి భారతదేశ స్థలకాల పరిస్థితులకు తగిన పంథాలో భారత విప్లవాన్ని జయప్రదం చేయడానికి పూనుకోవడమే పార్టీ ముందు మిగిలిన ఏకైక కర్తవ్యం" అని 'విప్లవ ప్రజలకు విజ్ఞప్తి' ప్రకటనలో పేర్కొన్నాడు. పార్టీ అనుసరిస్తున్న మార్గం పిడివాదమయితే తను ప్రత్యమ్నాయ మార్గాన్ని రూపొందించి పార్టీలో రెండు పంథాల మధ్య పోరాటాన్ని నడపవచ్చు. అందుకు ఆయన సిద్ధంగా లేడు. సాయుధ పోరాటాన్ని తిరస్కరిస్తూ తాత్కాలిక సాయుధ పోరాట విరమణ అని ప్రకటించడం అంటే పార్టీ కాడర్లను, ప్రజలను మోసగించడమే అవుతుంది.

మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతం ప్రకారం విప్లవపు కేంద్ర కర్తవ్యం రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడం. అందుకోసం సాయుధ శక్తితో, సాయుధ పోరాటం చేస్తాం. దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలోనయినా, సార్వత్రిక తిరుగుబాటు పంథాలోనయినా సాయుధ శక్తి ద్వారానే దోపిడీ వర్గాలను అధికారం నుండి కూలదోసి పీడిత వర్గాలు అధికారాన్ని హస్తగతం చేసుకుంటాయి. మనదేశం అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశం కాబట్టి ప్రాంతాల వారీగా అధికారాన్ని హస్తగతం చేసుకునే దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను మా పార్టీ ఆచరిస్తోంది. కాబట్టి ఆయుధాలు వదిలి శాంతిచర్చలకు వెళ్లాలని నిర్ణయించడం మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతానికి, మా రాజకీయ-మిలిటరీ పంథాకు వ్యతిరేకమైనది. ఆయుధాలు వదిలిపెట్టడం అంటే వాటిని శత్రువుకు అప్పగించడమని, శత్రువుకు లొంగిపోవడం (సరెండర్) అని అర్థం. శత్రువుకు ఆయుధాల్ని అప్పగించి, లొంగిపోయి తాత్కాలిక సాయుధ పోరాట విరమణ పేరుతో సాయుధ పోరాటాన్ని విరమించడం అంటే విప్లవ పార్టీ రివిజనిస్టు పార్టీగా మారిపోవడమే అవుతుంది. ఆయుధాల్ని శత్రువుకు అప్పగించి లొంగిపోవడం అంటే అమరులకు, దేశంలోని విశాల ప్రజలకు (పీడిత వర్గాలు, పీడిత సాంఘిక సముదాయాలు, పీడిత జాతులు) ద్రోహం చేయడమే. ఇది ప్రచండ తరహా ఆధునిక రివిజనిజం, విప్లవ ద్రోహం. అందుకే, ఆయుధాల్ని శత్రువుకు అప్పగించి, శత్రువుకు లొంగిపోవడానికి సిద్ధపడుతున్న సోను విప్లవ ద్రోహాన్ని పార్టీ సభ్యులు, అన్నిస్థాయిల పార్టీ కమిటీలు, జైల్లోని పార్టీ సభ్యులు, పార్టీ నాయకులు, విప్లవాభిమానులు తీవ్రంగా ఖండించాల్సిందిగా కోరుతున్నాం. ఆయన. ఆయన అనుచరులు శత్రువుకు లొంగిపోదల్చుకుంటే లొంగిపోవచ్చు, కానీ పార్టీకి చెందిన ఆయుధాల్ని శత్రువుకు అప్పగించే అధికారం వీళ్లకు లేదు. అందుకే వాటిని పార్టీకి అప్పగించాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాం. ఒకవేళ వాళ్లు సామరస్యపూర్వకంగా అప్పగించకపోతే వారినుండి ఆయుధాల్ని స్వాధీనం చేసుకోవాల్సిందిగా పీ.ఎల్.జీ.ఏ.ను. నిర్దేశిస్తున్నాం. సాయుధ పోరాటాన్నే తిరస్కరిస్తున్న ఆయన తాత్కాలిక సాయుధ పోరాట విరమణ అని ప్రకటించడం మోసకారితనమే అవుతుంది. ఆయన అనుసరించదలచుకున్న మార్గం పార్లమెంటరీ పంథానే అవుతుంది. అందుకే అది ప్రచండ తరహా నయారివిజనిజం అవుతుంది. ఈ స్థితిలో ఆయనకు అభయ్ పేరుతో పత్రికా ప్రకటనలు ఇచ్చే అధికారం లేదని తెలియజేస్తున్నాం. మా పార్టీ మౌలిక పంథాకు, పాలసీలకు, తీర్మానాలకు కట్టుబడి రాజకీయ పరిణామాలపై పార్టీ వైఖరి తెలియజేస్తూ, ప్రజలకు పోరాట పిలుపుల్ని ఇవ్వడం మీడియా ప్రతినిధి అభయ్ బాధ్యత. దీనికి పూర్తి భిన్నమైన వైఖరిని చేపట్టిన ఆయనకు అభయ్ పేరుతో ప్రకటనలు ఇచ్చే అధికారం లేదు.

కేంద్రకమిటీ విడదల చేస్తున్న ఈ ప్రకటనతో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకే ఎస్.జెడ్.సీ.) పూర్తిగా ఏకీభవిస్తోంది. ఈ పత్రికా ప్రకటనను దండకారణ్యంలోని అన్ని ప్రజా సంఘాలకు, ఇతర అన్ని స్థానిక నిర్మాణాల వద్దకు ప్రజల వద్దకు తీసుకెళ్లి ప్రజలను, ప్రజా నిర్మాణాలను విప్లవోద్యమంలో దృఢంగా నిలబెట్టే రాజకీయ, నిర్మాణ కృషి చేయాల్సిందిగా డీకేలోని పార్టీ సభ్యులందరికీ, అన్ని స్థాయిల పార్టీ కమిటీలకు, కమాండ్లకు పిలుపునిస్తున్నాం.


ఇప్పటికీ మా పార్టీ శాంతిచర్చలకు సిద్ధమేనని తెలియజేస్తున్నాం. శాంతిచర్చల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించేలా వాటిపై ఒత్తిడి తేవడానికి దేశవ్యాప్త ప్రజా ఉద్యమాన్ని నిర్మించాల్సిందిగా పౌరసమాజానికి, యావత్తు ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నాం..

విప్లవ ప్రతిఘాతక కగార్ యుద్ధంతో మన పార్టీ, పీ.ఎల్.జీ.ఏ., యావత్తు విప్లవోద్యమం తీవ్రంగా నష్టపోతున్న స్థితిలో శత్రుదాడికి వెరచి. ఆయుధాల్ని శత్రువుకు అప్పగించి, శత్రువుకు లొంగిపోవడం అంటే అమరులకు, ప్రజలకు ద్రోహం చేయడమే అవుతుంది. ఆ ద్రోహాన్ని తిరస్కరించి మారిన సామాజిక పరిస్థితులకు తగినట్టుగా, వెనకంజలో వున్న విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి తోడ్పడేలా. వర్గపోరాటాన్ని-ప్రజాయుద్ధాన్ని కొనసాగించడమే మన కర్తవ్యం, విప్లవోద్యమంలో వెనకంజలు, ఓటములు తాత్కాలికమే. అంతిమ విజయం ప్రజలదే. ఈ భూమ్మీద మనిషిని మరో మనిషి దోచుకోవడానికి అవకాశంలేని సమాజం కోసం చేల ఏండ్లుగా వర్గపోరాటం సాగుతూనే ఉంది. ఈ వర్గపోరాట మహాప్రస్థానం గెలుపు-ఓటమి అంతిమంగా గెలుపు అనే క్రమం గుండా సాగుతోంది. ఈ మహాప్రస్థానపు తుది విజయం భూమిపై సోషలిజం-కమ్యూనిజం స్థాపనే. అందుకోసం విప్లవోద్యమ వెనకంజలకు, ఓటములకు బెదరకుండా మనదేశంలో, ప్రపంచంలో సోషలిజం-కమ్యూనిజం స్థాపన కోసం మనవంతుగా వర్గపోరాటాన్ని- ప్రజాయుద్ధాన్ని కొనసాగించడమే మన కర్తవ్యం-మన మార్గం. విప్లవాభినందనాలతో,

అభయ్ కేంద్ర కమిటీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

అధికార ప్రతినిధి, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# "సైకో" పితామహుడు సిగ్మండ్ ఫ్రాయిడ్ - సెప్టెంబర్ 23... ఫ్రాయిడ్ వర్ధంతి



ఆధునిక విజ్ఞానమనే మహా భవనానికి మూల స్తంభాలలో ఒకరు సిగ్మండ్ ఫ్రాయిడ్. వైద్య శాస్త్రానికి, వైద్య శాస్త్రజ్ఞులకు, మానసిక శాస్త్రజ్ఞులకు, మానసి క శాస్త్రాధ్యాపకులకు, తాత్వికు లకు విజ్ఞాన ప్రదాత. జగమం తా సెక్స్ మయంగా చూసిన ఫ్రాయిడ్ ఒక శతాబ్దం పాటు ప్రపంచంలో ఎన్నో రంగాల్ని ప్రభావితం చేశాడు. ఐన్ స్టీన్, మార్క్స్, డార్విన్ కోవలో ఫ్రాయిడ్ ను చేర్చిన సందర్భా లు లేకపోలేదు. తన సుదీర్ఘ జీవితంలో అనేక వ్యతిరేక పరిస్థితుల్ని, కష్టాల్ని, దారిద్ర్యాన్ని, వాటివల్ల కలిగే నైరాశ్యాన్నీ ఎదుర్కొన్నా, తన అన్వేషణను మాత్రం దీక్షగా కొనసాగించి, మనకు మానసిక విశ్లేషణా పద్ధతి (%ూంఎష్ట్రశీ ాబఖ్రశీఎంఱం%) స్వప్నాల అర్థాల ఆవిష్కరణ లాంటి విషయాలను అందించి న మహా మనీషి ఫ్రాయిడ్. ఎన్నో విజ్ఞాన గ్రంథాల, ఇతర వ్యాసాల, పరిశోధనల ఆధారం గా రచించలే కాక, విశేషంగా పర్యటిస్తూ, ఉపన్యాసాలు ఇస్తూ, చర్చా సదస్సులలో పాల్గొంటూ మానవ జాతికి జాగృతం చేసే చైతన్య వంతమైన జీవితం గడిపాడు. వైద్య శాస్త్రానికి, ప్రత్యేకించి మానసిక విశ్లేషణా పద్ధతికి ఆద్యుడయిన సిగ్మండ్ ఫ్రాయిడ్ జీవితం మానసిక వైద్యులకు మార్గ దర్శకం. మనిషి మనస్సులో 'అ చేతనం' (అన్ కాన్షియస్ నెస్) అనేది ఉంటుంది. అది మన ప్రవర్తనను మనకు తెలియ కుండానే ప్రభావితం చేస్తుంది' అన్న ఫ్రాయిడ్ విశ్లేషణ.. మనస్తత్వ విశ్లేషణలో తారక మంత్రమైంది. సిగ్మండ్ ఫ్రాయిడ్ 1856, మే 6న జెకేస్లోవేకియాలోని ఫ్రీ బెర్గ్‌లో జన్మించాడు. 1860లో వారి కుటుంబ మంతా వియన్నాకు తరలి పోయింది. పేదరికం లోనూ కష్టపడి చదివి గ్రీస్, లాటిన్, గణితం, ప్రకృతి శాస్త్రా లు, చరిత్రలను ఒంట పట్టించు కున్న ఫ్రాయిడ్.. 1873లో వియన్నా విశ్వ విద్యాలయంలో వైద్య శాస్త్రంలో చేరాడు. నాటికి అదే వైద్య శాస్త్రంలో ప్రపంచ రాజధాని. వియన్నా యూనివర్సిటీలో 1881లో ఫ్రాయిడ్ మెడిసిన్ డిగ్రీ పుచ్చు కున్నాడు. వియన్నా జనరల్ ఆస్పత్రిలోనే పనిచేశాడు. తరువాత 1883 నుంచీ నరాలపై దృష్టి పెట్టి అధ్యయ నం చేస్తూ నిపుణుడుగా తేలాడు. పారిస్‌లో అప్పటికే జీమార్టిన్ చార్కాట్ సుప్రసిద్ధు డుగా వున్నాడు. ఫ్రాయిడ్ 1885లో చార్కాట్ వద్ద అధ్యయనం చేశాడు. (1885-1886) తరువాత మెదడుపై ప్రత్యేక పరిశీలన మొదలు పెట్టి, రచనకు పూను కున్నాడు. ఫ్రాయిడ్ యిష్ట పడిందీ, అసలు చికిత్సగా నమ్మిందీ మనో విశ్లేషణ (సైకో ఎనాలసిస్). దీనివల్ల ఆయన పేరు, ప్రపంచ ఖ్యాతి వచ్చా యి. కొత్తపేర్లు ప్రచారంలోకి తేవడంలో, ఉపమానాలు వాడడంలో, గ్రీక్ రోమన్ గాథల నుండి ఉదాహరణల స్వీకరించ డంలో ఫ్రాయిడ్ దిట్ట. 30వ యేట నరాల జబ్బులను కుదిర్చే డాక్టర్‌గా జీవితాన్ని ఆరంభించిన ఫ్రాయిడ్ అనువా దాలు, పుస్తక సమీక్షలు చేసేవాడు. విద్యుత్ చికిత్స, హిప్నాసిస్ (మోహనిద్ర) చికిత్సలు క్రమంగా విరమించి, కొత్త సిద్ధాంతంతో, సరికొత్త పదజాలంతో ఫ్రాయిడ్ తన ప్రాక్టీసు అవతారాన్నే మార్చేశాడు. ఆయనను ప్రపంచం గుర్తించింది. నరాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఫ్రాయిడ్ తన తొలి రచన 1891లో వెలువరించాడు. నరాల విషయంలో అది గొప్ప గ్రంథంగా పేరొందింది. 1883లో నరాల పరిశీలన ఆరంభించిన ఫ్రాయిడ్ 1897 వరకూ అందులో నిమగ్నుడయ్యాడు. ఫ్రాయిడ్ కొత్తగా వైద్యం ప్రాక్టీసు చేస్తున్న రోజులలో ఎలక్ట్రో థెరపీ వుండేది. "స్టడీస్ ఇన్ హిస్టీరియా" అనే రచనలో ఫ్రాయిడ్ "ఎలక్ట్రో థెరపీ" గురించి ప్రస్తావించాడు. ఫ్రాయిడ్ సెక్స్ సిద్ధాంతాలు ప్రపంచాన్ని బాగా ఆకర్షించాయి. గనేరియా, సిఫిలిస్ వంటి లక్షణాలు దృష్టిలో పెట్టుకొని ఫ్రాయిడ్ తన సెక్స్ సిద్ధాంతంలో వివరణ యిచ్చా డు. క్రమేణా "సైకో ఎనాలసిస్", అనే ఫ్రాయిడ్ సిద్ధాంతం పుంజుకున్నది. హిస్టీరియా, కలలు, కోర్కెల్ని అణచు కోవడం, చిన్న తనంలో సెక్స్, అచేతనం అనేవాటిని ఫ్రాయిడ్ ప్రచారంలోకి తెచ్చాడు. ఇరవ య్యో శతాబ్దం ఆరంభంలోనే ఫ్రాయిడ్ తన సిద్ధాంత రచనలు లోకానికి చాటాడు. దీని ఆచరణకు ఉపక్రమించిన వారు సైకో ఎనాలసిస్ ను ఒక ఉద్యమంగా స్వీకరించారు. ఎదురు చెప్పడానికి భయ పడ్డారు. ఫ్రాయిడ్ పలుకుబడి అలా వుండేది. మానసిక రుగ్మతులకు సరైన చికిత్స చేయడానికి దోహద పడే క్లినికల్ న్యూరాలజీకి సంబంధించి చాలా రకాల అధ్యయనం చేసిన ఫ్రాయిడ్.. న్యూరాలజీ, మెదడు పని చేసే విధానం గురించి అనేక పరిశోధక పత్రాలు ప్రచురిం చారు. "సైకో అనాలసిస్" అన్న పదం వాడిందీ, ఆ అంశం ఒక సబ్జెక్టుగా అభివృద్ధి చేసిందీ ఫ్రాయిడ్. సైకో అనాలసిస్‌ను ఫ్రాయిడ్ ఒక థెరపీగా ప్రతిపాదిస్తూ వ్యాసాలు రాశాడు. నరాల జబ్బుకు లైంగిక సంబంధమైన మూలం వున్నద ని, సెక్స్ కారణాలుగా జబ్బులు వస్తాయని అనేక ఉపమా నాలు, కథలు, గ్రీకు గాథలు ఉదహరించి, విస్తారంగా వివరించాడు. "సైకో ఎనాల సిస్". అంటే "మనో విశ్లేషణ" ప్రపంచ ఉద్యమంగా వ్యాపించి, సంఘాలు వెలిశాయి. రోగిని మాట్లాడనిచ్చి, అతని పదాల లో అర్థాన్ని గూఢార్థాన్ని సంకేతాలను విప్పి చెప్పడం "సైకో ఎనాలసిస్ చికిత్స". ఈ విద్యలో ఫ్రాయిడ్ ఆరితేరిన వాడు. హిస్టీరియా అంటే ఏమిటి, అణచివేతకు అర్థం ఎలా చెప్పాలి, కలలు వాటి స్వభావం, చిన్నప్పటి సెక్స్ ప్రవృత్తి, అచేతనం బలం గురించి ఫ్రాయిడ్ చెప్పినవి ఆకర్షణీయంగా అంటుకు పోయాయి. సైకో ఎనాలసిస్ రంగంలో ఫ్రాయిడ్ సిద్ధాంతాలు ప్రచారంలో పెట్టడానికి యూంగ్ యాడ్లర్ కు తోడు, కార్ల్ అబ్రహం, విల్ హెల్మ్ స్టెకల్ వంటివారు బాగా కృషిచేశారు. ఫ్రాయిడ్ అనంతరం కారన్ హోర్నే, హారీస్టాక్ సల్లివన్, ఎరిక్ ఫ్రాంలు యీ రంగంలో నిలిచి పనిచేశారు. ఫ్రాయిడ్ మూలా ధారం అవ్యక్త మనస్సు. అదే వ్యక్తుల్ని కదిలించి, నడిపించి, మాట్లాడిస్తుంది. అంటే మానవుడిని అవ్యక్త మనస్సు నిర్దేశిస్తుంది. మానవుడి ప్రవర్తన గురించి "ది సైకోపాథాలజీ ఆఫ్ ఎవ్విరిడే లైఫ్" లో ఫ్రాయిడ్ వివరించాడు. మెదడు పనితీరుపై అనేక పరిశోధనలు చేసి, ఆస్ట్రియా, జర్మనీ, ఫ్రాన్స్ లలో జీవించిన ఫ్రాయిడ్, తన చివరి రోజులలో హిట్లర్ నాజీ నియంతృత్వ ధోరణుల వల్ల ఇంగ్లాండ్ వెళ్ళి అక్కడే గడిపి కేన్సర్ తో 1939, సెప్టెంబరు 23న కన్ను మూశారు. "ది ఫ్యూచర్ ఆఫ్ ఇల్యూజన్" లో ఫ్రాయిడ్ మత విమర్శ చేశాడు. మతాన్ని ఆద్యంతాలు వ్యతిరే కించి, మతం అనేది ఒక భ్రమ అనీ, అయితే ఓదార్పు యిచ్చే విషయంగా అది పరిణమించిందనీ ఫ్రాయిడ్ అన్నాడు. మతం నుండి బయట పడిన వారు, స్వేచ్ఛగా సంపూర్ణ జీవనం సాగించగలరని కూడా ఫ్రాయిడ్ చెప్పాడు. దీనితో మతస్తులు ఆయనపై విరుచుకు పడ్డారు. సనాతన మత నమ్మకాలు గల కుటుం బంలో పుట్టిన ఫ్రాయిడ్ తనకు నాస్తికుడుగా పేర్కొన్నాడు. కాని జీవితమంతా యూదుగానే వున్నాడు. ఇరవయ్యో శతాబ్దంలో మానసిక ప్రపంచం లోని అంశాల గురించి శోధించడానికి ఫ్రాయిడ్ చేసిన పరిశోధనలే మూలంగా ప్రచార మొందాయి. ఫ్రాయిడ్ పరిశోధనలు విభిన్న రంగాలపై, ప్రాంతాలపై ప్రసరించాయి. సాహిత్య కళా రంగాలపై సైతం ఫ్రాయిడ్ ఆలోచనల ప్రభావం ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


# బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవ సేవలో అష్ట దిక్పాలకులు



కలియుగ వైకుంఠంలా అలరారుతోన్న తిరుమలలో ఏడాది వార్షిక (సాలకట్ల) బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజుల పాటు సాంప్రదాయ రీతిలో కన్నుల పండువగా కొనసాగ నున్నాయి. ఎందరో రాజులు, ఆర్కాటు నవాబులు, ఈస్టిండియా కంపెనీ ప్రతినిధులు, బ్రిటిష్ అధికారులు, తర్వాత హథీరాం మహంతుల హయాంలో ఉత్సవాలు కొనసాగాయి. ఒకప్పుడు నెలకు ఒకసారి బ్రహ్మోత్సవాలు జరిగేవట. కొన్ని ఇబ్బందులు, సమస్యల కారణంగా ఏడాదికి ఒకసారి, అధిక మాసంలో రెండుసార్లకు బ్రహ్మోత్సవాలు పరిమితం అయ్యాయి. భాద్రపదంలో నిర్వహించే ఉత్సవాలను సాలకట్ల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను సెప్టెంబర్ 23 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహించ నున్నారు. ఏడుకొండల స్వామికి తొలిసారిగా బ్రహ్మోత్సవాన్ని సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడే జరిపించినట్లు భవిష్యోత్తర పురాణం పేర్కొంటున్నది. బ్రహ్మదేవుడు స్వయంగా ఆరంభించిన ఉత్సవాలు కావటంతో, ఇవి 'బ్రహ్మోత్సవాలు' అయ్యాయనీ నవాహ్నిక దీక్షతో, నవబ్రహ్మలు తొమ్మిది రోజులు జరిపించే ఉత్సవాలు కాబట్టి ఇవి బ్రహ్మోత్సవాలనీ తిరుమలలో పెద్దయెత్తున జరిగేవి కాబట్టి వీటిని బ్రహ్మోత్సవాలు అంటారనీ పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీవారికి చేసే గొప్ప ఉత్సవాలు కాబట్టి వీటిని 'బ్రహ్మోత్సవాలు అంటున్నారనీ పలు విధాలుగా బ్రహ్మోత్సవాల గురించి చెపుతుంటారు. బ్రహ్మాది దేవతలచే కీర్తింప బడే కోనేటి రాయని బ్రహ్మోత్సవాలు నేటికీ ఘనంగా కొనసాగు తున్నాయి. భారతావనిలో నారాయణ పర్వతంపై సౌరమాన కన్యామాస ఏకాదశి సోమవారం శ్రవణా నక్షత్రంతో కూడిన సిద్ధ యోగ శుభ సమయాన వైకుంఠ నాథుడు శ్రీనివాసునిగా అవతరించాడని పద్మ పురాణం చెపుతున్నది. వేంకటేశ్వరుడు అర్చనామూర్తిగా ఆవిర్భవించింది ఆశ్వయుజ మాసంలో వచ్చే శ్రవణ నక్షత్ర శుభ ముహూర్తాన. రవి కన్యా మాసంలో ప్రవేశించిన తరువాత వచ్చే శ్రవణా నక్షత్రం రోజున అవబృద కార్యక్రమాన్ని నిర్ణయించుకుని దానికి తొమ్మిది రోజులు నవాహ్నిక బ్రహ్మోత్సవాలుగా నిర్వహిస్తారు. దసరా నవరాత్రులలో చక్రస్నానం నాటికి తొమ్మిది రోజుల ముందు మొదలయ్యే విధంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ధ్వజారోహణతో సకల దేవతలకు ఆహ్వానం పలికి, ధ్వజా వరోహణంతో ఆహ్వానితులైన దేవతలకు వీడ్కోలు పలికి ఉత్సవాలను ముగిస్తారు. స్వామివారి వాహనం గరుడుడు కాబట్టి, ఒక నూతన వస్త్రం మీద గరుడుని బొమ్మను చిత్రీకరిస్తారు. దీన్ని 'గరుడ ధ్వజ పటం' అంటారు. ధ్వజస్తంభం మీద ఎగిరే గరుడ పతాకమే సకల దేవతలకు స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానపత్రం. అష్ట దిక్పాలకులు, భూత, ప్రేత, యక్ష, రాక్షస, గంధర్వ గణాలకు ఇదే ఆహ్వానం. బ్రహ్మాండ నాయకునికి నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలకు సకల దేవతామూర్తులను ఆహ్వానిస్తారు. బ్రహ్మోత్సవాలలో తొలి దినం వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా గరుడ కేంద్ర ప్రతిష్ఠ, కంకణ ధారణ, ఆలయ ఆవరణంలోను, బయట, చుట్టూ అష్ట దిక్కు లలోనూ స్వామి వారు శ్రీదేవి, భూదేవి సమేతంగా సపరివార దేవతలతో ఊరేగుతూ ఉండగా అష్ట దిక్పాలకులు ఆహ్వానింప బడతారు. అనంతరం స్వామి వారు ఆలయంలో ప్రవేశించి ధ్వజస్తంభం దగ్గరకు చేరు కుంటారు. మిగిలిన పరివార దేవతలైన అనంత, గరుడ, విష్వక్సేన, సుగ్రీవ, హనుమంత, అంగదుడు విమాన ప్రదక్షణలో ఉన్న మండపంలోకి చేరుకుంటారు. తదుపరి శ్రీదేవి, భూదేవి, మలయప్ప స్వామి వారి సమక్షంలో వేద గానాల మధ్య మంగళ వాయిద్యాలు మ్రోగుతుండగా అర్చక స్వాములు ధ్వజస్తంభంపై గరుడ ధ్వజాన్ని (గరుడ పటాన్ని ఎగురు వేస్తారు) దీనితో ధ్వజారోహణ కార్యక్రమం పూర్తి అవుతుంది. అయితే స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పుణ్య స్థలిలో ఎనిమిది దిక్కులలో కొలువై ఉండి, బ్రహ్మోత్సవాల విజయవంతంలో అష్ట దిక్పాలకులదే ప్రధాన పాత్ర. తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరం అనేవి నాలుగు దిక్కులు. ఆగ్నేయం, నైరుతి, వాయవ్యం, ఈశాన్యం అనేవి నాలుగు మూలలు లేక నాలుగు విదిక్కులు. ఈ ఎనిమిదింటిని కలిపి అష్ట దిక్కులని పేరు. ఈ అష్టదిక్కులకు పాలకులైన వారికి సంబంధించిన విశేషాలు... అష్ట దిక్పాలకులకులలో ప్రథముడు ఇంద్ర దేవుడు: ఇంద్రుడు దేవతలకు రాజుగా వేదాల్లో కీర్తించ బడ్డాడు. ఇతను తూర్పు దిక్కునకు అధిపతి. అదితి కుమారుడు. ఇతని భార్య శచీదేవి. ఆయుధం వజ్రం. వాహనం ఐరావతం. నివాసం అమరావతి పట్టణం. పాలసముద్రంనుండి పుట్టిన ఐరావతమనే ఏనుగును, ఉచ్చైశ్రవమనే గుఱ్ఱమును ఇతడు గైకొన్నాడు. అగ్నిదేవుడు: అగ్ని పంచ మహాభూతాల్లో ఒకడు. ఆగ్నే యాధిపతి. తేజస్వి. సప్త హస్తములు, చతుశ్శృంగములు, ఏడు నాల్కలు, రెండు శిరములు కలిగి శుభ్రమైన చిరునవ్వులు "చిందించు స్వరూపం కలవాడు. ఇతని తండ్రిపేరు వైశ్వా నరుడు. తల్లి శుచిష్మతి. భార్య స్వాహాదేవి. ఆయుధం శక్తి. వాహనం పొట్టేలు. నివాసం తేజోవతి పట్టణం. యమ దేవుడు: యముడు పితృగణాధిపతి. దక్షిణ దిగ్భాగమున పరిపాలన ఇతనిదే. ఇతని తండ్రి సూర్యుడు. తల్లి సంజ్ఞాదేవి. భార్య శ్యామలా దేవి. ఆయుధం దండం. వాహనం మహిషం. నివాసం సంయమని పట్టణం. నిర్రుతి దేవుడు: నిర్రుతి నైరుతి దిక్పాలకుడు. లోకాధి పతి. సత్పురుషుడు. కీర్తిమంతుడు. భార్య దీర్ఘాదేవి. ఆయుధం కుంతము. వాహనం నరుడు. నివాసం కృష్ణాంగన పట్టణం. వరుణ దేవుడు: యజ్ఞ సమయాల్లో హవిర్భాగములను ఇవ్వడానికి ఆహ్వానింపబడే వరుణుడు పశ్చిమ దిక్పాలకుడు. జలాధిపతి. ఇతని తండ్రి కర్దమ ప్రజాపతి. భార్య కాళికాదేవి. ఆయుధం పాశము. వాహనం మొసలి. నివాసం శ్రద్ధావతి పట్టణం. వాయు దేవుడు: వాయువు పంచ భూతాలలో ఒకరు. సర్వ వ్యాపకుడు. మహా బలవంతుడు. వాయవ్య దిశకు అధిపతి అయిన ఇతడు జీవకోటికి ప్రాణాధికం. ఇతని భార్య అంజనాదేవి. ఆయథం ధ్వజం. వాహనం జింక. నివాసం గంధవతి పట్టణం. కుబేర దేవుడు: కుబేరుడు సకల దేవతాప్రియతముడు. ఉత్తర దిక్కునకు అధిపతి. ధనపతి. భాగ్యశాలి. కుబేరుని తండ్రి విశ్రవోబ్రహ్మ. తల్లి ఇలబిల. భార్య చిత్ర రేఖాదేవి. ఆయుధం ఖడ్గము. వాహనం గుఱ్ఱం. నివాసం అలకాపురి పట్టణం. ఈశానుడు: సాక్షాత్తు ఈశాన్యాధిపతి పరమ శివుడు. జగదంబ పార్వతీదేవి ఇతని భార్య. ఆయుధం త్రిశూలము. వాహనం వృషభము. నివాసం యశోవతి పట్టణం. పార్వతీ పరమేశ్వరులకు ఆదిదంపతులని ప్రతీతి. శంకరుడు కోరినవారి కోరికలు కాదనకుండా నెరవేర్చడం చేత ఇతనికి బోళాశంకరుడని పేరు. మహాశక్తి మంతుడు. త్రిమూర్తులలో ఒకడు. సర్వస్వతంత్రుడు. భూత గణ సంసేవితుడై, తృటిలో భస్మం చేసేశక్తిగల మూడవ కన్నును కల్గిన ఇతడు లయకారకకర్త. కైలాసం ఇతని నివాసం. అష్టదిక్పాలకు లందరినీ కూడా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవంలో స్మరించడం పుణ్యప్రదం.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# కల్వకుంట్ల వారసత్వ పోరుకు సంకేతం - కవిత వ్యాఖ్యలతో మళ్లీ తెరపైకి పోరాటం



చింతమడక బతుకమ్మ వేదికలో కవిత చేసిన వ్యాఖ్యలు ఈసారి తెలంగాణ రాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీశాయి. బతుకమ్మ పండుగ అనేది కేవలం పూల పండుగ మాత్రమే కాదు, అది తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక గర్వానికి ప్రతీక. ఈ పండుగలో ఏర్పడే వేదికలు సహజంగానే రాజకీయ నాయకులకు ప్రజలతో మమేకం అయ్యే అవకాశాలుగా మారతాయి. ప్రత్యేకంగా చింతమడక వేదికపై కల్వకుంట్ల కవిత ప్రకటించిన వ్యాఖ్యలు సాంస్కృతిక ఉత్సవాన్ని రాజకీయ సంకేతాల వైపు మళ్లించాయి. కవిత తన ప్రసంగంలో చింతమడకను "నా, పుణ్యభూమి, కర్మభూమి"గా పేర్కొనడం, "నా పౌరుషాన్ని చూపిస్తా, అండగా నిలబడండి" అంటూ పిలుపు నివ్వడం ఆమె ధైర్యం, పట్టుదల, సంకల్పానికి ప్రతిరూపంగా నిలిచాయి. ఇవి కేవలం భావోద్వేగ పూరిత పదజాలం మాత్రమే కాకుండా, రాజకీయ రంగంలో తన స్థానాన్ని స్పష్టంగా చాటే ప్రయత్నంగా అనిపించాయి. తెలంగాణ ఉద్యమం కాలం నుంచే బతుకమ్మ వేదిక ప్రజా వేదికగా మారి రాజకీయ అర్థాలను సంతరించుకుంది. మహిళలే ప్రధానంగా పాల్గొనే ఈ పండుగలో వేదికపై కవిత చేసిన వ్యాఖ్యలు సహజంగానే విస్తృత చర్చకు దారితీయడం సహజమే. సిద్ధిపేట రాజకీయ పరంగా చాలా కాలంగా, హరీష్ రావు ఆధిపత్యం కొనసాగుతోంది. 2004 నుండి వరుసగా ఆరు సార్లు గెలిచి రికార్డు స్థాయిలో ప్రజాభిమానాన్ని పొందిన ఆయనకు సిద్ధిపేట అఖండ అడ్డాగా నిలిచింది. ప్రజల మధ్య తిరుగుతూ, అభివృద్ధి, సంక్షేమం, అందుబాటు నాయకత్వంతో ఆయన తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కవిత "సిద్ధిపేట ఎవరి జాగీరు కాదు. నేను మళ్లీ మళ్లీ వస్తా" అని స్పష్టంగా ప్రకటించడం కుటుంబ రాజకీయాల్లో పోటీతత్వాన్ని బహిర్గతం చేసినట్టే. హరీష్ రావు ప్రజాదరణను సవాలు చేసే స్థితి ఇప్పటికీ ఏర్పడక పోయినా, ఈ వ్యాఖ్యలు వ్యూహాత్మకంగా రాజకీయ సమీకరణాలను కదిలించే అవకాశం ఉన్నట్టు అనిపిస్తున్నాయి. బతుకమ్మ వేదిక మహిళలతో మమేకం కావడానికి అనువైన వేదిక. కవిత మహిళా నాయకురాలిగా, బతుకమ్మ పండుగ ప్రధాన గుర్తింపుతో, మహిళా ఓటర్ల మనసును ఆకర్షించాలని ప్రయత్నించిందని స్పష్టంగా కనిపించింది. ఆమె "నా పౌరుషాన్ని చూపిస్తా" అన్న వాక్యం కేవలం రాజకీయ ప్రత్యర్థులకు సవాలుగా మాత్రమే కాకుండా, మహిళలకు ధైర్యాన్ని నింపే పద జాలంలా వినిపించింది. అదే సమయంలో ఈ వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో అంతర్గత శక్తి సమీకరణాలను కదిలించే సంకేతాలుగా నిలిచాయి. కల్వకుంట్ల వారసత్వంలో కేటీఆర్, హరీష్ రావు, కవిత ఎ ఈ ముగ్గురు కీలకమైన నాయకులు. వీరిలో ఎవరు ఆధిపత్యాన్ని చాటుకుంటారో బీఆర్ఎస్ భవిష్యత్తు దానిపైనే ఆధారపడి ఉంటుంది. హరీష్ రావు రాష్ట్రవ్యాప్తంగా తన పని తీరు, పరిపాలనా దక్షత, అందుబాటు నాయకత్వంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. కవిత మరోవైపు పార్లమెంట్ సభ్యురాలిగా పనిచేసి, అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ ప్రతినిధిగా నిలిచిన అనుభవాన్ని సంపాదించింది. వీరి బలాలు వేర్వేరు కావడం వల్ల, ఒకే వేదికపై సహకారం సాధ్యమైతే పార్టీ బలపడుతుంది. కానీ విభేదాలు పెరిగితే బీఆర్ఎస్ భవిష్యత్తు మరింత సంక్లిష్టం కావచ్చని అంచనా వేయవచ్చు. మొత్తంగా చూసుకుంటే, చింతమడక బతుకమ్మ వేదికపై కవిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చలకు నాంది పలికాయి. సాంస్కృతిక పండుగ వేదికను రాజకీయ బలపరీక్ష వేదికగా మలచిన ఆమె, ఒకవైపు కుటుంబ విభేదాలను బహిర్గతం చేస్తూనే, మరోవైపు మహిళా ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేసింది. సిద్ధిపేట వాస్తవానికి హరీష్ రావు అఖండ అడ్డా, ఆయన ప్రజాదరణ అఖండం. అలాంటి సమయంలో కవిత వ్యాఖ్యలు ఆయన స్థానాన్ని తక్షణమే దెబ్బ తీయక పోయినా, భవిష్యత్తులో కుటుంబ రాజకీయాల దిశ, బీఆర్ఎస్ లోపలి శక్తి సమీకరణాల మార్పు, మహిళా ఓటర్ల మద్దతు ఎ అన్నింటిపైనా ప్రభావం చూపే అవకాశముందని చెప్పవచ్చు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## చురకలు

## సంపాదకీయం

### సోషల్ మీడియా కట్టడి సాధ్యమేనా ..!

రాష్ట్రంలో సోషల్ మీడియా మాధ్యమాలైన ఫేస్బుక్, వాట్సప్, ట్విట్టర్, యూట్యూబ్ సహా ఇతర మద్యమాల్లో రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు రావడం, అదేవిధంగా వ్యాఖ్యానాలు రావడం, ట్రోలింగ్స్ వీడియోలు వంటివి తీవ్ర స్థాయిలో జోరుగా సాగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు అదేవిధంగా ఎమ్మెల్యేలు ఎంపీలు కూడా స్పందిస్తున్నారు. ఆయా వార్తలను, కధనాలను, వ్యాఖ్యలను కూడా వారు తప్పుపడుతున్నారు. ఇక సీఎం చంద్రబాబు అయితే మంత్రులను పదేపదే హెచ్చరిస్తున్నారు. ఇట్లాంటి విమర్శలను ఇట్లాంటి వ్యాఖ్యలను కచ్చితంగా ఖండించాలని కోరుతున్నారు. అయితే ఇంత జరుగుతున్నా కూడా సోషల్ మీడియాలో రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు కానీ వ్యాఖ్యలు కానీ ఎక్కడ ఆగడం లేదు. మరీ ముఖ్యంగా ఇటీవల వైద్య కళాశాల పిపిపి విధానం పై తీవ్ర స్థాయిలో చర్చలు నడిచాయి. విమర్శలు వచ్చాయి. సోషల్ మీడియాలో అయితే ట్రోలింగ్స్ కూడా పెరిగిపోయాయి. అదేవిధంగా కర్నూల్ లో రైతుల సమస్యలు... ముఖ్యంగా ఉల్లిపాయల సమస్యలు మరింత జోరుగా సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. దీనికి ముందు అనేక ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. ఇక తరచుగా సీఎం చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్యలు, నారా లోకేష్ చేస్తున్న వ్యాఖ్యలు, ఇక డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలను ఉటంకిస్తూ కూడా సోషల్ మీడియాలో కామెంట్స్ వ్యాఖ్యానాలు, వ్యంగ్యాస్త్రాలకు చోటు ఎక్కువగా కనిపిస్తోంది. దీంతో ఇక మాటల ద్వారా కట్టడం చేయలేమని భావిస్తున్న ప్రభుత్వం సోషల్ మీడియాను కట్టడి చేసే విధంగా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. దీనికి సంబంధించి ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టాలని నిర్ణయించుకున్నారు. అయితే ఇది అంత సాధ్యమయ్యే విషయమేనా అనేది ప్రధాన ప్రశ్న. ఎందుకంటే సోషల్ మీడియా అనేది రాష్ట్రాల పరిధిలో లేనటువంటి కీలక అంశం. ఇది ఐటీ చట్టం కిందకు వస్తుంది. ఇది కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న ఐటీ చట్టం నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సినటువంటి వ్యవస్థ. దీనిపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పలు చట్టాలు తీసుకువచ్చింది. పలు నిబంధనలు కూడా విధించింది. అయితే, సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని సోషల్ మీడియాను భావ ప్రకటన స్వేచ్ఛగా ప్రకటించిన దరిమిలా ఆయా నిబంధనలు, ఆయా చట్టాలలో కూడా మార్పులు చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా అనేక ఉత్తర్వులు కేంద్రం నుంచి అందాయి. సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని కేసులు నమోదు చేయడానికి వీలులేదని ఇటీవల సుప్రీంకోర్టు సహా బాంబే హైకోర్టు కూడా స్పష్టం చేసింది. ఇన్ని చట్టాలు, ఇన్ని నిబంధనలు, ఇన్ని కోర్టు ఆదేశాలు ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏ దిశగా దీనికి చట్టం చేస్తుంది అనేది ఆసక్తిగా మారింది. ఒకవేళ రేపిది చట్టం చేసిన దీన్ని రాష్ట్రపతి ఆమోదించాల్సిన పరిస్థితి ఉంది. ఎందుకంటే కేంద్రం పరిధిలోని అంశంపై చట్టం చేసేటప్పుడు రాష్ట్రపతి ఆమోదం పొందాల్సి ఉంటుంది. గతంలో దిశా చట్టం చేసినప్పుడు కూడా ఇటువంటి పరిస్థితి ఏర్పడింది.

కాబట్టి కూట మి చట్టం తీసుకురావడం పట్ల ఎవరికీ అభ్యం తరం లేకపోయినప్పటికీ నిబంధనల ప్రకారం వ్యవహరిస్తే ఈ చట్టానికి అనుమతి లభించే అవకాశం కనిపిస్తుంది. లేకపోతే మరో దిశ చట్టం మాదిరిగా ఇది కూడా మూలన పడే అవకాశం ఉంటుందని పరిశీలకులు భావిస్తున్నారు.

## తెలుగు నాటక రంగంలో "స్థానం" వారిది ప్రత్యేక స్థానం - సెప్టెంబర్ 23...స్థానం నరసింహారావు జయంతి



స్థానం నరసింహారావుది ఆంధ్ర నాటకరంగ చరిత్రలో నరసింహారావుది ప్రత్యేక స్థానం. నాటక రంగం మనగలిగినంత కాలం ఆయన పేరు శాశ్వతంగా నిలిచి పోతుంది. ఆయన స్త్రీ పాత్రధారణలో అసాధారణ ప్రజ్ఞ కనబరచి నాటక రంగానికే వన్నె తెచ్చారు. పురుషులే స్త్రీ వేషాలు వేసే ఆ నాటి రోజుల్లో రంగస్థలంపై విభిన్నమైన, పరస్పర విరుద్ధ మయిన పాత్రలను ధరించి, ధరించిన ప్రతి పాత్రలోను తమదైన ప్రత్యేకతను చూపించి లీనమై, ముప్ఫయి సంవత్సరాల పాటు లక్షలాది మంది ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేసిన ప్రతిభ ఆయనకే సొంతం. నటకా వతంస, నటశేఖర, నాటక కళా ప్రపూర్ణ, పద్మశ్రీ వంటి బిరుదులు, పురస్కారాలు ఆయనను వరించాయి. స్థానం నరసింహారావు (సెప్టెంబర్ 23, 1902 – ఫిబ్రవరి 21, 1971) ప్రసిద్ధ రంగస్థల, తెలుగు సినిమా నటులు. సత్యభామ, చిత్రాంగి మొదలైన అనేక స్త్రీ పాత్రలను సుమారు 40 సంవత్సరాలకు పైగా ధరించి 3వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ప్రేక్షకాభిమానంతో సహా పద్మశ్రీ పురస్కారం పొందాడు. స్థానం నరసింహారావు 1902, సెప్టెంబర్ 23 న హనుమంతరావు, ఆదెమ్మ దంపతులకు గుంటూరు జిల్లా బాపట్ల లో జన్మించారు. ఆయన చిన్నతనంలో కూచిపూడి భాగవతులు వచ్చి బాపట్లలో ప్రదర్శనలు ఇచ్చేవారు. అందులో వెంపటి వెంకటనారాయణ అనే ఆయన భామ వేషం అద్భుతంగా కట్టేవారట. ఆ స్త్రీ వేషం తన మనసులో ఎంతో ఆదరంతో మనసులో నిలిచి పోయి ఉండేదని చెప్పారు. ఈ దృశ్యాలన్నీ ఆయన రంగస్థల ప్రవేశం చేయడానికి దోహదం చేశాయి. 1921లో బాపట్ల లోనే జంట కవులైన తిరుపతి వేంకటకవులకు, కొప్పరపు కవులకు శతావధానం పోటీ జరిగింది. నెగ్గిన తిరుపతి వేంకటకవులని సత్కరించాలని భావించారు. ఆ సందర్భంగా ప్లీడరు గుమాస్తాల బృందం చేత సత్య హరిశ్చంద్ర నాటకం వేయించాలని నిర్ణయించారు. ఆహ్వానాలు వెళ్లిపోయాయి. కానీ చంద్రమతి వేషధారి అస్వస్థుడై రాలేక పోతున్నట్టు చివరి నిమిషంలో తెలిసింది. ప్రత్యామ్నాయం ఏదీ సాధ్యం కాలేదు. చంద్రమతి పాత్రధారి మరొకరు దొరకలేదు. మరో నాటకం వేద్దామంటే పాత్రధారులంతా లేరు. గుండెల్లో రాయి పడింది. అప్పుడే ఆపద్బాంధవుడిలా స్థానం దొరికాడు చోరగుడి హనుమంతరావుకు. వారి నాటకం రిహార్సల్స్ జరుగుతున్నప్పుడు వెళ్లి కూర్చోవడంతో పద్యాలన్నీ వచ్చేశాయి. ఒకసారి ఎవరూ లేనప్పుడు పాడుకుంటూ ఉంటే హనుమంతరావు విన్నాడు. ఆ ధైర్యంతోనే చంద్రమతి వేషం వేయించాడు. స్థానం వారికి చిన్నతనంలోనే చిత్రలేఖనం కూడా అబ్బింది. ఆ కళతోనే, వేరే ఒకరి ఇంట రహస్యంగా తన వేషం తనే వేసుకున్నారాయన. చిన్న చిన్న లోపాలు ఉన్నా అరంగేట్రంలోనే తిరుపతి కవుల ఆశీస్సులు అందుకున్నారు స్థానం. తెనాలిలోని శ్రీరామ విలాస సభలో ప్రవేశించి ఆకాలంలోని గొప్ప నటులందరి సరసన పాత్రలు ధరించి దేశమంతటా పర్యటించి అపారమైన అనుభవం సంపాదించారు. వరంగల్‌లో 'కృష్ణలీల' నాటకంలో యశోద వేషం వేసినందుకు ఆయన జీవితంలో తొలి బంగారు పతకం వచ్చింది. అనతికాలంలోనే ఆయన పేరు మారుమోగి పోయింది. కాపురం బాపట్ల నుంచి తెనాలికి మారింది. శ్రీరామవిలాస సభ అనే నాటక సమాజాన్ని స్థాపించి నటననే జీవికగా చేసుకున్నారు. రోషనార (రోషనార నాటకం), తామీనా (రుస్తుం సొహరాబ్ నాటకంలో), సంయుక్త (రాణీ సంయుక్త), శకుంతల (అభిజ్ఞాన శాకుంతలం), సత్యభామ (శ్రీకృష్ణ తులాభారం), చిత్రాంగి (సారంగధర), దేవదేవి (విప్ర నారాయణ), కోకిల (కోకిల నాటకం), మల్లమ్మ (బొబ్బిలి), మధుర వాణి (కన్యాశుల్కం), అనసూయ (అనసూయ నాటకం), మురాదేవి (చంద్రగుప్త), చింతామణి (చింతామణి), సుభద్ర (వీరాభిమన్య), సరళ (ఛత్రపతి శివాజీ), విద్యాధరి (కాళిదాసు), చండిక (చండిక నాటకం) వంటి పాత్రలు వేశాడు. ఆంధ్రదేశంలో దాదాపు 3,000 సార్లు రంగస్థలం మీద పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలలో స్త్రీ పాత్రలను ధరించి ప్రజాభిమానాన్ని చూరగొన్నాడు. శృంగార రసాన్ని ప్రతిబింబించే రీతిలో సత్యభామ పాత్ర, ప్రణయానికి చిత్రాంగిగా, వీరరసాన్ని చిత్రించడంలో రోషనార నాటకంలో రోషనారగా, వలపుల చింతామణిగా, ప్రణయ దేవతగా, భక్తురాలిగా, దేవదేవిగా, మధురాతి మధురమైన మధురవాణిగా నవరసాలు కలిగిన పాత్రలను ప్రతిభావంతంగా పోషించాడు. వేషధారణ, వస్త్రాలంకరణలో స్థానం వారిది ఒక ప్రత్యేకత. రకరకాల చీరకట్టు సొగసులతో మనోహరంగా రంగస్థానం మీదకు ప్రవేశించి ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేశాడు. వీరు సినీ రంగంలో రాధాకృష్ణ (1939), సత్యభామ భామ వంటి కొన్ని సినిమాలలో నటించారు. తన నటనానుభవాలను చేర్చి "నటస్థానం" అనే గ్రంథాన్ని ఆయన రచించాడు. స్థానం నరసింహారావు 1971 ఫిబ్రవరి 21 తేదీన మరణించాడు. 1956లో భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఆయన ఈ బహుమతిని పొందిన తొలి ఆంధ్రుడు, కళాకారుడు. ఆయన రంగ స్థలం పై చూపించిన సమయస్ఫూర్తికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 10వ తరగతి తెలుగు వాచకంలో ఒక పాఠం కూడా పెట్టింది. అయన నటనకు ముగ్ధులైన రంగూన్ ప్రజలు 1938లో బంగారు కిరీటాన్ని బహూకరించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## గాంధీ మహాత్ముడు మెచ్చిన తెలుగు రచయిత దేవరాజు వేంకటకృష్ణారావు

### తెలుగు తొలి డిటెక్టివ్ నవల రచయిత దేవరాజు – సెప్టెంబర్ 23...వేంకటకృష్ణారావు జయంతి



దేవరాజు వేంకటకృష్ణారావు (సెప్టెంబర్ 23, 1886 – సెప్టెంబర్ 13, 1966) తొలి తెలుగు అపరాధ పరిశోధక నవలా రచయితగా పరిగణింప బడుతున్నాడు. ఆయన తండ్రి వెంకట్రావు పంతులు మృత్యుంజయ నిశ్శంక బహద్దరు జమీందారు వద్ద దీవాన్‌గా పనిచేసేవాడు. ఆయన బహుభాషా కోవిదుడు. పంచభాషా నిఘంటువును రచించాడు. వేంకట కృష్ణారావు తాత వరదయ్య పంతులు సి.పి.బ్రౌన్ వద్ద దుబాసీగా పనిచేసి బ్రౌణ్య నిఘంటువు నిర్మాణంలో పాలుపంచు కున్నాడు. దేవరాజు రవిగా సుపరిచితులు అయి, తండ్రి బాటలోనే పయనించి, 2 నవలలు, 200 పైగా కథలు, 1250 సినిమా సమీక్షలు ఇంకా పలు ఇతర వ్యాసాలూ రాసిన దేవరాజు వేంకట సత్యనారాయణరావు... వేంకట కృష్ణారావు కుమారుడే. గడబిడ దాస్, అర్జెంటు పంతులు, ప్రాడ్వివాకుడు అనే ముద్దుపేర్లతో పిలువబడిన దేవరాజు వేంకట కృష్ణారావు 1886 సెప్టెంబర్ 23 వతేదీ జన్మించాడు. కృష్ణారావు విద్యాభ్యాసం బొబ్బిలి, మద్రాసు పట్టణాలలో జరిగింది. పరవస్తు వెంకట రంగాచార్యులు, వేదం వెంకటరాయ శాస్త్రులు ఆయన గురువులు. వివాహం కారణంగా ఇతనికి ఒరిస్సా రాష్ట్రంలోని బరంపురంతో సంబంధ బాంధవ్యాలు ఏర్పడినాయి. ఆయన వృద్ధాప్యంలో బరంపురం నుండి రాజాంకు తరలి వచ్చాడు. 1960 నుండి మరణించే వరకు ఆయనకు కేంద్ర ప్రభుత్వం గౌరవ భృతిని ఇచ్చి సత్కరించింది. ఆనాటి రోజులలో ఆయన ఇల్లు సాహితీ మూర్తులకు నిలయంగా ఉండేది. గిడుగు రామమూర్తి పంతులు, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, మండపాక పార్వతీశ్వర శాస్త్రి, నేమాని నృసింహశర్మ, బలిజేపల్లి లక్ష్మీకాంతం, పింగళి లక్ష్మీకాంతం వంటి సాహితీమూర్తులతో నిత్య సాహితీ సదస్సులతో కళకళ లాడుతూ వుండేది. ఆయన 1909లో బరంపురంలో ఆంధ్ర భాషాభివర్ధినీ సమాజాన్ని స్థాపించాడు. 1910లో వేగుజుక్క ముద్రణాలయాన్ని స్థాపించాడు. 1911లో తాపీ ధర్మారావుతో కలిసి వేగుజుక్క గ్రంథమాలను నెలకొల్పి 1912లో దానిద్వారా వాడేవీడు అనే అపరాధ పరిశోధక నవలను ప్రకటించాడు. తెలుగులో "వాడేవీడు" మొట్ట మొదటి డిటెక్టివ్ నవలగా ఇప్పటి వరకు గుర్తించ బడింది. ఇంకా కృష్ణారావు నేనే (1914), కాలూరాయి (1916) అనే అపరాధ పరిశోధక నవలలు వ్రాసి గ్రంథమాల ద్వారా ప్రకటించాడు. కాలూరాయి నవలలో హెలీకాప్టర్ ను ఊహించి వ్రాశాడు. అప్పటికి ఇంకా హెలీకాప్టర్ కనుగొన బడక పోవడం గమనార్హం. డిటెక్టివ్ నవలలే కాకుండా జానకీ పరిణయం (తప్పుల తమాషా) , సంజయ రాయబారం, శ్రీకృష్ణ రాయబారం, విభ్రమ రాఘవము , శ్రీకృష్ణా భ్యుదయము , మనసు దాని పని , ఒరిస్సా చరిత్ర , పురాణ సంహిత అనే గ్రంథాలను వ్రాశాడు. 1933లో కళాప్రచారక సమితిని స్థాపించాడు. 1934లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నాడు. ఇతని ఆధ్వర్యంలో వేగుజుక్క కథావళి (1914–1930), పద సమస్య బోధిని (1937), విశాలాంధ్ర వాణి (1940–1960) అనే పత్రికలు వెలువడ్డాయి. తెలుగులో మొట్టమొదటి క్రాస్‌వర్డ్‌పజిల్‌ను సృష్టించిన ఘనత కూడా దేవరాజు వేంకట కృష్ణారావుకే దక్కుతుంది. 1933 మార్చి 10,11,12 తేదీలలో బరంపురంలో జరిగిన అభినవాంధ్ర కవిపండిత సభలో అఖండ సత్కారాన్ని పొందాడు. 1950లో విమర్శకాగ్రేసర అనే బిరుదుతో సత్కరించ బడ్డాడు. ఆయన వ్రాసిన శ్రీకృష్ణ రాయబారం అనే గ్రంథంలోని కొంత భాగాన్ని మహాత్మా గాంధీ ఇంగ్లీషులోని తర్జుమా చేయించుకుని చదివి ఆనందించడమే కాకుండా కృష్ణారావుకు "డియర్ గురూజీ" అంటూ సంబోధిస్తూ గ్రంథాన్ని శ్లాఘిస్తూ ఉత్తరాలు రాయడం విశేషం. కృష్ణారావు 1966, సెప్టెంబరు 13వ తేదీన మరణించాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## సెప్టెంబర్ 23.. ఈమని శంకరశాస్త్రి జయంతి

శంకరాభరణం శంకరశాస్త్రి అంటే తెలియని వారు ఉండరేమో గాని, ఈమని శంకరశాస్త్రి (సెప్టెంబర్ 23, 1922 – డిసెంబర్ 23, 1987 గురించి ఈ నాడు చాలా మందికి తెలియక పోవచ్చు. వీణలో మహామహో పాధ్యాయుడైన ఈమని శంకరశాస్త్రిగారి సంగీత కచేరీలు విన్నవారికి ఆయన గొప్పదనం ఎటువంటిదో తెలిసినదే. వాద్య సంగీతంలో శంకరశాస్త్రితో పోల్చదగిన వ్యక్తులు ఆనాడూ, ఈనాడూ కూడా చాలా తక్కువ మందే కనిపిస్తారు. గమక విన్యాసంలో, రాగ ప్రస్తారంలోనూ ఆయనది అద్వితీయమైన ప్రతిభ. వీణ మీద ఎన్ని రకాల శబ్దాలు పలికించవచ్చునో పరిశోధించి, శోధించి నిరూపించిన అనన్య సామాన్య కళాకారుడాయన. కారణాలేమైనప్పటికీ ఇంత గొప్ప కళాకారుడికి రావలసిన ఖ్యాతి మాత్రం రాలేదు. ఆయన తాతగారైన సుబ్బరాయశాస్త్రి, తండ్రి అచ్యుతరామశాస్త్రి కూడా గొప్ప వీణ విద్వాంసులు. 1922, సెప్టెంబరు 23న, తూర్పుగోదావరి జిల్లా దాక్షారామంలో జన్మించిన శాస్త్రి, ఆయన తండ్రి అచ్యుత రామశాస్త్రి దగ్గర వీణ అభ్యసించి ఈ వాద్యాన్ని పూర్తిగా తెలుగు వీణగా రూపుదిద్దారు. నేటి తరం వినగలిగిన వీణ విద్వాంసులలో అగ్రస్థానం నిస్సందేహంగా ఈమని శంకరశాస్త్రిగారిదే. సీతారామ కల్యాణం (రావణుడు వీణ వాయించే ఘట్టం), వెంకటేశ్వర మహత్యం (సరస్వతి "వాచస్పతి" రాగం వాయించే సీను) మొదలైన కొన్ని తెలుగు సినిమాల్లో శాస్త్రి వీణ నేపథ్యం వినబడుతుంది. కచేరీలలో అప్పుడప్పుడూ పాట పాడి వినిపిస్తూ అవే సంగతులను వీణ మీద పలికించే అలవాటుండేది. మంత్రపుష్పం వంటివి వాయిస్తున్నప్పుడు "ప్రజా"వంటి పదాలను ఉచ్చరిస్తూ కుడిచేత్తో అందుకు అనుగుణంగా డబుల్ మీటు వేసేవారు. ఇక కుడి చేత్తో ఆయన తీగలను మీటే పద్ధతి కూడా చాలా గొప్పగా ఉండేది. సందర్భాన్నీ, అవసరాన్నీ బట్టి ఆయన తన కుడి చేతి పొజిషన్‌నూ, తీగను మీటే స్థానాన్నీ పలు రకాలుగా మార్చేవారు. ఆయన పలికించిన తానం అనితర సాధ్యం. మూడో తీగనూ, నాలుగో తీగనూ బొటన వేలితో మీటుతూ మంద్ర,



అనుమంద్ర స్థాయిల్లో స్వరాలను అత్యద్భుతంగా వాయించే వారు. మామూలుగా ఉండే మూడు తాళం తీగలే కాక మరొక రెండు ఏర్పాటు చేసి, వాటిని రాగంలోని స్వరాలకు శ్రుతిచేసి మొత్తం మీద ఒక ఆర్కెస్ట్రావంటి ప్రభావాన్ని కలిగించేవారు. కేవలం ఒక్క వీణతోనే అరుదైన రాగాలను ఎంతో డ్రమటిక్‌గా, పెద్ద సింఫొనీ స్థాయిలో వాయించేవారు. ఈ టెక్నిక్‌ల మాట ఎలా ఉన్నా సంగీతకారుడుగా ఆయనది ఎంతో పరిక్వత చెందిన మేధస్సు. రాగ స్వభావాన్ని గంభీరంగా, హుందాగా, ఎటువంటి వెకిలి తనమూ లేకుండా వినిపించడం ఆయన ప్రత్యేకత. ఏ మాత్రమూ వేగాన్నీ, ఆర్భాటాన్నీ ప్రదర్శించ కుండా స్వరకల్పనలో ఎంతో ఉద్వేగాన్నీ, ఆర్తినీ సునాయాసంగా సృష్టించేవారు. తాను పూర్తిగా రాగభావంలో లీనమై, ప్రేక్షకుల ఉనికిని కూడా గమనించ కుండానే వారిని సంగీతపు అలలలో ఓలలాడించేవారు. ఆయన కచేరీకి ఎన్నిసార్లు వెళ్ళినా, అద్వితీయమైన ఆయన ప్రతిభ అందరినీ ఆశ్చర్య చకితులను చేస్తూ ఉండేది. రవిశంకర్, హలీమ్ జాఫర్‌ఖాన్ వంటి సితార్ విద్వాంసులతోనూ, గోపాల్‌కృష్ణ వంటి విచిత్రవీణ కళాకారుల తోనూ జుగల్‌బందీ కచేరీలు చెయ్యడం ఆయన చేశారు. సూర్‌దాస్ భజనలకూ, ఇతర గీతాలకూ ఆయన పహాడీ మొదలైన హిందూస్తానీ రాగాల్లో స్వర రచన చేశారు. రేడియోలో అనేక గీతాలకు లలిత సంగీతం సమకూర్చారు. అందులో "న జానే క్యా లాచారీ హై" అనే హిందీ పాటను బాలమురళీకృష్ణ గుజరీతోడీ రాగంలో పాడారు. అలాగే దేవులపల్లివారి రచన "ఒదిగిన మనసున పొదిగిన భావము" అనే పాటకు శాస్త్రిగారు మిశ్ర కాఫీ రాగంలో స్వర పరిచారు. చేశారు. ఢిల్లీలో రేడియోకి చీఫ్ ప్రొడ్యూసర్‌గానూ, నేషనల్ ఆర్కెస్ట్రా కంపోజర్ కండక్టర్‌గానూ ఆయన ఎన్నో అద్భుతమైన సంగీత రచనలు చేసి వాద్యబృందాన్ని నిర్వహించారు. వాటిలో శిఖరారోహణం, భ్రమర విన్యాసం, సౌమ్య పురుష మొదలైనవి పేరు పొందాయి. ఆయన 1942–50 మధ్యలో మద్రాసులోని జెమినీ స్టూడియోలో సాలూరు రాజేశ్వరరావుకు సంగీత దర్శకత్వంలో సహాయకునిగా ఉన్నారు. ఆ కాలంలోనే చిట్టిబాబు ఆయనకు శిష్యుడయాడు. 1951లో పి.బి.శ్రీనివాస్‌ను సినీ గాయకుడుగా పరిచయం చేసినది ఈమనే.. 1940లో తిరుచ్చి రేడియో కేంద్రంలో మొదటగా వీణ కచేరీ చేశాక ఆయనకు పేరు లభించ సాగింది. ఆకాశవాణి డైరక్టరేట్ లో సంగీత విభాగంలో చీఫ్ ప్రొడ్యూశర్ గా పనిచేసిన మరో ప్రముఖులు ఈమని శంకరశాస్త్రి. వైణికులుగా లబ్ధ ప్రతిష్ఠులైన శంకరశాస్త్రి ఢిల్లీలో సముచిత గౌరవాన్ని పొందారు. న్యూయార్క్ లో, వీణావిర్చో బిరుదుతో అమెరికా ప్రభుత్వం 1973లో సత్కరించింది. రష్యా, ఆస్ట్రియా దేశాలు ప్రత్యేక అతిథిగా గౌరవించాయి. ఐక్యరాజ్య సమితి, యునెస్కో అవార్డులు వరించాయి. పారిస్, రోమ్‌లో జరిగిన పలు కచేరిల్లో పాల్గొని సత్కారాలు పొందారు. కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం అందించింది. రాష్ట్ర ప్రభుత్వ రాష్ట్ర సంగీత విద్యాంసుని గా, టీటీడీ ఆస్థాన సంగీతకారునిగా పనిచేశారు. గుంటూరులో జరిగిన ఓ కార్యక్రమంలో స్వర్ణ కంకణ ధారులై, తిరిగి చెన్నైకి రైల్లో వెళుతూ, ఈమని 1987 డిసెంబర్ 23న రైలు ప్రయాణంలోనే కన్ను మూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## బ్రహ్మాండ నాయకునికి బ్రహ్మోత్సవ శోభ - సెప్టెంబర్ 23 నుండి అక్టోబర్ 2 వరకు తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు





తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అనగానే భక్త జన ప్రవాహం, తన్మయత్వంతో మిన్నంటేలా వారు చేసే గోవింద నామ స్మరణ, మాడ వీధుల్లో దేవేరులతో స్వామి ఊరేగింపులూ, సాటిలేని వైభవంతో సాగే వాహన సేవలు కళ్ళ ముందు కదులుతాయి. బ్రహ్మోత్సవాల్లో స్వామివారిని వివిధ రూపాల్లో, అవతారాల్లో దర్శనం చేసుకున్న వారికి అనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తి కావడంతో పాటు.. పుణ్యఫలాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. తిరుమల చరిత్రలో, వందల ఏళ్ళ నుంచీ వివిధ ఉత్సవాల నిర్వహణ జరుగుతున్నది. ఎందరో రాజులు, ఆర్కాటు నవాబులు, ఈస్టిండియా కంపెనీ ప్రతినిధులు, బ్రిటిష్ అధికారులు, తర్వాత హథీరాం మహంతుల హయాంలో ఉత్సవాలు కొనసాగాయి. పురాణాలు, శాసనాల ఆధారంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు 6వ శతాబ్దంలో ప్రారంభమైనట్లు తెలుస్తోంది. చక్రవర్తులు, మహరాజులు తమ విజయ పరంపరలకు గుర్తుగా తిరుమలేశుని బ్రహ్మోత్సవాల పేరుతో వైభవంగా ఉత్సవాలను నిర్వహించేవారు. నెలకొకటి చొప్పున ప్రతి ఏటా పన్నెండు బ్రహ్మోత్సవాలు కూడా జరిగేవని చరిత్ర చెబుతోంది. క్రీ.శ.614లో పల్లవరాణి సమవాయ్( పేరిందేవి) మనవాళ పెరుమాళ్ అనే వెండి భోగ శ్రీనివాసమూర్తి విగ్రహాన్ని తిరుమల ఆలయానికి బహుకరించింది. పెరటాసి నెలలో (కన్యామాసం) జరిగే బ్రహ్మోత్సవాలకు ముందు ఈ వెండి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించేవారు. ఆ తరువాత క్రీ.శ.1254 చైత్ర మాసంలో తెలుగు పల్లవరాజు విజయ గండ గోపాల దేవుడు, క్రీ.శ.1328 ఆషాఢమాసంలో ఆడి తిరునాళ్ల పేరుతో త్రిభువన చక్రవర్తి తిరువేంకట యాదవ రాయలు, క్రీ.శ.1429 ఆశ్వయుజ మాసంలో వీర ప్రతాప దేవరాయలు, క్రీ.శ.1446లో మాసి తిరునాళ్ల పేరుత హరిహరి రాయలు, క్రీ.శ.1530లో అచ్యుతరాయ బ్రహ్మోత్సవంగా అచ్యుత రాయలు, ఉత్సవాలు నిర్వహించేవారని చరిత్ర చెబుతోంది. క్రీ.శ.10వ శతాబ్దంలో తిరుమలలో 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరిగేవి. ఉత్సవాల్లో ఉగ్ర శ్రీనివాసమూర్తిని ఉత్సవ విగ్రహంగా వినియోగించేవారు. క్రీ.శ.1339 నుంచి మలయప్ప కోనలో లభించిన మలయప్ప స్వామిని ఉత్సవ విగ్రహాలుగా తయారు చేసి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతోంది. ఒకప్పుడు నెలకు ఒకసారి బ్రహ్మోత్సవాలు జరిగేవట. కొన్ని ఇబ్బందులు, సమస్యల కారణంగా ఏడాదికి ఒకసారి, అధిక మాసంలో రెండుసార్లకు బ్రహ్మోత్సవాలు పరిమితం అయ్యాయి. ఈ వేడుకల్లో శ్రీ వేంకట్వేరుడు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తకోటికి దర్శన భాగ్యాన్ని కల్పిస్తున్నాడు. ఎలాంటి పరిస్థితులు తలెత్తినప్పటికీ శ్రీవారి బ్రహ్మోత్సవాలను రద్దు చేయడం తిరుమల క్షేత్ర చరిత్రలో లేదు. కలియుగ వైకుంఠంలా అలరారుతోన్న తిరుమలలో ఏడాది వార్షిక (సాలకట్ల) బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజుల పాటు సాంప్రదాయ రీతిలో కన్నుల పండువగా కొనసాగ నున్నాయి. భాద్రపదంలో నిర్వహించే ఉత్సవాలను సాలకట్ల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 3న రాత్రి అంకురార్పణతో ప్రారంభం అయినాయి. సెప్టెంబర్ 23 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహించ నున్నారు. బ్రహ్మోత్సవాలను ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా, లక్షలాది మంది భక్తుల మధ్య నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. బ్రహ్మోత్సవాలను ప్రారంభించే ముందు ఎటువంటి ఆటంకాలు కలగకుండా, విజయవంతంగా జరగాలని కోరుకుంటూ వైఖాసన ఆగమనంలోని క్రతువులలో 23న అంకురార్పణంతో ఈ ఉత్సవాన్ని ప్రారంభిస్తారు. శ్రీవారి సేనాధిపతి అయిన విశ్వక్సేనుల వారి ఆలయానికి నైరుతి మూలలో ఉన్న వసంత మండపానికి ఊరేగింపుగా వెళ్ళి, అక్కడ భూమాతకు ప్రత్యేక పూజలు చేసి, ఆ మట్టిలో నవధాన్యాలను నాటడాన్ని అంకురార్పణం అంటారు. ప్రతిరోజు ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు స్వామివారి వాహన సేవలు జరుగుతాయి. గరుడ వాహనం రాత్రి 7 నుండి తెల్లవారు జామున 2 గంటల వరకు నిర్వహిస్తారు. ధ్వజారోహణం ఘట్టంతో తొమ్మిది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



## ఉన్నత విద్యపై నిశిత దృష్టి

మెట్పల్లి : ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారుగా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 3 వేలమంది, రెండో సంవత్సరం 2500 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ఉత్తమ విద్యనందించేందుకు ప్రతి కళాశాలకు 13 సీసీ కెమెరాలతోపాటు ఒక కంప్యూటర్‌ను ఏర్పాటు చేశారు. తరగతి గదులతోపాటు ప్రిన్సిపల్ కార్యాలయంలో, కళాశాల ఆవరణలో తదితర చోట్ల వాటిని బిగించారు. ప్రిన్సిపల్ గదిలో ఏర్పాటుచేసిన కంప్యూటర్‌కు సీసీ కెమెరాలను అనుసంధానం చేశారు. ఎప్పటికప్పుడు వీటి పర్యవేక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

**మెట్పల్లిలో 16 కెమెరాల పర్యవేక్షణలో**

మెట్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి సుమారు 563 మంది విద్యార్థులున్నారు. వీరికి సీసీ కెమెరాల నడుమ ఉత్తమ బోధన అందిస్తున్నారు. 13



కొత్తవి కాగా పాతవి మూడింటితో మొత్తం 16 కెమెరాలను బిగించారు.

**ప్రతి కళాశాలపై ప్రత్యేక దృష్టి**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధనపై ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు సీసీ కెమెరాలను హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో చూసేలా ఏర్పాటు చేశారు. ప్రతి తరగతి గదిలో విద్యార్థుల సంఖ్య తక్కువ లేకుండా చూడటం.. బోధన, అధ్యాపకుల పనితీరు తదితర అంశాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షణలో ఉంచనుంది. ఏడాదిపాటు ఓ సంస్థకు సీసీ కెమెరాల బాధ్యతలను అప్పగించారు.

**ఉత్తమ ఫలితాల కోసమే..** విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించి, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసింది. గత 20 రోజుల క్రితం జిల్లాలోని 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమెరాలను బిగించి ప్రస్తుతం వాటి పర్యవేక్షణలోనే కళాశాలలు కొనసాగుతున్నాయి. విద్యార్థులతోపాటు అధ్యాపకులపై హైదరాబాద్ లోని ఉన్నతాధికారుల ప్రత్యేక పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉంటుంది. – నారాయణ, ఇంటర్ విద్యా జిల్లా నోడల్ అధికారి

## ఆకట్టుకునే రంగు.. శుభ్రత కరవు

వేములవాడ: వర్షాకాలం వచ్చిందంటే వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి కాలంలో హోటళ్లు, రెస్టారెంట్లు, తినుబండారాల తయారీలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి వాటిని ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహార పదార్థాలు ప్రజలకు అందేలా చూడాల్సిన అధికార యంత్రాంగం నామమాత్రపు తనిఖీలతో చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేములవాడ పట్టణంలో మున్సిపల్ రికార్డుల ప్రకారం 4 బార్ అండ్ రెస్టారెంట్లు, 7 హోటళ్లు, 31 టిఫిన్ సెంటర్లున్నట్లు రికార్డులు చెబుతున్నప్పటికీ అనధికారికంగా అనేకం కొనసాగుతున్నాయి. తినుబండారాల దుకాణాలూ ఎక్కువగానే ఉన్నాయి. వీటిలో ఆహార భద్రత నియమ, నిబంధనలు గాలికొదిలేసి పదార్థాలను తయారు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పట్టణంలోని ఓ హోటల్‌లో ఇటీవల ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలో పెద్దఎత్తున కుళ్లిన మాంసం, ఆహార పదార్థాలు, బిర్యానీ వంటి వెలుగు చూడటం కలకలం రేపింది. ఈ సంఘటన పట్టణంలోని హోటళ్లలోని పరిస్థితికి అద్దం పట్టింది.

**అపరిశుభ్ర వాతావరణంలో..**

వేములవాడ ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో ఇక్కడికి రాష్ట్రంలోని భక్తులు, ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు



వస్తుంటారు. ఇలాంటి వారు భోజనాలను, టిఫిన్స్‌ను పట్టణంలోని వివిధ రెస్టారెంట్లు, హోటళ్లలో, టిఫిన్ సెంటర్లలో ఆహార పదార్థాలను వినియోగిస్తుంటారు. ఇలాంటి పట్టణంలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహార పదార్థాలను ప్రజలకు, భక్తులకు అందించే విధంగా చర్యలు చేపట్టాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఆకర్షణీయ రంగులతో, శుచి శుభ్రత లేని ఆహార పదార్థాలను ప్రజలకు అంటగట్టి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనే విమర్శలున్నాయి.

రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో వంటకాలు అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేస్తున్నారు. వంట గదులు దుర్వాసన, కుళ్లిన వ్యర్థాలతో అపరిశుభ్రంగా ఉన్నప్పటికీ అందులోనే ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. శుభ్రమైన నీటితో, ఏ రోజుకు సరిపడా ఆరోజు మాంసం వండాల్సి ఉండగా చాలా హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో వాటిని రిఫ్రిజిరేటర్లలో నిల్వ చేస్తూ చాలా రోజుల తరబడి వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఎప్పుడో ఓసారి తనిఖీలు చేసి నామమాత్రం జరిమానాలు వేసి వదిలేయడంతో తిరిగి యథావిధిగా కొనసాగుతున్నాయి.

'వేములవాడ, సిరిసిల్ల పట్టణాల్లో రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహిస్తున్నాం. నిబంధనలు పాటించని హోటళ్లను తనిఖీ చేసి దాదాపు పది కేసుల వరకు నమోదు చేశామ'ని ఆహార భద్రత తనిఖీ జిల్లా అధికారిణి అనూష పేర్కొన్నారు.

## కోతలకు వేళాయె.. పాత బోనస్ రాదాయె



జగిత్యాల : వచ్చే అక్టోబరు 1 నుంచి వానాకాలం ధాన్యాన్ని సేకరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటుండగా జిల్లాలో ముందుగా నాట్లు వేసిన పొలాలు మరో వారం పది రోజుల్లో కోతలు ప్రారంభమవుతాయి. ఈ క్రమంలో పాత సీజన్‌కు చెందిన బోనస్ బకాయిలు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వానాకాలంలో 3.15 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా ఇందులో దాదాపు 1.15 లక్షల ఎకరాల్లో సన్న వరి వేసినట్లు అంచనా. నిరుటి వానాకాలం మాదిరిగా ఈసారీ కనీసం 33 వేల మెట్రిక్ టన్నుల సన్న రకాలను విక్రయించే అవకాశముంది. ఈ నేపథ్యంలో పాత బోనస్ బకాయిలను విడుదల చేయాలని, ఈ సీజన్‌లో ఎప్పటికప్పుడు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సేకరిస్తున్న సన్న ధాన్యానికి సంబంధించి బోనస్‌ను ఆలస్యంగా విడుదల చేస్తుండటంతో రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. 2024–25 వానాకాలంలో జిల్లాలో 30,870 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని కొనుగోలు చేయగా క్వింటాలుకు రూ.500 చొప్పున రూ.15.43 కోట్ల బోనస్‌ను దాదాపు నాలుగు నెలలు ఆలస్యంగా చెల్లించారు. గడచిన యాసంగిలో 87,917 మంది నుంచి 4,63,303 మెట్రిక్ టన్నుల దొడ్డు, 4,788 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మొత్తం ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,320 చొప్పున రూ.1,085.63 కోట్లను చెల్లించారు. సన్న రకాలకు సంబంధించి రూ.2.39 కోట్ల బోనస్‌ను ఇప్పటికీ ఇవ్వలేదు.

**గోదాములు ఖాళీ లేవు**

గత సీజన్లలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు మరాడించగా పౌర సరఫరాల గోదాముల్లో బియ్యాన్ని నిల్వ చేశారు.

పౌర సరఫరాల సంస్థకు చెందిన బియ్యంతో పాటు ఎఫ్‌సీఐ బియ్యం, ప్రైవేటుగా కొనుగోలు చేసిన మొక్కజొన్నలు తదితరాల నిల్వలతో జిల్లాలోని గోదాములన్నీ దాదాపుగా నిండుగా ఉన్నాయి. మరోవైపు కొన్ని మిల్లుల నుంచి సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) రావాల్సి ఉండగా ఈ బియ్యాన్ని తీసుకుని నిల్వ చేసే పరిస్థితి అంతగా లేదు. మరో పక్షం రోజుల్లో వానాకాలం ధాన్యం చేతికందనుండగా ఈలోగా గోదాముల్లోని పాత నిల్వలను తరలించాల్సి ఉంది. ప్యాక్స్‌లు, ఐకేపీ కేంద్రాలు, డీసీఎంఎస్‌లకు ధాన్యం సేకరణ కమీషన్‌ను, హమాలీ ఛార్జీలను, కేంద్రాల నిర్వహణ ఖర్చులను చెల్లించాల్సి ఉంది. జిల్లాలో గన్నీ సంచులు పాతవై సేకరణలో జాప్యానికి కారణమవుతున్నందున కొనుగోళ్లు మొదలయ్యేలోపే తగినన్ని గన్నీలను సిద్ధం చేయాలి. కేంద్రాల్లో వసతుల కల్పన, తూకం యంత్రాలు సిద్ధం చేయడం, ఇతర ప్రాంతాల నుంచి హమాలీలను రప్పించడం, ధాన్యం బస్తాల రవాణా గుత్తేదారులను ఎంపిక తదితర వసతులు సకాలంలో చేపట్టడం ద్వారా ధాన్యం సేకరణకు పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యే అవకాశముంది. రైతులకు బోనస్ చెల్లింపు, కమీషన్ విడుదలపై ప్రభుత్వానికి నివేదించినట్లు పౌర సరఫరాల డీఎం జితేంద్రప్రసాద్ తెలిపారు.

## సన్నబియ్యం పక్కదారి



హైదరాబాద్: సన్నబియ్యం కొందరు డీలర్ల పంట పండిస్తోంది. జూన్‌లో మూడు నెలల కోటా పంపిణీ చేయగా తాజాగా మళ్లీ సన్నబియ్యం ఇచ్చారు. నగరంలో కొందరు డీలర్లు పూర్తి కోటా పంపిణీ చేయకుండా వివిధ మార్గాలను అనుసరిస్తుండటం గమనార్హం.

అప్పట్లో మూడు నెలల కోటా ఇవ్వడాన్ని అవకాశంగా తీసుకుని, ఒక నెల కోటా మాత్రమే ఇచ్చి, మిగతావి తర్వాత ఇస్తామని చెప్పి పంపించారు. మూడు నెలల కోటా ఇచ్చిన వారికి ఐదు నుంచి పది కేజీలు తక్కువ ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. ఈనెల కోటాలో కూడా కొంతమేర కోత విధించినట్లు తెలిసింది. కార్డులో పేర్లున్న ఒక్కొక్కరికి ఆరు కేజీల చొప్పున బియ్యం ఇవ్వాల్సి ఉంటుంది. కొందరు స్టాక్ తక్కువ వచ్చిందని చెబుతుండటం గమనార్హం. తర్వాత సంప్రదిస్తే ఇంకా రాలేదని చెబుతున్నట్లు కార్డుదారులు చెబుతున్నారు. కొందరు డీలర్లు సన్నబియ్యం అవసరం లేదనుకున్న వారికి.. తీసుకున్నట్లు వేలిముద్రలు వేస్తే కేజీకి రూ.20 నుంచి రూ.25 వరకు ఇచ్చినట్లు సమాచారం. ప్రధానంగా కార్వాన్, మెహిదీపట్నం, నాంపల్లి, చార్మినార్, చాంద్రాయణగుట్ట, తార్నాక, ఉప్పల్, బోరబండ, బాలానగర్ ప్రాంతాల్లో కొన్ని దుకాణాల్లో అక్రమాలకు తెరతీసినట్లు సమాచారం.

**ఎలాంటి ఫిర్యాదులు రాలేదు**

హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారి పరిధిలో 647282 రేషన్ కార్డులు ఉండగా 24,24,824 మందికి నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నారు. జనవరి నుంచి జులైలోపు 46 దుకాణాల్లో అక్రమాలపై పౌరసరఫరాశాఖ విజిలెన్స్ విభాగం కేసులు నమోదు చేయడం గమనార్హం. ఈ దుకాణాల్లో రేషన్ పంపిణీకి సంబంధించి 487 అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తించారు. ప్రస్తుతం ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, పంపిణీ బాగా జరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

## మల్లన్న స్వామి.. సమస్యలు ఆలకించవేమి



ఓదెల : జిల్లాలో అతిపెద్ద శైవక్షేత్రమైన ఓదెల మల్లికార్జున స్వామి ఆలయాన్ని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. ఏడాది పొడవునా దాదాపు యాభై లక్షల మందికిపైగా భక్తులు శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామిని దర్శించుకుంటారు. ఇంత ప్రాచుర్యం ఉన్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యంతో ఆలయం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలవగా.. భక్తులు సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతున్నారు.

**రూ.కోటికిపైగా ఆదాయం ఉన్నా..**

ఏటా ఒగ్గు పూజారులతో భక్తులు నలభై వేలకుపైగా పట్నాలు వేసి బోనాలు సమర్పిస్తారు. ఉగాది పర్వదినంతో మొదలై ప్రతి ఆది, బుధవారాల్లో మల్లన్న జాతర జరుగుతుంది. మార్చి నుంచి జులై వరకు జరిగే పెద్దపట్నం మహోత్సవాల వరకు అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. సమ్మక్క జాతరకు ముందు మొక్కులు చెల్లించడానికి రెండేళ్లకోసారి మల్లన్న దర్శనానికి వస్తుంటారు. దీంతో ఏడాదికి దాదాపు రూ.3 కోట్ల ఆదాయం సమకూరుతోంది. పదిహేనేళ్ల క్రితమే 6ఏ(రూ.కోటికిపైగా ఆదాయం ఉన్న)ఆలయంగా గుర్తింపు పొందినా అభివృద్ధికి నోచుకోక ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారైంది.

**చేపట్టాల్సిన పనులు ..**

పురాతన ఆలయం కావడంతో మండపాలు శిథిలావస్థకు చేరి వర్షాకాలంలో ఉరుస్తున్నాయి. గర్భగుడికి మరమ్మతులతోపాటు దేవాలయ మండపాలు పునర్నిర్మాణం చేయాల్సిన అవసరం ఉంది. ఆలయ గోపురాలు, ప్రాకార మండపాల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఓ భక్తుడి జ్ఞాపకార్థం నిర్మించిన 15 వసతి గృహాల సముదాయం మినహా విడిది చేసేందుకు తగినన్ని వసతి గృహాలు లేవు. తగినన్ని ఓపెన్ షెడ్లు లేక భక్తులు చెట్ల కిందనే సేదతీరాల్సి వస్తోంది. జాతర సమయాల్లో వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలం లేక నానాఅవస్థలు పడుతున్నారు. తగినన్ని సులభ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టాలి.

భక్తుల సౌకర్యార్థం తిరుపతి ఎక్స్‌ప్రెస్‌తోపాటు మరిన్ని ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్, కాళేశ్వరం, కొండగట్టు, వేములవాడను కలుపుతూ మరిన్ని బస్సులు నడిపించేలా అధికారులు చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

**బృహత్ ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం**

–మొండయ్య, ఆలయ పాలక మండలి ఛైర్మన్

స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ సహకారంతో రూ.20 కోట్ల అంచనా వ్యయంతో ఆలయాన్ని తీర్చిదిద్దేందుకు బృహత్ ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. వసతిగృహాల నిర్మాణానికి దాతలసాయం కోరుతున్నాం. దీపావళి తర్వాత నిత్యాన్నదానం చేపట్టనున్నాం. మహిళలకు సులభ్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి ముగ్గు పోశాం. ఆలయం చుట్టూ రెండు వరుసల రహదారి, సెంట్రల్ లైటింగ్ తదితర ఏర్పాట్లు చేయనున్నాం.

## నాడు అవార్డులు.. నేడు అధ్వానం

సిరిసిల్ల : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గతంలో జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్న సిరిసిల్ల పురపాలక సంఘం.. ప్రస్తుతం పారిశుద్ధ్య నిర్వహణలో అధ్వానంగా మారింది. పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. సిరిసిల్ల పట్టణం పారిశుద్ధ్య నిర్వహణలో ఒకప్పుడు రాష్ట్రానికే ఆదర్శంగా ఉండేది. చెత్త సేకరణ, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై విస్తృత స్థాయిలో ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. ప్రతిరోజు ఇంటింటి నుంచి చెత్త సేకరణతో మెరుగైన ఫలితాలు సాధించి రాష్ట్రస్థాయిలో పురస్కారాలు అందుకున్నారు. ఇక్కడ ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, చెత్త సేకరించే విధివిధానాలపై స్థానిక మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు దిల్లీలో స్వచ్ఛ పాఠాలు చెప్పేవారు. ప్రస్తుతం పరిస్థితి తలకిందులుగా మారుతోంది.

గుట్టలుగా వ్యర్థాలు మున్సిపాలిటీలో 39 వార్డులు ఉన్నాయి. పారిశుద్ధ్య నిర్వహణకు 36 ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. ఇందులో ఆరు మరమ్మతులకు గురయ్యాయి. 16 ఆటోలు ఉండగా.. రెండు పనిచేయటం లేదు. గతంలో భారాస ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన పొక్లెయిన్ మూలకు చేరింది. దీంతో పలు కాలనీలు, మురుగు కాలువల్లో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. నిర్వహణలో నిర్లక్ష్యంతో కాలువల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి పూడుకుపోయాయి.

పడిపోయిన ర్యాంకు సిరిసిల్ల పురపాలిక గత భారాస ప్రభుత్వ హయాంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో అవార్డు అందుకుంది. కేంద్ర ప్రభుత్వం దిల్లీలో అక్టోబరు 2న అవార్డు అందించింది.

2024–25 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులు ఇటీవల ప్రకటించింది. సిరిసిల్లకు రాష్ట్రస్థాయిలో 81వ ర్యాంకు, జాతీయ స్థాయిలో 471వ ర్యాంకుతో వెనుకంజ వేసింది. స్కోర్ 6477 సాధించింది.

## ఆశయ సాధనలో.. ఐదు దశాబ్దాలు..!

చిట్యాల : మహాత్ముడి సిద్ధాంతాలు, ఆశయాలను గత 50 ఏళ్లుగా ప్రచారం చేస్తున్నాయి 'గాంధీ జ్ఞాన్‌ప్రతిష్ఠాన్', 'గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ' సంస్థలు. ఈ సంస్థల రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నల్గొండ జిల్లాకు చెందిన యానాల ప్రభాకర్‌రెడ్డి పని చేస్తున్నారు. 2007 నుంచి ఆయన ఈ సంస్థల కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్నారు. 'గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ' అంతర్జాతీయంగా, 'గాంధీ జ్ఞాన్‌ప్రతిష్ఠాన్' దేశంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రధానంగా గాంధీ సూచించిన సూత్రాలైన 'సత్యం, అహింస, దొంగతనం చేయకుండా ఉండటం, బ్రహ్మచర్యం పాటించడం, స్వీయ క్రమశిక్షణ, మంచి నడవడిక, అనుమతి లేకుండా ఇతరుల వస్తువులను తాకడం, సర్వధర్మ సమానత్వం, స్వదేశీ వస్తువుల వాడకం, అంటరానితనం నిర్మూలన, శ్రమదానం, మధురవచనాలు పలకడం వంటి వాటిపై ప్రచారం నిర్వహిస్తున్నారు. వీటితో పాటు




విద్యార్థులలో స్వయం సమృద్ధి సాధనకు మెలకువలు, ప్రకృతి వైద్యం, సేంద్రియసాగు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపైనా విద్యాసంస్థల్లో, ఇతరత్రా సెమినార్లు, కార్యశాలలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో సుమారు 400 వరకు కార్యక్రమాలు నిర్వహించినట్లు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 2018లో నల్గొండ ఎన్‌జీ కళాశాలలో 5500 మంది విద్యార్థులతో నిర్వహించిన గాంధీ వేషధారణ ప్రదర్శన గిన్నిస్‌బుక్ రికార్డులకు ఎక్కింది. యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో గాంధీ ప్రతిమలతో ఇటీవల ప్రదర్శన నిర్వహించారు. తమ సంస్థలు ఏర్పడి 50 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ కార్యక్రమాల్లో భాగంగా గాంధీ జయంతిని పురస్కరించుకుని రానున్న అక్టోబరు 10 నుంచి 13 వరకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో గాంధీ లక్ష విగ్రహాల ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించామని, సీఎం ముఖ్య అతిథిగా రానున్నారని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని జిల్లాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

## లెక్కల్లేవు.. దస్త్రాల్లేవు!

మెదక్: సొంతలాభం కొంత మానుకొని.. పొరుగు వారికి తోడుపడవోయి.. అన్నది కవి వాక్కే కాదు.. మన సమాజ ధర్మం కూడా. దాన్ని పరిశ్రమలు తప్పకుండా పాటించాలని తెచ్చిందే సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) విధానం. ప్రభావిత ప్రాంతాల్లో ప్రగతి పనులు చేపట్టాలనే ఉద్దేశంతో అమలు చేస్తున్నారు. ఇందుకోసం పటిష్ఠ విధివిధానాలు రూపొందించి అమలు చేసే బాధ్యతను జిల్లా అధికారులకు అప్పగించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. పలు పరిశ్రమల నిర్వాహకులు పర్యవేక్షణ యంత్రాంగం నిర్లక్ష్యాన్ని ఆసరాగా తీసుకొని.. నిర్దేశిత నిధులు పూర్తిగా వ్యయం చేయకుండా కాగితాల్లోనే మమ అనిపిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**నిబంధనల ప్రకారం**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశిత లాభం ఆర్జిస్తున్న కంపెనీలు తప్పనిసరిగా ఆదాయంలో రెండు శాతాన్ని సామాజిక బాధ్యత కింద ఖర్చు చేయాలి. ప్రతి కంపెనీలోనూ సీఎస్ఆర్ కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ నిధులను వ్యయం చేయకుంటే జరిమానా విధించే అధికారం ప్రభుత్వానికి ఉంది.

**సంగారెడ్డిలో లొసుగులు ఇలా..**

రెండు రోజుల క్రితం సంగారెడ్డి జిల్లాలో సీఎస్ఆర్ నిధులపై కలెక్టర్ ప్రావీణ్య సమీక్ష నిర్వహించగా.. పలు లొసుగులు వెలుగులోకి వచ్చాయి. కొన్నేళ్లుగా కంపెనీలు ఎన్ని నిధులు వెచ్చించాయనే సమాచారం పర్యవేక్షణ అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. దీంతో పాటు పరిశ్రమల వద్ద సైతం ఈ నిధుల వ్యయంపై దస్త్రాలు లేవు. ఏయే



పనులు చేపట్టారనే దానిపై జిల్లా అధికారులతో పాటు పరిశ్రమల వద్ద సమాచారం కొరవడింది. సీఎస్ఆర్ నిధుల వినియోగం కాగితాల్లోనే జరుగుతున్నట్లు నిర్ధారణకు వచ్చిన కలెక్టర్ నూతనంగా సీఎస్ఆర్ కమిటీని నియమించి చేపడుతున్న పనులపై పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో..**

సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనూ సీఎస్ఆర్ నిధుల జమ, వినియోగానికి సంబంధించిన అధికారుల వద్ద సమచారం కొరవడింది. పరిశ్రమలు ప్రకటించిన నిధులు పూర్తిస్థాయిలో వినియోగానికి నోచడం లేదనే ఆరోపణలున్నాయి. గత నాలుగేళ్లుగా ఆడిట్ లేకపోవడంతోనే సీఎస్ఆర్ నిధుల వ్యయానికి సంబంధించిన వివరాలు పరిశ్రమల వద్ద లేనట్లుగా తెలుస్తోంది. చేపట్టిన పనులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉండగా.. ఈ ప్రక్రియ సక్రమంగా సాగకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనూ సీఎస్ఆర్ నిధుల వినియోగంపై పర్యవేక్షణ పెరగడంతో పాటు నూతన కమిటీల నియామకం చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

## ప్రభుత్వ బడుల్లో.. పూర్వ ప్రాథమిక విద్య

తూప్రాన్,: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసింది. వాటిల్లో శుక్రవారం నుంచే బోధన కొనసాగనుంది. జిల్లాలో 27 పాఠశాలలను ఎంపిక చేయగా అందులో బోధకులు, ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించారు. బోధకులకు ఇంటర్, ఆయా పోస్టుకు 7వ తరగతి విద్యార్హతగా నిర్ణయించారు. అన్ని పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా బోధకులు 150 మందికి, ఆయా పోస్టుకు 130 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిల్లో విద్యార్హత ఎక్కువగా ఉన్న వారికి అవకాశం కల్పించేలా పరిశీలిస్తున్నారు. చిన్న ఉద్యోగం.. పెద్ద చదువులు: ఈ పోస్టులకు దరఖాస్తులు సమర్పించిన వారిలో పీజీ, బీఈడీ పూర్తి చేసిన వారున్నారు. కొన్ని చోట్ల ఒక్కో పాఠశాలలో 10 వరకు దరఖాస్తులు వచ్చాయి. బోధకులకు రూ.8వేల వేతనం, ఆయాకు రూ.6వేల వేతనం ఇచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అయినా చాలా గ్రామాల్లో రెండు ఉద్యోగాలకు పోటీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో కొందరు పైరవీలు సైతం చేసుకుంటున్నారు. అయినా నిబంధనల ప్రకారం భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ పూర్తిచేసి, చిన్నారులకు బోధన అందించేలా కార్యాచరణ రూపొందించారు. ప్రైవేట్‌కు వెళ్లే చిన్నారులను వీటిల్లో చేర్చేందుకు ఉపాధ్యాయులు ప్రయత్నం చేస్తున్నారు. ఆదేశాలు ఇచ్చాం: రాధాకిషన్ డీఈఓ పూర్వప్రాథమిక విద్యా విధానాన్ని ప్రారంభించేందుకు అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం. వారే బోధకులు, ఆయాలను నియమిస్తారు. వారు అందించిన జాబితానే ఖరారు చేస్తాం.

చురకలు



## ఖాళీగా షెడ్లు.. ఇరుకుగా రోడ్లు

కరీంనగర్: జిల్లాలోని నగర, పురపాలికల్లో వీధివ్యాపారుల కోసం సౌకర్యాలు కల్పించి 'ఆత్మనిర్భర్' నింపాలనే లక్ష్యంగా ముందుకెళ్తున్నా.. ఆచరణలో సాధ్యం కావడం లేదు. రహదారులపై చిరు వ్యాపారం సాగించకుండా షెడ్లు నిర్మిస్తున్నా వ్యాపారులు ఆసక్తి చూపడంలేదు. రోడ్లే అడ్డాలుగా మలుచుకోవడం, ఉన్న చోటనే వాటిని నిర్మించాలని కోరుతుండటంతో ప్రాంతాల్లో స్థలం దొరకడంలేదు.

**నెరవేరని ప్రభుత్వాల లక్ష్యం**

వీధివ్యాపారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ కింద రుణాలు ఇస్తుండగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. పక్కా అడ్డాలు లేకపోవడంతో రోడ్ల మీద దుకాణాలకు ఎదురుగా కూర్చొని అమ్ముతుండగా ప్రైవేటు దుకాణాల యజమానులు అద్దె వసూలు చేస్తున్నారు. పురపాలికలు చూపించే షెడ్లలోకి వెళ్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కానీ వారు వెళ్లడంలేదు. పథకం లక్ష్యం నెరవేరడంలేదు.

**అయిదు చోట్ల ఖాళీ**

పండ్ల మార్కెట్కు బస్టాండ్ వెనక రూ.17 లక్షలతో వెండర్ జోన్



ఏర్పాటు చేస్తే అక్కడికి వెళ్లకపోవడంతో ఇతరులకు కేటాయించారు. రూ.30 లక్షలతో ఇందిరానగర్లో నిర్మించగా ఒకరిద్దరు మినహాయించి వ్యాపారులు ఎవరూ ఉండటం లేదు.

రూ.23 లక్షలతో చైతన్యపురిలో నిర్మించగా ఒక్కరూ ఉండటం లేదు. బ్యాంకుకాలనీ రహదారిపై దుమ్ము, ధూళిలో కూరగాయలు, పండ్లు అమ్ముతున్నారు. రూ.25 లక్షలతో హౌసింగ్బోర్డుకాలనీలో మార్కెట్ నిర్మించగా అది నిరుపయోగంగా ఉంది. వెంకటసాయి థియేటర్ ఎదురుగా, పాతబజారులో కూర్చొనే వీధివ్యాపారులకు దీనిని నిర్మించారు. శ్రీనగర్, సప్తగిరికాలనీలో రూ.40 లక్షలతో నిర్మించగా ఉదయం ఒకరిద్దరు ఉంటున్నారు. టెలిఫోన్ క్వార్టర్స్ రోడ్డులో రాకపోకలకు ఇబ్బందులు కలిగించేలా వీధి వ్యాపారం చేస్తున్నారు.

**ఇలా చేస్తే ప్రయోజనం**

ఏ ప్రాంతం వారిని ఆ ప్రాంతంలోనే ఖాళీగా ఉన్న మార్కెట్లు, షెడ్లలోకి పంపించాలి. రహదారులకు ఇరువైపులా చిరు వ్యాపారులు అడ్డాలు పెట్టకుండా కట్టడి చేయాలి. నాలుగు చక్రాలు, తోపుడుబండ్లను కూడా అదే ప్రాంతానికి తరలించాలి. దీ రహదారులపై కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువులు దొరకకపోతే ప్రజలు కూడా షెడ్ల వద్దకు వస్తారు.

# దెబ్బతిన్న వంతెన.. నరకయాతన

ముస్తాబాద్: రాజన్న సిరిసిల్ల-సిద్దిపేట జిల్లాల సరిహద్దు గ్రామాలైన మోహినికుంట-రాజక్కపేట మధ్యనున్న వంతెన అంచు కోతకు గురైంది. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గం మీదుగానే రెండు జిల్లాల వాహనదారులు సిద్ధిపేట జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించగా.. బిల్లులు సకాలంలో రాకపోవడంతో మధ్యలోనే నిలిచిపోయాయి. పనులు ముందుకు సాగేలా చొరవ చూపాలని ఇరు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

**రూ.1.80 కోట్ల నిధులు మంజూరు**

రాజక్కపేట కొత్తచెరువు నుంచి వంతెన కిందుగా వాగు ద్వారా నీరు మోహినికుంట, మద్దికుంట చెరువు నిండుకొని.. ముస్తాబాద్ చెరువుల్లోకి చేరుతాయి. అయితే ఇరుగ్రామాల మధ్యనున్న వంతెన శిథిలావస్థకు చేరడంతో ఎంఆర్ఆర్ (మెయింటెనెన్స్ రూరల్ రోడ్డు) ద్వారా దాదాపు రూ. 1.80 కోట్లు వరకు మంజూరైనట్లు సమాచారం. సంబంధిత అధికారులు మాత్రం పనుల వివరాలను వెల్లడించడంలేదు. వంతెన మరమ్మతుల కోసం నిధులు విడుదలయ్యాయా లేదా నూతన వారధి నిర్మాణానికి మంజూరయ్యాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

**కోతకు గురైన వారధి రోడ్డు**

నిత్యం లింగన్నపేట నుంచి చిన్నచీకోడ్, మద్దికుంట, మోహినికుంట గ్రామాలతోపాటు సిద్ధిపేట జిల్లా రాజక్కపేట పరిసర గ్రామాల ప్రజలు



ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు వంతెన వద్ద రోడ్డు కోతకు గురవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అలాగే తాత్కాలిక రోడ్డు కోసం వేసిన పైపులు అక్కడే నిరుపయోగంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఇరు జిల్లాల వాహనదారులు కోరుతున్నారు.

**పనులు జరిగేలా చూడాలి**

మెర్గు లింగం, మోహినికుంట

రెండు జిల్లాలకు చెందిన వందలాది వాహనదారులు ఈ రోడ్డు మీదుగా తక్కువ దూరంతో వెంకట్రావుపల్లె మీదుగా సిద్ధిపేట జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన ఇప్పటికే శిథిలావస్థకు చేరుకుంది. వెంటనే పనులు జరిగేలా చూడాలి.

**గుత్తేదారుకు సూచిస్తాం**

గత ప్రభుత్వ హయాంలో ఎంఆర్ఆర్ కింద నిధులు మంజూరయ్యాయి. సదరు కాంట్రాక్టర్ పనులు చేయడానికి ముందుకు రావడంలేదు. పనులు చేయాలని సదరు కాంట్రాక్టర్కు సూచిస్తాం.

సుదర్శన్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ

# మునిగిన వాకిళ్లు.. ఉబికిన కన్నీళ్లు



హైదరాబాద్: నగరంలో మొదలైన వాన తెల్లవారుజాము వరకు కొనసాగడంతో అనేక ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. కూడా భారీ వర్షం కురవడంతో ఆయా కాలనీల్లో వరద ఏమాత్రం తగ్గలేదు. భారీ మోటార్లను ఏర్పాటు చేసి తోడే ప్రయత్నం చేసినప్పటికీ.. మ్యాన్‌హోళ్ల నుంచి ఉబుకుతూనే ఉంది. మియాపూర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ పక్కనున్న నేల కోతకు గురవడంతో భవనం ప్రమాదంలో పడింది. బండ్లగూడ జాగీర్, నిజాంపేట్, మియాపూర్, ముషీరాబాద్ నుంచి బాగ్‌లింగంపల్లి వరకు పలు అపార్ట్‌మెంట్ల సెల్లార్లు వరదతో నిండిపోయాయి. కూకట్‌పల్లి, బేగంపేట్ ద్వారా భారీగా వరద హుస్సేన్‌సాగర్‌లోకి ప్రవహించడంతో.. నీటి మట్టం గణనీయంగా పెరిగింది. ఈ ప్రభావం ఖైరతాబాద్, బేగంపేట్‌లోని లోతట్టు ప్రాంతాలపై, అశోక్‌నగర్ వరద నాలాకు పరిసర కాలనీలపై పడింది. కాలనీల్లో మోకాలు లోతు వరదతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు రాలేక, దుర్గంధంతో ఇళ్లల్లో ఉండలేక నరకయాతన పడ్డారు. ప్రధాన రహదారులనూ వరద ముంచెత్తడంతో వాహనదారులు అవస్థలు తప్పలేదు.

**రాము జాడెక్కడ..?** అఫ్జల్‌సాగర్ నాలాలో గల్లంతైన వారిలో రాము ఆచూకీ ఎక్కడని కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. నాలుగు రోజుల తర్వాత అతడి బంధువు అర్జున్ మృతదేహం లభ్యమైన నల్గొండ జిల్లా భీమ లింగం వంతెన సంగం ప్రాంతానికి మాంగార్‌బస్తీ నుంచి 50 మందికి పైగా యువకులు తరలి వెళ్లారు. తిరిగొచ్చిన కొంతమందితో తన భర్త జాడ దొరికిందా అని భార్య రాఖీ ఆరాతీశారు. దాంతో వారు కంటతడి పెట్టడంతో ఆ ప్రాంతమంతా రోదనలు మిన్నంటాయి.

**ఐదో రోజూ కొనసాగిన గాలింపు..**

ముషీరాబాద్ వినోభానగర్‌లోని నాలాలో పడిపోయి గల్లంతైన దినేశ్ ఆచూకీని గుర్తించేందుకు ఐదో రోజైన గురువారం కూడా గాలింపు ప్రక్రియ కొనసాగింది. స్థానికంగా ఉన్న భూగర్భ డ్రైనేజీతో పాటు నాలా వెంట 3 కి.మీ. మేరకు ఇరవై మంది హైడ్రా, జీహెచ్‌ఎంసీ సిబ్బంది గాలింపు చేపట్టినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో దినేశ్ భార్య రాజమణి, కుటుంబ సభ్యులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. తామంతా నిద్రహారాలు మానేసి.. ఎదురుచూస్తున్నామని చెబుతున్నారు.

# ఇసుక.. అధికారులకు మస్కా



శంకరపట్నం : వాల్టా చట్టం ప్రకారం జల వనరుల నుంచి ఇసుకను అక్రమంగా తరలించొద్దు. కానీ జిల్లాలో చాలా చోట్ల ఈ దందా దర్జాగా కొనసాగుతోంది. గ్రామాల్లోని వాగులు ఇందుకు వేదికలుగా మారుతున్నాయి. పొక్లెయిన్ యంత్రాలతో ఇష్టానుసారంగా తవ్వకాలు జరుపుతున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వాగుల్లో నీటి నిల్వలు తగ్గుముఖం పడితే చాలు తవ్వకాలు మొదలుపెడుతున్నారు. ఇలా ఇసుకాసురులు అధికారుల కళ్లను కప్పి యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నారు. శంకరపట్నం మండలంలోని గద్దపాక వాగు నుంచి మండలంలోని సగం గ్రామాలకు ఇసుక రవాణా చేస్తున్నారంటే వ్యాపారం ఏ మేర సాగుతుందో చెప్పవచ్చు. అర్కండ్ల, కేశవపట్నం, తాడికల్, మక్త, ఎరడపల్లి గ్రామాల్లోని వాగుల్లో తవ్వకాలు చేస్తున్నారు. దీనిని అరికట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. అక్రమ తవ్వకాలతో వాగుల్లో పెద్ద గొయ్యిలు దర్శనమిస్తున్నాయి. వానాకాలంలో సైతం నీటి ప్రవాహం తగ్గితే చాలు యథావిధిగా తవ్వుతూ సొమ్ము చేసుకొంటున్నారు. శంకరపట్నం మండలం గద్దపాక వాగు నుంచి అధికంగా తవ్వకాలు చేస్తూ మండలంలోని సగానికి సగం గ్రామాలకు రవాణా చేస్తున్నారు. సగటున రోజుకు పది నుంచి ఇరవై ట్రాక్టర్లలో నెలకు సుమారు 300 టన్నులు తరలిస్తున్నారు.

ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పునకు రూ. 2000 వరకు సొమ్ము చేసుకుంటున్నారు. వాగులే కాకుండా చెక్‌డ్యాం ప్రాంతాల నుంచి దొడ్డు ఇసుక తరలిస్తున్నారు. కేశవపట్నం వాగు నుంచి సమీప గ్రామాలకు రవాణా చేస్తున్నారు. జాతీయ రహదారి ఆనుకొని, పోలీస్ స్టేషన్ వెనకాల వాగులనూ వదలడంలేదు. బయానా గుట్ట ప్రాంతంలో నిల్వలు డంపు చేస్తున్నారు.

రవాణా సాఫీగా సాగేలా రహస్యంగా మట్టి దారులను అభివృద్ధి చేసుకొంటున్నారు.

కరీంపేట్ గ్రామంలో ప్రధాన కాలువ యూటీ(అండర్ టన్నెల్) వద్ద నుంచి ట్రాక్టర్లలో రవాణా చేస్తున్నారు. ఎరడపల్లి, ముత్తారం, తాడికల్, వంకాయగూడెం వాగుల వద్ద నిత్య దందాగా మారింది.


ఎస్సారెస్పీ ప్రధాన కాలువలో నీటి నిలిపివేత తర్వాత.. అందులో నిలిచిన ఇసుకను సైతం వదలకుండా.. ఆదాయం గడిస్తున్నారు.

అర్కండ్ల వాగుతోపాటు చెక్‌డ్యాం నుంచి సేకరించి.. ఖాళీ ప్రదేశాల్లో డంపులు చేసి.. అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అధికారులు దృష్టి సారించి తవ్వకాలను అడ్డుకొని భూగర్భ జలాలు కాపాడాల్సిన అవసరముంది.

# కాగితాల్లో కనపడరు!

కరీంనగర్ : కరీంనగర్‌లోని ఓ పేరొందిన ఆస్పత్రిలో 36 మంది వివిధ విభాగాల సిబ్బంది రోగులకు సేవలందిస్తున్నారు. ఈ ఆస్పత్రి ఏర్పాటు సమయంలో కేవలం 12 మంది వివరాలు మాత్రమే వైద్యారోగ్యశాఖకు ఇచ్చారు. ప్రస్తుతం అందుకు మూడింతల సిబ్బంది వివిధ పనులు చేస్తున్నారు. వీరి వివరాలు సంబంధిత అధికారులకు ఇవ్వాలనే ఆలోచన ఆస్పత్రి యాజమాన్యం చేయలేదు. ఎప్పటికప్పుడు ఆస్పత్రులను పర్యవేక్షించిన అధికారులు పట్టించుకోవడం లేదు.

నాలుగు జిల్లాల పరిధిలో చిన్న, పెద్ద ప్రైవేటు ఆస్పత్రులన్నీ కలిపి 986 ఉన్నాయి. ఇందులో అధికారిక లెక్కల ప్రకారం 8వేల మందికి పైగా పని చేస్తున్నట్లు వైద్యారోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. కానీ వాస్తవంగా 12 వేల మందికి పైగా ఉంటున్నట్లు సమాచారం. చిన్న ఆస్పత్రిలోనే అటెండర్లు, స్టాఫ్‌నర్స్, వార్డుబాయ్, కంప్యూటర్ ఆపరేటర్, రిసెప్షనిస్ట్, సహాయకులు, వాచ్‌మెన్, టెక్నీషియన్ తదితర పోస్టుకిద్దరు చొప్పున లెక్కేసినా 16 మంది ఉంటారు. కానీ అధికారుల వద్ద ఉన్న సమాచారం ప్రకారం సగటున 8 మంది మాత్రమే పని చేస్తున్నారు. పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో సిబ్బంది లెక్కాపత్రం విషయంలో ఉమ్మడి జిల్లాలో గందరగోళమనే పరిస్థితి నెలకొంది. ఇటీవల కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో ఇంటర్మీడియట్ చదివిన వ్యక్తి ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్‌గా పని చేస్తూ జ్వరంతో వచ్చిన యువతిపై అత్యాచారం చేసిన సంఘటన సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. సంఘటన జరిగి 10 రోజులు దాటినా ఇప్పటి వరకు ఏ ఒక్క ఆస్పత్రి నుంచి సిబ్బంది వివరాలు పక్కాగా సేకరించే దిశగా వైద్యారోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోలేదు. ముఖ్యంగా కరీంనగర్‌లో అన్ని ఆస్పత్రులకు తాఖీదులు ఇచ్చి పక్కాగా సమాచారం, సిబ్బంది విద్యార్హతలు తెలుసుకుంటామని చెప్పిన అధికారులు ఆ



తరువాత ఆ విషయాన్నే మరిచారు. ఇక సిబ్బందిలో చాలామంది తప్పుడు ధ్రువీకరణలతో విధుల్లో ఉన్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చాలాచోట్ల గతంలో పనిచేసిన అనుభవాలతోనే కొత్త ఆస్పత్రుల్లో చేరుతూ సేవలందిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాల తీరు ఇలా..**

సిబ్బందికి తక్కువ వేతనాలిస్తూ వారి వివరాలు కార్మికశాఖకు, ఆరోగ్యశాఖకు తెలియజేయడం లేదు.

ఒకచోట తీసేసినవారి పూర్వాపరాలు తెలుసుకోకుండా విధుల్లో చేర్చుకుంటున్నారు. విద్యార్హతల పత్రాలు కొన్నిచోట్ల సేకరించడం లేదు. అనుభవం, బయోడేటానే చూస్తున్నారు. ఈపీఎఫ్ సహా ఇతర సంక్షేమాలు సిబ్బందికి వర్తింపజేసే ఆస్పత్రులు తక్కువే. జీతం తక్కువ ఇస్తుండటంతో రోగుల వద్ద కింది స్థాయి సిబ్బంది డబ్బులడుగుతున్నారు.

పరిసరాల శుభ్రతను కొన్ని ఆస్పత్రులు పట్టించుకోవడం లేదు.

కొన్నిచోట్ల రోగులు, కుటుంబీకులతో దురుసుగా మాట్లాడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకునేవారు లేరు.

# చకచకా విద్యుత్తు పనులు

ధర్మపురి : ధర్మపురి పురపాలికలో దశాబ్దాలుగా పలు విద్యుత్తు సమస్యలు నెలకొనగా వీటిని పరిష్కరించేలా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇటీవల ధర్మపురి పట్టణానికి చెందిన వివిధ రకాల విద్యుత్తు తీగలు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్తు స్తంభాలు ఇతరత్రా అంశాలపై మంత్రి లక్ష్మణ్‌కుమార్ విద్యుత్తుశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. రూ. 1.16 కోట్ల నిధులతో పనులు చేపట్టేందుకు పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా ప్రతిపాదించగా నిధులు మంజూరయ్యాయి. ఆయా పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

**ప్రధాన వీధుల్లో త్రీఫేజ్**

పురాతన విద్యుత్తు తీగలు, తరచూ కోతుల బెడద వెరసి విద్యుత్తు సరఫరాలో పలు సమస్యలు నెలకొంటున్నాయి. క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు దీనిపై సర్వే చేపట్టారు. ప్రస్తుతం 15 స్తంభాలను ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారుల పక్కన వేలాడే విద్యుత్తు తీగలు తొలగించి నూతన తీగలను ఏర్పాటు చేశారు. చిన్న వీధుల్లో త్రీఫేజ్ విద్యుత్తు కనెక్షన్లను కేటాయించారు. ఆయా పనులు వేగంగా కొనసాగు



తుండగా.. ప్రధాన వీధుల్లో త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా అవుతోంది.

**పరిష్కరించే దిశగా చర్యలు**

శివారు కాలనీల్లో ఇంకా విద్యుత్తు లోవోల్టేజీ సమస్యలు నెలకొని ఉండగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలో నిర్మాణంలోని అదనపు విద్యుత్తు సబ్ స్టేషన్ పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయి. 8 మీటర్ల విద్యుత్తు స్తంభాలు 111, తొమ్మిది మీటర్ల స్తంభాలు 500 మంజూరు చేశారు. ధర్మపురి నుంచి కమలాపూర్‌కి వెళ్లే మార్గంలో రహదారి పక్కన విద్యుత్తు త్రీఫేజ్ లైన్లు ఏర్పాటు చేశారు. 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణం దాదాపుగా పూర్తయింది.

**అభివృద్ధి దశలో ఉన్నాయి** ధర్మపురి పట్టణంలో మెరుగైన విద్యుత్తు సేవలకు ప్రభుత్వానికి రూ. 1.16 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరవగా ఆయా పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దీంతో పట్టణంలో నాణ్యమైన విద్యుత్తు సరఫరాతో సమస్యలు తొలగిపోనున్నాయి. - రవి, ఏఈ, ధర్మపురి

# పత్తిపాకకు మోక్షం

పెద్దపల్లి : జిల్లాలో ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణకు పదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన పత్తిపాక జలాశయం నిర్మాణానికి ఎట్టకేలకు కార్యాచరణ మొదలైంది. ఉమ్మడి జిల్లాలో 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ఉద్దేశించిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి జలాశయం(పత్తిపాక) డీపీఆర్(ప్రాజెక్టు నిర్మిత ప్రాంతం నైసర్గిక స్వరూపం, సర్వే నివేదిక) కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 1.10 కోట్లు విడుదల చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ప్రతిపాదించిన ఈ జలాశయం నిర్మాణం జరిగితే పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురితో పాటు చొప్పదండి నియోజకవర్గాల రైతులకు ప్రయోజనం కలుగుతుంది. అయితే ఇన్నాళ్లు కాగితాలకే పరిమితమైన ఈ ప్రాజెక్టు కోసం రైతుల ఎదురుచూపులు త్వరలో ఫలించనున్నాయి.

**ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోత..**

పత్తిపాక జలాశయం ప్రతిపాదిత స్థలం మూడువైపులా గుట్టలతో ప్రాజెక్టు నిర్మాణానికి అత్యంత అనుకూలమైందని నీటిపారుదలశాఖ అధికారులు గతంలో గుర్తించారు. 3 నుంచి 5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని పంపిస్తారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం 400 ఎకరాల అటవీభూమి, 1,300 ఎకరాల రెవెన్యూ భూమి సేకరించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టులోకి ఆరు లింకుల ద్వారా నీటిని పంపిస్తారు. ఇందు కోసం మేడారం జలాశయం నుంచి దేవికొండ వరకు ఇదివరకే లిఫ్ట్ పనులు జరిగాయి. దేవికొండ నుంచి పత్తిపాక జలాశయానికి లిఫ్టు ద్వారా, గ్రావిటీ కాలువ ద్వారా రెండు విధాలా నీటిని పంపించేందుకు ప్రతిపాదనలు చేశారు. ఈ ప్రాజెక్టు నీటిని నేరుగా కాకతీయ కాలువలోకి పంపించి రేవెల్లి సమీపంలో హెడ్ రెగ్యులేటర్ ద్వారా డి-83, నుంచి డి-94 కాలువల వరకు నీరందిస్తారు.

**చివరి ఆయకట్టుకు తొలగనున్న కష్టాలు**

కొన్నేళ్లుగా జిల్లాలోని ఎస్సారెస్పీ కాలువ చివరి భూములకు నీరందక రైతులు ఇబ్బందులు పడటం, నీటి కోసం ఆందోళనలు చేయడం పరిపాటిగా మారింది. జిల్లాలో ప్రధానమైన డి-83, డి-86 కాలువల ద్వారా పంట పొలాలకు సాగు నీరు చేరుతుంది. డి-83 ద్వారా పెద్దపల్లి, ధర్మారం, రామగుండం, మంథని, అంతర్గాం, పాలకుర్తి, కమాన్‌పూర్, ముత్తారం, రామగిరి, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు డి-86 ద్వారా సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు సాగునీరు అందుతుంది. చొప్పదండి, ధర్మపురి నియోజకవర్గాలలో మరో 10 వేల ఎకరాలకు అదనంగా సాగు నీరందుతుంది.

## విశిష్టతల సమాహారం.. వెయ్యేళ్ల వైభవం

మంథని పశ్చిమాభిముఖ ఆలయం.. ధ్వజ స్తంభం లేని మందిరం.. హనుమంతుడు ద్వార పాలకుడిగా ఉన్న క్షేత్రం.. ఇలా ఎన్నో విశిష్టతల సమాహారంగా విరాజిల్లుతోంది మంథనిలోని శ్రీ భిక్షేశ్వరాలయం.. పూర్వం మంత్రపురిగా పిలిచిన మంథనిలో కాకతీయుల కాలంలో నిర్మించిన అయిదు శివాలయాల్లో ఈ దేవస్థానం ఒకటి. దాదాపు వెయ్యేళ్ల కిందట ప్రతాపరుద్రుడి పాలనలో ఆలయాన్ని నిర్మించినట్లు ఆధారాలున్నాయి. శ్రీ భిక్షేశ్వరాలయంలో గణపతి, అయిదు పడగల నాగదేవత, నందీశ్వరుడి విగ్రహాలున్నాయి. పానవట్టం లేకుండా దక్షిణామూర్తి(లింగం), తపస్సు చేస్తున్న రూపంలో అన్నపూర్ణాదేవి, పశ్చిమాభిముఖంగా శ్రీ భిక్షేశ్వరుడు(శివుడు) దర్శనమిస్తారు. పశ్చిమాభిముఖంతో ఉన్న శివాలయాలు ఖజూరాలోని ఖండలీయ మహాదేవ, నేపాల్‌లోని ఖాట్మండ్‌లోని పశుపతినాథ్ ఆలయాలతో పాటు తెలంగాణలో మంథనిలో మాత్రమే ఉన్నాయి. గర్భగుడిలోని లింగం(శ్రీ భిక్షేశ్వరుడు)పై బ్రహ్మసూత్రం కనిపిస్తుంది. ఆలయాన్ని స్థానికులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి, విదేశాల భక్తులు దర్శించుకుంటారు. దక్షిణామూర్తి విగ్రహం(లింగం) తమిళనాడులోని చిదంబరంతో పాటు మంథనిలోనే ఉంది. దాదాపు 900 ఏళ్లుగా ఆలయానికి ధ్వజ స్తంభం లేదని పూర్వీకులు చెబుతున్నారు. నిత్యం అభిషేకాలతో పాటు ప్రతి సోమవారం, శనివారం, నెలలో వచ్చే రెండు ఏకాదశులు, మాస శివరాత్రి, మహా శివరాత్రి సమయాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. భక్తులే స్వయంగా గర్భాలయంలోకి వెళ్లి స్వామివారిని స్పృశించి అభిషేకాలు చేసుకోవచ్చు.

# నిర్లక్ష్యం కాల్చేస్తోంది..!



చౌటుప్పల్ : యాదాద్రి జిల్లాలోని పరిశ్రమల్లో జరుగుతున్న వరుస ప్రమాదాలు కలకలం సృష్టిస్తున్నాయి. దీంతో రసాయన, ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలు గాలిలో దీపాలవుతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1800 వరకు పరిశ్రమలు ఉన్నట్లు కర్మాగారాలశాఖ అధికారులు చెబుతున్నారు. వీటిలో చాలా పరిశ్రమల యాజమాన్యాలు కనీస ప్రమాణాలను పాటించడం లేదు. వరుసగా ప్రమాదాలు జరుగుతున్నా నిర్లక్ష్య ధోరణి వీడటం లేదు.

**ఎస్ఆర్ పరిశ్రమను సందర్శించిన అధికారులు**

ప్రమాదం జరిగిన జైకేసారంలోని ఎస్ఆర్ ల్యాబ్ రసాయన పరిశ్రమను ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ జంగయ్య ఆదివారం సందర్శించారు. దగ్ధమైన ప్రొడక్షన్ బ్లాక్‌ను పరిశీలించి ప్రమాదానికి కారణాలను తెలుసుకున్నారు. జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి మధుసూదన్‌రావు కూడా పరిశ్రమను సందర్శించారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు చౌటుప్పల్, రామన్నపేటలోని అగ్నిమాపకశాఖ శకటాలతోపాటు దివిస్ పరిశ్రమ నుంచి మరో వాహనాన్ని రప్పించారు. పూర్తిగా మంటలను ఆర్పివేసేందుకు అర్ధరాత్రి వరకు శ్రమించారు. విద్యుదాఘాతంతోనా లేదా రియాక్టర్ వద్ద లీకేజీతో ప్రమాదం జరిగిందా అనేది తెలియాల్సి ఉంది. మంటలు సాల్వెంటు డ్రమ్ములకు అంటుకోవడంతో పెద్ద ఎత్తున వ్యాపించాయి. అవి కూడా ఎగిరిపడటంతో చెట్లు, రైతుల పొలాలు మాడిపోయాయి.

**నైపుణ్యంలేని కార్మికులతో..**

చాలా పరిశ్రమల్లో ప్రమాదాలకు మానవతప్పిదాలే కారణం అవుతున్నాయి. నైపుణ్యం లేని కార్మికులను రియాక్టర్ల వద్ద పని చేయిస్తుండటంతో కనీస అవగాహన లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటి వద్ద తరచూ లీకేజీలు తలెత్తి విషవాయువులు విడుదలై ఉష్ణోగ్రత పెరిగినప్పుడు రియాక్టర్లు పేలి భారీ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఆ సమయంలో ఏం చేయాలో కూడా వారికి తెలియడం లేదు. చనిపోయిన కార్మికులకు పరిహారం చెల్లించి యాజమాన్యాలు చేతులు దులుపుకొంటున్నాయి.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో రసాయన, ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమలు 100 వరకు ఉన్నాయి. చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, భువనగిరి, బొమ్మలరామారం, చిట్యాల, మేళ్లచెర్వు ప్రాంతాల్లో అధికంగా రసాయన పరిశ్రమలున్నాయి. ఒక్కో పరిశ్రమలో నాలుగైదుసార్లు ప్రమాదాలు జరిగిన ఘటనలుండటం గమనార్హం. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులకు, సంబంధిత అధికారులకు సమాచారాన్ని కూడా ఇవ్వడం లేదు. పలు రసాయన పరిశ్రమలు ప్రజలను కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమల్లో అయితే ప్రమాద తీవ్రత మరింత భయానకరంగా ఉంటుంది.

**మూడు పరిశ్రమల్లో లోపాలను గుర్తించాం: మధుసూదన్‌రావు, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి**

కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశ్రమశాఖ అధికారులతో కలిసి చౌటుప్పల్ మండలంలోని ఏడు పరిశ్రమలను తనిఖీలు చేశాం. నాలుగింట్లో అగ్నిమాపక నివారణ చర్యలున్నాయి. మూడింటిలో పూర్తి స్థాయిలో లేకపోవటంతో నోటీసులు అందజేశాం. ప్రతి పరిశ్రమ తప్పకుండా నిబంధనలను, భద్రతా చర్యలను పాటించాలి.

## చకచకా విద్యుత్తు పనులు

ధర్మపురి : ధర్మపురి పురపాలికలో దశాబ్దాలుగా పలు విద్యుత్తు సమస్యలు నెలకొనగా వీటిని పరిష్కరించేలా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇటీవల ధర్మపురి పట్టణానికి చెందిన వివిధ రకాల విద్యుత్తు తీగలు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్తు స్తంభాలు ఇతరత్రా అంశాలపై మంత్రి లక్ష్మణ్‌కుమార్ విద్యుత్తుశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. రూ. 1.16 కోట్ల నిధులతో పనులు చేపట్టేందుకు పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా ప్రతిపాదించగా నిధులు మంజూరయ్యాయి. ఆయా పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

**ప్రధాన వీధుల్లో త్రీఫేజ్**

పురాతన విద్యుత్తు తీగలు, తరచూ కోతుల బెడద వెరసి విద్యుత్తు సరఫరాలో పలు సమస్యలు నెలకొంటున్నాయి. క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు దీనిపై సర్వే చేపట్టారు. ప్రస్తుతం 15 స్తంభాలను ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారుల పక్కన వేలాడే విద్యుత్తు తీగలను తొలగించి నూతన తీగలను ఏర్పాటు చేశారు. చిన్న వీధుల్లో త్రీఫేజ్ విద్యుత్తు కనెక్షన్లను కేటాయించారు. ఆయా పనులు వేగంగా కొనసాగుతుండగా.. ప్రధాన వీధుల్లో త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా అవుతోంది.



**పరిష్కరించే దిశగా చర్యలు**

శివారు కాలనీల్లో ఇంకా విద్యుత్తు లోవోల్టేజీ సమస్యలు నెలకొని ఉండగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలో నిర్మాణంలోని అదనపు విద్యుత్తు సబ్ స్టేషన్ పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయి. 8 మీటర్ల విద్యుత్తు స్తంభాలు 111, తొమ్మిది మీటర్ల స్తంభాలు 500 మంజూరు చేశారు. ధర్మపురి నుంచి కమలాపూర్‌కి వెళ్లే మార్గంలో రహదారి పక్కన విద్యుత్తు త్రీఫేజ్ లైన్లు ఏర్పాటు చేశారు. 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణం దాదాపుగా పూర్తయింది.

**అభివృద్ధి దశలో ఉన్నాయి** ధర్మపురి పట్టణంలో మెరుగైన విద్యుత్తు సేవలకు ప్రభుత్వానికి రూ. 1.16 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరవగా ఆయా పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దీంతో పట్టణంలో నాణ్యమైన విద్యుత్తు సరఫరాతో సమస్యలు తొలగిపోనున్నాయి. - రవి, ఏఈ, ధర్మపురి

## పత్తిపాకకు మోక్షం

పెద్దపల్లి : జిల్లాలో ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణకు పదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన పత్తిపాక జలాశయం నిర్మాణానికి ఎట్టకేలకు కార్యాచరణ మొదలైంది. ఉమ్మడి జిల్లాలో 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ఉద్దేశించిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి జలాశయం(పత్తిపాక) డీపీఆర్(ప్రాజెక్టు నిర్మిత ప్రాంతం నైసర్గిక స్వరూపం, సర్వే నివేదిక) కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 1.10 కోట్లు విడుదల చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ప్రతిపాదించిన ఈ జలాశయం నిర్మాణం జరిగితే పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురితో పాటు చొప్పదండి నియోజకవర్గాల రైతులకు ప్రయోజనం కలుగుతుంది. అయితే ఇన్నాళ్లు కాగితాలకే పరిమితమైన ఈ ప్రాజెక్టు కోసం రైతుల ఎదురుచూపులు త్వరలో ఫలించనున్నాయి.

**ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోత..**

పత్తిపాక జలాశయం ప్రతిపాదిత స్థలం మూడువైపులా గుట్టలతో ప్రాజెక్టు నిర్మాణానికి అత్యంత అనుకూలమైందని నీటిపారుదలశాఖ అధికారులు గతంలో గుర్తించారు. 3 నుంచి 5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని పంపిస్తారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం 400 ఎకరాల అటవీభూమి, 1,300 ఎకరాల రెవెన్యూ భూమి సేకరించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టులోకి ఆరు లింకుల ద్వారా నీటిని పంపిస్తారు. ఇందు కోసం మేడారం జలాశయం నుంచి దేవికొండ వరకు ఇదివరకే లిఫ్ట్ పనులు జరిగాయి. దేవికొండ నుంచి పత్తిపాక జలాశయానికి లిఫ్టు ద్వారా, గ్రావిటీ కాలువ ద్వారా రెండు విధాలా నీటిని పంపించేందుకు ప్రతిపాదనలు చేశారు. ఈ ప్రాజెక్టు నీటిని నేరుగా కాకతీయ కాలువలోకి పంపించి రేవెల్లి సమీపంలో హెడ్ రెగ్యులేటర్ ద్వారా డి-83, నుంచి డి-94 కాలువల వరకు నీరందిస్తారు.

**చివరి ఆయకట్టుకు తొలగనున్న కష్టాలు**

కొన్నేళ్లుగా జిల్లాలోని ఎస్సారెస్పీ కాలువ చివరి భూములకు నీరందక రైతులు ఇబ్బందులు పడటం, నీటి కోసం ఆందోళనలు చేయడం పరిపాటిగా మారింది. జిల్లాలో ప్రధానమైన డి-83, డి-86 కాలువల ద్వారా పంట పొలాలకు సాగు నీరు చేరుతుంది. డి-83 ద్వారా పెద్దపల్లి, ధర్మారం, రామగుండం, మంథని, అంతర్గాం, పాలకుర్తి, కమాన్‌పూర్, ముత్తారం, రామగిరి, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు డి-86 ద్వారా సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు సాగునీరు అందుతుంది. చొప్పదండి, ధర్మపురి నియోజకవర్గాలలో మరో 10 వేల ఎకరాలకు అదనంగా సాగు నీరందుతుంది.

## విశిష్టతల సమాహారం.. వెయ్యేళ్ల వైభవం

మంథని పశ్చిమాభిముఖ ఆలయం.. ధ్వజ స్తంభం లేని మందిరం.. హనుమంతుడు ద్వార పాలకుడిగా ఉన్న క్షేత్రం.. ఇలా ఎన్నో విశిష్టతల సమాహారంగా విరాజిల్లుతోంది మంథనిలోని శ్రీ భిక్షేశ్వరాలయం.. పూర్వం మంత్రపురిగా పిలిచిన మంథనిలో కాకతీయుల కాలంలో నిర్మించిన అయిదు శివాలయాల్లో ఈ దేవస్థానం ఒకటి. దాదాపు వెయ్యేళ్ల కిందట ప్రతాపరుద్రుడి పాలనలో ఆలయాన్ని నిర్మించినట్లు ఆధారాలున్నాయి. శ్రీ భిక్షేశ్వరాలయంలో గణపతి, అయిదు పడగల నాగదేవత, నందీశ్వరుడి విగ్రహాలున్నాయి. పానవట్టం లేకుండా దక్షిణామూర్తి(లింగం), తపస్సు చేస్తున్న రూపంలో అన్నపూర్ణాదేవి, పశ్చిమాభిముఖంగా శ్రీ భిక్షేశ్వరుడు(శివుడు) దర్శనమిస్తారు. పశ్చిమాభిముఖంతో ఉన్న శివాలయాలు ఖజూరాలోని ఖండలీయ మహాదేవ, నేపాల్‌లోని ఖాట్మండ్‌లోని పశుపతినాథ్ ఆలయాలతో పాటు తెలంగాణలో మంథనిలో మాత్రమే ఉన్నాయి. గర్భగుడిలోని లింగం(శ్రీ భిక్షేశ్వరుడు)పై బ్రహ్మసూత్రం కనిపిస్తుంది. ఆలయాన్ని స్థానికులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి, విదేశాల భక్తులు దర్శించుకుంటారు. దక్షిణామూర్తి విగ్రహం(లింగం) తమిళనాడులోని చిదంబరంతో పాటు మంథనిలోనే ఉంది. దాదాపు 900 ఏళ్లుగా ఆలయానికి ధ్వజ స్తంభం లేదని పూర్వీకులు చెబుతున్నారు. నిత్యం అభిషేకాలతో పాటు ప్రతి సోమవారం, శనివారం, నెలలో వచ్చే రెండు ఏకాదశులు, మాస శివరాత్రి, మహా శివరాత్రి సమయాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. భక్తులే స్వయంగా గర్భాలయంలోకి వెళ్లి స్వామివారిని స్పృశించి అభిషేకాలు చేసుకోవచ్చు.

# రూ.15కోట్లు వెచ్చించినా నిరుపయోగమే!



సిరిసిల్ల : జిల్లా కేంద్రమైన సిరిసిల్ల పట్టణ ప్రజల ఆహ్లాదం కోసం రూ. 15 కోట్ల వ్యయంతో సుందరీకరణ పనులు చేపట్టిన కొత్త చెరువు కట్ట (మినీ ట్యాంక్‌బండ్) ప్రస్తుతం సమస్యలకు నిలయంగా మారింది. నిర్వహణ కొరవడి క్షేత్ర స్థాయి పరిస్థితి అధ్వానంగా మారడంతో సందర్శకులు అటువైపు వెళ్లాంటేనే భయపడుతున్నారు.

**ఇదీ పరిస్థితి**

గతంలో ఈ ప్రాంతం విద్యుత్తు దీపాల వెలుగుల్లో జిగేల్‌మనగా.. పట్టణ ప్రజలు పిల్లాపాపలతో సేదతీరేందుకు వచ్చేవారు. వేసవికాలంలో చెరువు కట్టపై ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని విద్యుత్తు తీగలు కాలిపోయాయి. కొంతవరకు మరమ్మతులు చేసినా రాత్రి సమయాల్లో పలుచోట్ల అంధకారం నెలకొంటోంది. కట్టపై చూపరులను ఆకట్టుకునేలా సిరిసిల్ల - కరీంనగర్ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న కట్టపై వివిధ ఆకృతులను ఏర్పాటు చేశారు. నిర్వహణ లేక పిచ్చిమొక్కల మధ్య అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పాదచారులు వెళ్లేవైపు పాముల పుట్టలు ఏర్పడ్డాయని సందర్శకులు చెబుతున్నారు. గతంలో ఏర్పాటు చేసిన కొత్త చెరువు ట్యాంక్‌బండ్ ముఖద్వారం ఈదురుగాలులకు కిందపడిపోయింది. రెండో గేటు ఇటీవల ఊడి కిందపడినా సరి చేయలేదు. గతంలో చెరువులో గుర్రపుడెక్క పెరిగితే నెలపాటు కృషి చేసి యంత్రం సాయంతో తొలగించారు. మళ్లీ ఇప్పుడు గుర్రపుడెక్క పెరగడంతో నీటి శాతం తగ్గుతుందని స్థానికులు చెబుతున్నారు. చెరువులో సందర్శకుల షికారు కోసం రెండు పడవలు ఏర్పాటు చేశారు. పడవలను నడిపించేందుకు ఇద్దరు పురపాలిక సిబ్బందిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శిక్షణ నిమిత్తం పంపించారు. వారు శిక్షణ పూర్తి చేసుకొని వచ్చినా పడవలను చెరువులోనే వదిలేయడంతో మరమ్మతులకు గురయ్యాయి. చెరువు కట్టపై పచ్చదనం చూపించేందుకు వీలుగా ఎలక్ట్రానిక్ రైలు ఏర్పాటు చేసి కొంతకాలం నడిపించారు. పిల్లలకు రూ. 10, పెద్దలకు రూ. 20 చొప్పున టికెట్ ధర నిర్ణయించి వారానికి మూడు రోజులు నడిపించారు. నిర్వహణ కొరవడటంతో ఆ రైలు ప్రస్తుతం మూలకు చేరింది. మరమ్మతుకు రూ. 1.50 లక్షలు అవుతుందని చెబుతున్నారు. మినీ ట్యాంక్‌బండ్‌పై నెలకొన్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకొని అందుబాటులోకి తేవాలని సందర్శకులు కోరుతున్నారు.

# ఎన్నాళ్లకెన్నేళ్లకు..!



వేములవాడ: వేములవాడ పట్టణ శివారులో మల్లారం రోడ్డులోని లోలెవల్ వంతెనతో అష్టకష్టాలు పడిన ప్రజలకు హైలెవల్ వంతెన నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. ఈ వంతెన స్థానికుల ఏళ్లనాటి కల కావడంతో మూడేళ్ల క్రితం ప్రభుత్వం రూ. 2.5 కోట్ల నిధులు మంజూరు చేసింది. నిర్మాణ పనులకు భూమి పూజ చేసినప్పటికీ గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో పనులు భూమిపూజకే పరిమితమయ్యాయి. సమస్యపై వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. సమస్యను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి పనులు మొదలు కావడానికి చొరవ చూపారు. దీంతో అయిదు నెలల క్రితం వంతెన నిర్మాణ పనులను అర్అండ్అబీ అధికారులు చేపట్టగా నిర్మాణం పూర్తయింది. వంతెనకు ఇరువైపులా మట్టితో అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేసి వాహనాల రాకపోకలకు అనుమతించారు.

**ఈ వానాకాలం సజావుగా రాకపోకలు**

పట్టణ శివారులోని మల్లారం రోడ్డులోని కట్టుకాలువ చూడటానికి చిన్నదిగానే ఉన్నప్పటికి వర్షాకాలంలో భారీ ఎత్తున వరద పారుతుంది. ఇలాంటి సందర్భంలో వాహనాల రాకపోకలు నిలిచిపోతాయి. కల్వర్టు అవతలి వైపు ఉన్న జయవరం, రాజ్‌నగర్, మల్లారం, హన్మాజీపేట, బొల్లారం, లింగంపల్లి, గ్రామాలతోపాటు కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి, నిజామాబాద్ జిల్లా సిరికొండ వరకు వెళ్లే గ్రామాల ప్రజలతోపాటు చందుర్తి మండలంలోని ఎన్గల్, బండపల్లి వైపు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడేవారు. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల మీదుగా వేములవాడ, సిరిసిల్ల పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఎట్టకేలకు వంతెన పూర్తవడం, ఈ వర్షాకాలంలో వాగు పారినప్పటికీ రాకపోకలు సజావుగా సాగడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

**చివరి దశలో సైడ్‌వాల్ పనులు..**

వంతెన నిర్మాణం పూర్తయినప్పటికీ ఇంకా వంతెన సైడ్‌వాల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో వాహనాల రాకపోకలకు అనుమతించారు. వంతెనకు సైడ్ వాల్ నిర్మాణం పూర్తయితే అప్రోచ్ రోడ్డుపై తారు పనులు చేపట్టనున్నారు. దీంతో ప్రజల రాకపోకల కష్టాలు పూర్తిగా తొలిగిపోనున్నాయి.

## ఉన్నత విద్యపై నిశిత దృష్టి

మెట్‌పల్లి : ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారుగా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 3 వేలమంది, రెండో సంవత్సరం 2500 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ఉత్తమ విద్యనందించేందుకు ప్రతి కళాశాలకు 13 సీసీ కెమెరాలతోపాటు ఒక కంప్యూటర్‌ను ఏర్పాటు చేశారు. తరగతి గదులతోపాటు ప్రిన్సిపల్ కార్యాలయంలో, కళాశాల ఆవరణలో తదితర చోట్ల వాటిని బిగించారు. ప్రిన్సిపల్ గదిలో ఏర్పాటుచేసిన కంప్యూటర్‌కు సీసీ కెమెరాలను అనుసంధానం చేశారు. ఎప్పటికప్పుడు వీటి పర్యవేక్షణకు ప్రత్యేక కార్యచరణ రూపొందించారు.

**మెట్‌పల్లిలో 16 కెమెరాల పర్యవేక్షణలో**

మెట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి సుమారు 563 మంది విద్యార్థులున్నారు. వీరికి సీసీ కెమెరాల నడుమ ఉత్తమ బోధన అందిస్తున్నారు. 13



కొత్తవి కాగా పాతవి మూడింటితో మొత్తం 16 కెమెరాలను బిగించారు.

**ప్రతి కళాశాలపై ప్రత్యేక దృష్టి**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధనపై ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు సీసీ కెమెరాలను హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో చూసేలా ఏర్పాటు చేశారు. ప్రతి తరగతి గదిలో విద్యార్థుల సంఖ్య తక్కువ లేకుండా చూడటం.. బోధన, అధ్యాపకుల పనితీరు తదితర అంశాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఉండనుంది. ఏడాదిపాటు ఓ సంస్థకు సీసీ కెమెరాల బాధ్యతలను అప్పగించారు.

**ఉత్తమ ఫలితాల కోసమే..** విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించి, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసింది. గత 20 రోజుల క్రితం జిల్లాలోని 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమెరాలను బిగించి ప్రస్తుతం వాటి పర్యవేక్షణలోనే కళాశాలలు కొనసాగుతున్నాయి. విద్యార్థులతోపాటు అధ్యాపకులపై హైదరాబాద్‌లోని ఉన్నతాధికారుల ప్రత్యేక పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉంటుంది. – నారాయణ, ఇంటర్ విద్యా జిల్లా నోడల్ అధికారి

## ఆకట్టుకునే రంగు.. శుభ్రత కరవు

వేములవాడ: వర్షాకాలం వచ్చిందంటే వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి కాలంలో హోటళ్లు, రెస్టారెంట్లు, తినుబండారాల తయారీలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి వాటిని ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహార పదార్థాలు ప్రజలకు అందేలా చూడాల్సిన అధికార యంత్రాంగం నామమాత్రపు తనిఖీలతో చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేములవాడ పట్టణంలో మున్సిపల్ రికార్డుల ప్రకారం 4 బార్ అండ్ రెస్టారెంట్లు, 7 హోటళ్లు, 31 టిఫిన్ సెంటర్లున్నట్లు రికార్డులు చెబుతున్నప్పటికీ అనధికారికంగా అనేకం కొనసాగుతున్నాయి. తినుబండారాల దుకాణాలూ ఎక్కువగానే ఉన్నాయి. వీటిలో ఆహార భద్రత నియమ, నిబంధనలు గాలికొదిలేసి పదార్థాలను తయారు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పట్టణంలోని ఓ హోటల్‌లో ఇటీవల ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలో పెద్దఎత్తున కుళ్లిన మాంసం, ఆహార పదార్థాలు, బిర్యానీ వంటి వెలుగు చూడటం కలకలం రేపింది. ఈ సంఘటన పట్టణంలోని హోటళ్లలోని పరిస్థితికి అద్దం పట్టింది.

**అపరిశుభ్ర వాతావరణంలో..**

వేములవాడ ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో ఇక్కడికి రాష్ట్రంలోని భక్తులు, ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు



వస్తుంటారు. ఇలాంటి వారు భోజనాలను, టిఫిన్స్‌ను పట్టణంలోని వివిధ రెస్టారెంట్లు, హోటళ్లలో, టిఫిన్ సెంటర్లలో ఆహార పదార్థాలను వినియోగిస్తుంటారు. ఇలాంటి పట్టణంలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహార పదార్థాలను ప్రజలకు, భక్తులకు అందించే విధంగా చర్యలు చేపట్టాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఆకర్షణీయ రంగులతో, శుచి శుభ్రత లేని ఆహార పదార్థాలను ప్రజలకు అంటగట్టి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనే విమర్శలున్నాయి.

రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో వంటకాలు అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేస్తున్నారు. వంట గదులు దుర్వాసన, కుళ్లిన వ్యర్థాలతో అపరిశుభ్రంగా ఉన్నప్పటికీ అందులోనే ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. శుభ్రమైన నీటితో, ఏ రోజుకు సరిపడా ఆరోజు మాంసం వండాల్సి ఉండగా చాలా హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో వాటిని రిఫ్రిజిరేటర్లలో నిల్వ చేస్తూ చాలా రోజుల తరబడి వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఎప్పుడో ఓసారి తనిఖీలు చేసి నామమాత్రం జరిమానాలు వేసి వదిలేయడంతో తిరిగి యథావిధిగా కొనసాగుతున్నాయి.

'వేములవాడ, సిరిసిల్ల పట్టణాల్లో రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహిస్తున్నాం. నిబంధనలు పాటించని హోటళ్లను తనిఖీ చేసి దాదాపు పది కేసుల వరకు నమోదు చేశామ'ని ఆహార భద్రత తనిఖీ జిల్లా అధికారిణి అనూష పేర్కొన్నారు.

# సెజ్‌లో కంకర కింకరులు



రాంబిల్లి : సెజ్ స్థలాల్లో అక్రమ మట్టి తవ్వకాలు జరిగిన ప్రాంతంలో ఏపీఐఐసీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎవరైనా ఆ స్థలాల్లో తవ్వకాలు జరిపితే సమాచారం ఇవ్వాలని ఆ బోర్డుపై ఏపీఐఐసీ జెడ్‌ఎం, డీజెడ్‌ఎంల చరవాణి నెంబర్లు నమోదు చేశారు. అయినా యథావిధిగా తవ్వకాలు సాగుతూనే ఉన్నాయి.
జాతీయ, అంతర్జాతీయస్థాయి పరిశ్రమలతోపాటు పలు రసాయన, ఫార్మా కంపెనీలు ఏర్పాటైన అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్), నాన్ సెజ్‌లో ఖాళీగా ఉన్న స్థలాల్లో కొందరు అక్రమార్కులు దర్జాగా కంకర, మట్టిని తరలించుకుపోతున్నారు. సెలవు రోజుల్లో, రాత్రివేళ జనసంచారం లేనిచోట ఉన్న స్థలాల్లో యంత్రాలతో ఇష్టమొచ్చినట్లు తవ్వేస్తున్నారు. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో సెజ్ కోసం సుమారు 9,280 ఎకరాలు సేకరించారు. పరిశ్రమల కోసం సెజ్, నాన్ సెజ్‌గా విభజించి అన్ని మౌలిక వసతులతో ఏపీఐఐసీ అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో ఇంకా 230 ఎకరాల వరకు పరిశ్రమలకు కేటాయించని స్థలం ఉంది. ఈ లేఅవుట్‌లో ఎకరా ధర రూ. 1.50 కోట్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇంతటి విలువైన స్థలాల్లో కంకర, మట్టిని అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. కంకర దొంగలు ఈ ఖాళీ స్థలాలను లక్ష్యంగా చేసుకొని తవ్వకాలు చేస్తున్నారు. ఖాళీ స్థలాల్లో కొన్నిచోట్ల ఏపుగా కంచె చెట్లు పెరిగిపోవడంతో రహదారులపై వెళ్లేవారికి కంకర తరలించే వాహనాలు కనిపించని పరిస్థితి ఉంది. దీంతో అవకాశం కుదిరినప్పుడల్లా తవ్వేస్తున్నారు. అయిదు రోజుల క్రితం దీనిపై సమాచారం అందడంతో స్థానిక పోలీసులు రెండు టిప్పర్లను పట్టుకున్నారు. కంకర, మట్టి తవ్వకాలపై పోలీసులు, ఏపీఐఐసీ అధికారులు నిఘా ఉంచినట్లు ప్రకటిస్తున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.
**నిఘా ఉంచాం :** సెజ్, నాన్ సెజ్ ఖాళీ స్థలాల్లో గతంలో తవ్విన గుంతలే ఉన్నాయి. భద్రతా సిబ్బందితో నిరంతరం నిఘా కొనసాగుతోంది. మట్టి, కంకర అక్రమంగా తవ్వి తరలించేవారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటాం. గతంలో మట్టి తవ్విన ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. సెజ్‌లో ప్రస్తుతం ఎక్కడా ఎటువంటి తవ్వకాలు జరగడం లేదు.
– కె.సూర్యనారాయణ, ఏపీఐఐసీ, డీజడ్‌ఎం

# నాడి పట్టి.. నడక నేర్పి

కర్నూలు :ఓర్వకల్లు మండలం పూడిచెర్లకు చెందిన నాగమ్మ (72)కు గత నెల 22న కాలు.. చేయి పడిపోయింది. కుటుంబసభ్యులు వెంటనే సర్వజన వైద్యశాలలోని న్యూరో ఐసీయూలో చేర్పించారు. వైద్యులు పరీక్షలు చేసి వారం పాటు చికిత్స అందించారు. ఆరోగ్యం కొంతమేర కుదుటపడింది. దీంతో ఆమెను జనరల్ వార్డుకు మార్చారు. మరో రెండు మూడు రోజుల్లో డిశ్చార్జి చేయనున్నారు. ఆరోగ్యశ్రీ కింద ఆమెకు వైద్యం చేశారు.
నేటి ఆధునిక సమాజంలో వ్యాధులు చుట్టుముడుతున్నాయి. పలువురు పక్షవాతం బారిన పడుతున్నారు. నరాల సమస్య, స్పాండిలోసిస్, సయాటిక తదితర వాటితో బాధపడేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాలంటే రూ.లక్షలు వెచ్చించాల్సిందే. కర్నూలు సర్వజన వైద్యశాలలో ఇలాంటి బాధితులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఐసీయూలో ఉంచి రోగులకు సేవలందిస్తున్నారు.
న్యూరో ఫిజీషియన్ విభాగంలో ప్రతి సోమ, గురువారాలు ఓపీ ఉంటుంది. మిగతా రోజుల్లో అత్యవసరమైనవారికి వార్డు వద్ద ఓపీ సేవలు అందిస్తారు. కాలు.. చేయి పడిపోయినవారికి అత్యవసర విభాగంలో ప్రాథమిక చికిత్స చేసి న్యూరో ఫిజీషియన్ విభాగంలోని ఐసీయూలో వైద్య సేవలందిస్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచేకాక వివిధ ప్రాంతాల నుంచి ప్రతి నెలా 1,500 నుంచి 2 వేల వరకు ఓపీ ఉంటుంది. ఐసీయూతోపాటు వార్డుల్లో ప్రతి నెలా 150 మంది రోగులకు చికిత్స అందిస్తుంటారు. ఆరోగ్యశ్రీ ఉన్నా.. లేకున్నా కార్పొరేట్ సేవలు అందిస్తున్నారు.
**పది పడకలతో ప్రత్యేక వార్డు**
వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు న్యూరో ఫిజీషియన్ విభాగానికి నిత్యం వస్తుంటారు. రెండేళ్ల కిందటి వరకు ఈ విభాగానికి ప్రత్యేకంగా న్యూరో ఐసీయూ (స్ట్రోక్ యూనిట్) అందుబాటులో ఉండేది కాదు. జనరల్ మెడిసిన్ విభాగం వైద్యులు రోగులను ఏఎంసీలో చేర్చుకొని చికిత్స అందించేవారు.
ప్రస్తుతం 10 పడకలతో ప్రత్యేకంగా న్యూరో ఐసీయూ (స్ట్రోక్ యూనిట్) ఏర్పాటు చేశారు. ఫలితంగా బాధితులకు సాంత్వన లభించింది. రక్తపోటు ఎక్కువై కాలు.. చేయి పడిపోయినవారు.. పక్షవాతంతో బాధపడేవారు, మెదడులో కణితులు ఉన్నవారికి న్యూరో ఐసీయూ విభాగంలో వైద్యం అందిస్తున్నారు. ఉత్తమ సేవలు అందుతుండటంతో ఇక్కడ చికిత్స పొందుతున్నవారి సంఖ్య గణనీయంగా పెరిగింది.
ఉత్తమ సేవలందిస్తున్నాం న్యూరో ఫిజీషియన్ విభాగంలో ఐసీయూ (స్ట్రోక్ యూనిట్) పెట్టిన తర్వాత చికిత్స పొందేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా వైద్యసేవలు అందిస్తున్నాం. డీఎం విద్యార్థులు అందుబాటులో ఉండటంతో రోగులకు 24 గంటలపాటు ఉత్తమ సేవలు వైద్యం అందిస్తున్నాం.
డా.శ్రీనివాసులు, న్యూరో ఫిజీషియన్ విభాగాధిపతి

# ఎర్రమట్టి.. కొల్లగొట్టి

కుందుర్పి: కుందుర్పి మండలంలో పలుచోట్ల సహజసిద్ధంగా ఏర్పడిన ఎర్రమట్టి కొండలను కొందరు ఆదాయార్జనే ధ్యేయంగా పొక్లెయిన్లు, జేసీబీ యంత్రాల సాయంతో కొల్లగొడుతున్నారు. ఈ మట్టిని ఎక్కువగా నూతన గృహ నిర్మాణాల్లో బేస్‌మట్టం, పూడికకు వినియోగిస్తుంటారు. వాణిజ్య పంటలు సాగుచేసే రైతులు సైతం భూమిలో సత్తువకు ఈ మట్టిని వాడుతుండటంతో అధిక డిమాండు ఏర్పడింది. ఈ నేపథ్యంలో అక్రమార్కులు ఎర్రమట్టిని యథేచ్ఛగా తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.
**రాత్రిళ్లు కొనసాగుతున్న తవ్వకాలు**మహంతపురం- బెస్తరపల్లి గ్రామాల మధ్య ఉన్న మట్టికొండను నిత్యం వేకువజాము నుంచి ఉదయం 10 గంటల వరకు జేసీబీ సాయంతో తవ్వించి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో బెస్తరపల్లి సమీపం నుంచి కర్ణాటకకు కూడా దీనిని రవాణా చేస్తున్నట్లు ఆ ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కుందుర్పి



నుంచి అపిలేపల్లికి వెళ్లే పూలదిబ్బను(ఎర్రమట్టి దిబ్బ) గతంలో అక్రమార్కులు అనేకచోట్ల తవ్వించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధాన దారికి ఆనుకుని ఉన్న ఈ మట్టిదిబ్బల తవ్వకాన్ని అధికారులు గుర్తించి నిలిపివేయడంతో అక్రమార్కులు వారి పంథా మార్చుకున్నారు. రాత్రుళు గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు చేస్తున్నారు. కుందుర్పి నుంచి బొమ్మాజిపల్లికి వెళ్లే దారి పక్కనున్న నిమ్మాజిగుట్ట రాతిబండ వరకూ మట్టిని ఇప్పటికే తవ్వేశారు.
**సిబ్బందితో నిఘా పెడతాం :** తిప్పేస్వామి ఉప తహసీల్దార్, కుందుర్పి కొండల్లోని ఎర్రమట్టి అక్రమ తవ్వకాల నివారణకు రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తాం. అక్రమంగా తవ్వకం దారులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

# రద్దీ రహదారులకు మహర్దశ

సూళ్లూరుపేట : జిల్లాలోని రహదారులు, భవనాల శాఖ పరిధిలోని రోడ్లకు మంచి రోజులొచ్చాయి. గతంలో జిల్లాలో బాగా రద్దీగా ఉండి రాకపోకలు అధిక సంఖ్యలో సాగే రహదారులను గుర్తించి, ఎన్‌డీబీ కింద ఆధునికీకరించాలని తలచారు. ఆ మేరకు నిధులు సైతం మంజూరయ్యాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వడంలో జాప్యం చేయడంతో గుత్తేదారులు ముందుకు రాలేదు. పనులు ప్రారంభానికి నోచుకోలేదు. రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం వాటిని రద్దుచేసి తాజాగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) విధానంలో చేపట్టాలని నిర్ణయించింది.**హ్యామ్ అంటే?..** జిల్లాలో ఇప్పటి వరకు ఈ విధానంతో ఎక్కడా రహదారుల పనులు చేయలేదు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(హ్యామ్) విధానంలో రహదారుల నిర్మాణాల నిధుల్లో ప్రభుత్వం ముందుగా 40 శాతం భరిస్తుంది. మిగతా 60 శాతం నిధులను బ్యాంకు రుణం ద్వారా గుత్తేదారునికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటుంది. ఈ మొత్తం నిధులతో గుత్తేదారు రహదారులను బాగు చేస్తారు. రుణాన్ని ప్రభుత్వం 15 ఏళ్లలో తిరిగి చెల్లిస్తుంది. గుత్తేదారు 15 ఏళ్ల పాటు రహదారుల నిర్వహణ పనులు చేయాల్సి ఉంటుంది. ఈ విధానంలో జిల్లాలోని సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో కొన్ని రహదారులను ఎంపిక చేశారు.
**రహదారులను పరిశీలిస్తే..** సూళ్లూరుపేట–శ్రీకాళహస్తి రహదారి పెరిమిటిపాడు వరకు రెండు వరుసలుగా ఉంది. అక్కడి నుంచి బుచ్చినాయుడుకండ్రిగ వరకు విస్తరించేందుకు 2018లో ఎన్‌డీబీ నిధులు మంజూరు చేశారు. 2019లో టెండర్లు నిర్వహించగా చిత్తూరుకు చెందిన పీఎల్‌ఆర్ సంస్థ టెండరు దక్కించుకుంది. వైకాపా ప్రభుత్వంలో మంత్రులు శిలాఫలకం వేయగా అక్కడక్కడ కల్వర్టు పనులు చేసినా విస్తరణ పనులు ప్రారంభించలేదు. కూటమి ప్రభుత్వం వాటిని రద్దుచేసి నూతన విధానంతో బాగు చేయాలని నిర్ణయించింది.

# ఘాట్‌లకు పుష్కర శోభ..!



రాజమహేంద్రవరం : రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి కూటమి ప్రభుత్వం ఆయా శాఖల నుంచి ప్రతిపాదనలు తీసుకుంటోంది. పుష్కరాలకు ప్రధానమైనవి ఘాట్‌లు. అఖండ గోదావరి మొదలుకుని దిగువన ఉన్న వశిష్ఠ, వైనతేయ, గౌతమి, పోలవరం ఐలాండ్ ప్రాజెక్టు ఏటిగట్ల వెంబడి నదీపాయల చెంతన కొత్తగా ఘాట్‌లు నిర్మిస్తారు. పాత వాటికి మరమ్మతులు చేయటంతోపాటు అఖండ గోదావరి ఎడమ ఏటిగట్టును రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేసేందుకు గోదావరి హెడ్‌వర్క్స్ డివిజన్ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. మొత్తం రూ.620.97 కోట్లతో ఆయా అభివృద్ధి పనులు చేసేందుకు నియోజకవర్గాలు, మండలాలవారీగా పనులను గుర్తించారు.
**కొత్తగా 97 ఏర్పాటు..**
ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల పరిధిలోని 16 నియోజకవర్గాలకు సంబంధించి 34 మండలాల్లో కొత్తగా 97 ఘాట్‌ల నిర్మాణం, 250 ఘాట్‌లకు మరమ్మతులు చేపడతారు. అఖండగోదావరి ఎడమ ఏటిగట్టును కాతేరు నుంచి బొబ్బిల్లంక, కోటిలింగాలఘాట్ నుంచి కాతేరు, బొబ్బిలంక నుంచి సీతానగరం వరకు మొత్తం 18.60 కిలోమీటర్ల పొడవునా రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేసేందుకు రూ.251.70కోట్ల నిధులు అవసరం ఉంటుందని ప్రతిపాదించారు. 97 కొత్తఘాట్‌ల నిర్మాణానికి రూ.91.28కోట్లు, 250 పాత ఘాట్‌ల మరమ్మతులకు రూ.277.99 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు.
**ప్రతిపాదనలు సిద్ధం చేశాం..**
గోదావరి హెడ్‌వర్క్స్ డివిజన్ పరిధిలో కొత్తగా నిర్మించాల్సిన ఘాట్‌లు, ఉన్నవాటికి మరమ్మతులు చేయటంతోపాటు అఖండ గోదావరి ఎడమ ఏటిగట్టును అభివృద్ధి చేసే వంటి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఆయా ఎమ్మెల్యేలు, మంత్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నాం. క్షేత్రస్థాయిలో పరిశీలనచేసి ఆయా పనులకు ప్రాధాన్యతను కల్పించాం. తయారుచేసిన ప్రతిపాదనలు జిల్లాల కలెక్టర్లకు అందజేశాం. గంగుమళ్ల శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ), గోదావరి హెడ్‌వర్క్స్ డివిజన్, ధవళేశ్వరం

# నిధులొచ్చాయ్.. పనులు చేయండి




కాకినాడ : స్థానిక సంస్థలకు ఆర్థిక సంఘ నిధులను కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా విడతల వారీగా మంజూరు చేస్తుంది. గత అయిదేళ్లలో కేంద్రం ఇచ్చిన వాటిని గత వైకాపా ప్రభుత్వం దారి మళ్లించింది. దీంతో పంచాయతీల్లో కనీసం బ్లీచింగ్ చల్లడానికీ సొమ్ములేని దుస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థిక సంఘ నిధులు నేరుగా పంచాయతీల ఖాతాలకే జమయ్యేలా చర్యలు చేపట్టారు. గతేడాది సెప్టెంబరు, నవంబరుల్లో నిధులు రాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి మూడోవిడత సైతం పంచాయతీలు, మండలాలు, జడ్పీలకు జమ అయ్యాయి.
**జడ్పీకి రూ.12 కోట్లు**
జిల్లా పరిషత్‌కు సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సరానికి రెండో త్రైమాసిక నిధులు రూ.12 కోట్లు విడుదల అయ్యాయి. వీటిలో టైడ్ గ్రాంటు కింద రూ.7.25 కోట్లు, బేసిక్ గ్రాంటు కింద రూ.4.84 కోట్లు వచ్చాయి. టైడ్ నిధుల్లో 50 శాతం తాగునీరు, పారిశుద్ధ్యానికి ఖర్చు చేయాలి. బేసిక్ గ్రాంటుతో కార్యాలయాల నిర్వహణ, మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలి. మిగిలిన వాటిని సమగ్ర తాగునీటి పథకాల (సీపీడబ్ల్యూఎస్) నిర్వహణకు వినియోగించాలి.
**మండలాలకు ఇలా..**
జిల్లాలో 21 మండలాలకు బేసిక్ గ్రాంటు రూ.9.40 కోట్లు, టైడ్ గ్రాంటు రూ.14.10 కోట్లు విడుదల అయ్యాయి. వీటిని తాగునీరు, పారిశుద్ధ్యం, కార్యాలయాల నిర్వహణ, ఇతర అభివృద్ధి పనులకు మార్గదర్శకాల మేరకు ఖర్చు చేయనున్నారు.
**పంచాయతీలకు రూ.24.47 కోట్లు**
ఎన్నికలు జరగని వాటికి మినహా మిగతా 375 పంచాయతీలకు రూ.24.47 కోట్లు మంజూరయ్యాయి. వీటితో అనేక పనులు చేపట్టే అవకాశముంది. వాస్తవానికి ప్రస్తుతం ఉన్న పాలకవర్గాల్లో అధిక శాతం వైకాపా ఏలుబడిలోనే ఉన్నాయి. వారు గత ప్రభుత్వంలో ఒక్క పని కూడా చేయలేకపోయారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది.
**సద్వినియోగం చేసుకోండి..**
గ్రామాలు, మండలాలకు ఆర్థిక సంఘ నిధులు విడుదలయ్యాయి. వాటితో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి. నిధుల వినియోగంపై ప్రస్తుతం ఎటువంటి ఆంక్షలు లేవు. మార్గదర్శకాల మేరకు ఖర్చు చేయాలి. వీవీఎస్ లక్ష్మణరావు, జడ్పీ సీఈవో

# మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

రాజానగరం : కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక నెరవేర్చింది. మినీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చుతామని ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు హామీ ఇచ్చాయి. ఈ మేరకు ప్రభుత్వం కేంద్రాల స్థాయిని పెంచుతూ ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీంతో కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో 25 కేంద్రాలకు స్థాయి పెరగనుంది. జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఏడు ఉన్నాయి. వీటి పరిధిలో 25 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు మెయిన్‌గా అప్‌గ్రేడ్ అయ్యాయి.
**ప్రయోజనాలు ఎన్నో** మినీ అంగన్‌వాడీ కేంద్రంలో ఇప్పటివరకు ఒక్క కార్యకర్త మాత్రమే ఉండేవారు. ప్రభుత్వం అప్పగించే సర్వేలు, ఇతర కార్యక్రమాలు నిర్వర్తిస్తూ, కేంద్రానికి వచ్చే పిల్లల ఆలనా..పాలనా, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేత తదితర సేవలు ఆ ఒక్కరే చేయాల్సి వచ్చేది. ఇటువంటి సేవల విషయంలో ఇబ్బందులు తలెత్తేవి. అత్యవసరమైతే తప్ప సెలవులు ఇచ్చే వారు కాదు. ప్రస్తుతం ఈ కేంద్రాల స్థాయి పెరగడంతో కార్యకర్త జీతం రూ.ఏడు వేల నుంచి రూ.11,500లకు పెరగనుంది. అదనంగా ఆయా (సహాయకురాలు) పోస్టు వస్తున్నందున మరొకరికి ఉపాధి అవకాశం లభిస్తుంది. లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించవచ్చు. జి.గౌరి, సీడీపీఓ, రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్

# ఇగ్నోలో ఉపాధి కోర్సులు

మద్దిలపాలెం : ఇందిరా గాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ప్రస్తుత కాలానికి, ఉపాధికి దోహదపడే సరికొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది నుంచి పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇగ్నో కేంద్రం ఏర్పాటు చేశారు. ఆయా కోర్సుల్లో డిగ్రీ, పీజీ ప్రవేశాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు అధ్యయన కేంద్రం సంచాలకులు డాక్టర్ జి.ధర్మారావు తెలిపారు.
పర్యాటక రంగానికి అనుగుణంగా బ్యాచిలర్ ఇన్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ డిగ్రీలో మూడేళ్లు కోర్సు ఆంగ్లం, హిందీ మాధ్యమాల్లో అందుబాటులో ఉంది. ఇంటర్ పూర్తిచేసిన వారు ఎవరైనా అర్హులే. ఆన్‌లైన్‌లో కూడా ఈ కోర్సును అందుబాటులో ఉంచారు.
బీఏ ఒకేషనల్ విభాగంలో డిగ్రీ టూరిజం అండ్ మేనేజ్‌మెంట్, హోమ్ సైన్స్ రంగం(బీఏ)లో మానవ అభివృద్ధి ఫ్యామిలీ స్టడీస్, సామాజిక వనరుల నిర్వహణ, పౌష్టిక ఆహారం, దుస్తుల తయారీ నిర్వహణ




వంటి విభిన్న శాస్త్రాల కలయికతో రూపొందించిన కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చారు. అంకుర సంస్థలు స్థాపించాలనుకునే వారికి ఈ కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయి.
సోషల్ వర్కు విభాగంలో కొత్తగా బ్యాచిలర్ ఆఫ్ సోషల్‌వర్కును ప్రవేశపెట్టారు. వీటితోపాటు ఆన్‌లైన్‌లో ఎం.ఎస్.డబ్ల్యూ, మాస్టర్ ఇన్ సోషల్ వర్కు కోర్సులు ప్రారంభించారు.
వైద్య ఆరోగ్య రంగంలో ఆరు నెలల కాల వ్యవధితో నర్స్ మేనేజర్ కోర్సు, సర్టిఫికెట్ ఇన్ జరియాట్రిక్ హెల్త్ అండ్ కేర్(వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు సంబంధించి) కోర్సు అందుబాటులో ఉంచారు.
జిల్లాలో గాజువాక ఎంవీఆర్, ప్రభుత్వ మహిళ డిగ్రీ, కేజీహెచ్ నర్సింగ్ కళాశాలల్లో, ఆంధ్రా యూనివర్సిటీలో, విశాఖ డెయిరీ పరిశ్రమలోని ఓ కార్యాలయంలో ఇగ్నో కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. ప్రవేశాల కోసం ఈనెల 15 వరకు గడువు పొడిగించారు. ఆసక్తిగల వారు 0891-2511200 నెంబరులో, %www.ignou.ac.in% వెబ్‌సైట్‌ను సందర్శించాలని ధర్మారావు సూచించారు.

# ఆశ చూపి.. ముఖం చాటేసి!

నర్సీపట్నం : ఇంటిగ్రేటెడ్ ఫార్మర్ కోఆపరేటివ్ ఆర్గనైజేషన్ (ఇఫ్కో) పేరిట అనకాపల్లి జిల్లా పెదబొడ్డేపల్లిలో గత ఏడాది డిసెంబర్‌లో ఏర్పాటైన ఓ కార్యాలయం ఏడాది తిరగకముందే బోర్డు తిప్పేసింది. అధిక లాభాలొస్తాయని ఆశ చూపడంతో ముందూ వెనుకా ఆలోచించకుండా పెట్టుబడులు పెట్టిన వారంతా లబోదిబోమంటున్నారు. బియ్యం, పప్పులు, ఇతర నిత్యావసర సరకులను పొదుపు సంఘాల మహిళలకు అరువు ఇచ్చి వారపు వాయిదాలు వసూలు చేసే పద్ధతిలో ఇఫ్కో పేరిట అప్పట్లో వ్యాపారం మొదలుపెట్టారు. తొలుత నర్సీపట్నంలో కొంతమందికి అరువు పద్ధతిలో రూ.వెయ్యి విలువైన సరకులు ఇచ్చారు. వారానికి రూ.250 చొప్పున తిరిగి చెల్లించాలన్నది నిబంధన. ఈ విధానంలో వ్యాపారం చేయడం వల్ల లాభాలు బాగానే వస్తాయని, ఆసక్తి ఉన్నవారు ఎవరైనా పెట్టుబడి పెట్టవచ్చని కార్యాలయ సిబ్బంది ద్వారా ప్రచారం చేయడంతో పది మంది సుమారు రూ.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. వీరందరికీ ప్రతి నెలా రూ.5 వడ్డీ గిట్టుబాటయ్యేలా లాభాలు పంచుతామని ఆశ చూపారు.
రెండు, మూడు నెలలు గడిచినా పెట్టుబడికి అనుగుణంగా లాభాలు పంచకపోవడంతో కొందరు ఇఫ్కో యజమాని పి.శ్రీనివాసరావును నిలదీశారు. శారదానగర్‌కు చెందిన ఓ మహిళ రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టారు. రెండు నెలలైనా లాభం ఇవ్వకపోవడంతో ఒప్పందం నుంచి తప్పుకొంటున్నట్లు చెప్పారు. ఒప్పందం రద్దయిన 45 రోజుల తర్వాత పెట్టుబడి, లాభం సొమ్ము తిరిగిస్తామని నమ్మించారు. ఆ గడువు ముగిసిపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన ఆమె న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించారు.శ్రీనివాసరావు ఆచూకీ లేకపోవడంతో కార్యాలయ నిర్వాహకుడు రెండు నెలల కిందట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెట్టుబడిదారులు ఫోన్ చేస్తే యజమాని ఇదిగో అదిగో అంటున్నారు. ఆయన ఎక్కడ ఉన్నారో కనిపెట్టేందుకు కొందరు ఆరా తీయగా తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌లో డి.మార్ట్ సమీపంలోని రోడ్డు నంబరు 5 బ్యాంకు కాలనీలో కార్యాలయం తెరిచినట్లు తెలిసి పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. సరకులు పొందిన వారికి ఎలాంటి నష్టం లేకపోవడం, పెట్టుబడిదా రులు కొద్దిమందే ఉండటంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. నర్సీపట్నం మండలంలో మోసపోయిన వారిలో ఓ ప్రజాప్రతినిధి భర్త, ఓ సోషల్ మీడియా ప్రతినిధి, పలువురు గృహిణులు ఉన్నారు.

# కబళించి.. ఆక్రమించి

బనగానపల్లి : నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఇప్పటికే చెరువుల్లో పూడిక పేరుకుపోవడం, ముళ్లకంపలతో నిండిపోవడం.. తూములు అధ్వానంగా ఉండటంతో రైతులు సాగు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. దీనికితోడు ఆక్రమణలకు గురవుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కరవైంది. నియోజకవర్గ పరిధిలో మైనర్ ఇరిగేషన్ ఆధ్వర్యంలో సుమారు 20 చెరువులు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా దద్దణాల, కుక్కలగుంట, ముక్కమళ్ల, కానాల, రామభద్రునిపల్లె, వేములపాడు, ఉప్పలపాడు, సంగపట్నం, మెట్టుపల్లె, తిమ్మనాయునిపేట చెరువులున్నాయి.
**కొద్దికొద్దిగా మాయమవుతూ..**
బనగానపల్లి మండలం బత్తులూరుపాడు పరిధిలో రాచెరువు ఉంది. సర్వే నంబరు 99 నుంచి 103 వరకు వంద ఎకరాల్లో విస్తీర్ణం ఉండాలి. పలువురు దీనిని ఆక్రమించుకోవడంతో పట్టుమని 20 ఎకరాలు కూడా కనిపించడం లేదు. గతంలో రెవెన్యూ అధికారులు 40 మందికి ఒక్కొక్కరికి ఎకరా చొప్పున చెరువుకు సంబంధించిన స్థలంలో పట్టాలిచ్చారు. మిగిలిన పొలాన్ని కొందరు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. పట్టణానికి సమీపంలో ఉండటంతో గతంతో ఈ చెరువును అభివృద్ధి చేసి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అవుకు రిజర్వాయర్ నుంచి పైపులైన్ల ద్వారా నీరు సరఫరా చేసి నీటి కొరత లేకుండా చేయాలని నిర్ణయించారు. కానీ కార్యరూపం దాల్చలేదు. పదేళ్ల కిందట చెరువు అభివృద్ధికి రూ.30 లక్షలు ఖర్చు పెట్టి తూములు, కాలువ పనులు చేపట్టినా ఫలితం లేకపోయింది.
**150 ఎకరాలకుపైగా ఆయకట్టు**
బనగానపల్లి పట్టణానికి 4 కి.మీ. దూరంలో కైప చెరువు ఉంటుంది. వంద ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉండాల్సి ఉంది. దీనికి ఎస్సార్బీసీ నీరు అందుతుంది. 150 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. చెరువులో నీరుంటే చుట్టుపక్కల 200 ఎకరాల్లో బోర్లలో నీటి మట్టం పెరుగుతుంది. ఇలాంటి చెరువును కొందరు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. ఐదేళ్ల కిందట చెరువుకు తూము, అలుగు నిర్మించి పంట కాలువలు బాగు చేశారు.

చరకలు



# స్వగృహమస్తు

అమలాపురం: పట్టణ పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గతంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయడమే కాకుండా కొత్తగా మంజూరు చేపడుతోంది. ప్రధానమంత్రి అవాస్ యోజన (అర్బన్) 2.0 కార్యక్రమంలో భాగంగా గృహ నిర్మాణానికి రూ.2.50 లక్షలు అందజేయనున్నారు. దీనిలో రూ.1.50 లక్షలు కేంద్రం, రూ.లక్ష రాష్ట్ర ప్రభుత్వం అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

జిల్లావ్యాప్తంగా ఉన్న మూడు పురపాలికలు, ఒక నగర పంచాయతీ పరిధిలో ప్రధానమంత్రి అవాస్ యోజన(అర్బన్) 2.0లో భాగంగా అర్హులను ఎంపిక చేసేందుకు అధికారులు అంగీకార్ పేరుతో ప్రత్యేక సర్వే చేపడుతున్నారు. ఈ గృహాలకు పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా సౌర విద్యుత్తు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. లబ్ధిదారులు స్వయంగా ఇళ్లను నిర్మించుకుంటారా.. నిర్మాణం చేపట్టి అప్పగించాలా.. అనే అంశాలపై వివరాలు సేకరిస్తారు. కొత్తగా ఇళు



్లలేని వారిని గుర్తిస్తే ఆ జాబితాలో చేర్చి లబ్ధిని చేకూర్చేందుకు అంగీకార్-2025 కార్యక్రమాన్ని చేపడతున్నారు.

**జిల్లాలో ఇలా..**

జిల్లాలో అమలాపురం, రామచంద్రపురం, మండపేట పురపాలికలు కాగా, ముమ్మిడివరం నగర పంచాయతీగా ఉంది. వీటి పరిధిలో మొత్తం 475 ఇళ్లు మంజూరు చేశారు. వీటిని అందించేందుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపడుతున్నారు. అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. 508 మంది నుంచి దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**త్వరలోనే ప్రారంభం** ప్రధానమంత్రి ఆవాస యోజన (అర్బన్) 2.0 పథకంలో కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారికి మంజూరు చేస్తున్నారు. ప్రస్తుతం మంజూరైన వాటిని వారం రోజుల్లో పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుం టాం. ఇంకా 33 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటికి కూడా త్వరలోనే అనుమతులు వస్తాయి. నరసింహారావు, గృహనిర్మాణశాఖ పీడీ

## బీమా సఖి.. భవితకు తోడు

ముమ్మిడివరం: మహిళల ఉపాధి కల్పనకు ఉన్న అన్ని అవకాశాలను వారికి కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గ్రామీణ ప్రాంత అతివలకు చేయూతనిచ్చి కుటుంబాలకు ఆర్థిక చేదోడుగా ఉండేందుకు.. ఉపాధిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బీమాసఖి యోజన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికి ఎల్ఐసీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు జిల్లాలో ఏపీఎం, డీపీఎంలను నోడల్ అధికారులుగా నియమించింది.

ప్రక్రియ ప్రారంభం

'బీమా సఖి' మహిళల కోసం రూపొందించిన ప్రోత్సాహక పథకం. పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్నవారి నుంచి ఐఆర్‌డీఏ మార్గదర్శకాలకు అనుగుణంగా మూడేళ్ల కాల పరిమితితో జిల్లాలో 360 మందిని ఎంపిక చేయనున్నారు. నెలాఖరు నాటికి పూర్తిచేసి శిక్షణ ఇచ్చి ధ్రువపత్రం అందజేయనున్నారు. తర్వాత వీరు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

**అర్హతలు ఇవీ..**



పదోతరగతి ఉత్తీర్ణత, 18-70 సంవత్సరాల లోపు వయసు
ఎల్ఐసీ (ఏజెంట్స్) నిబంధనలు 2017 ప్రకారం అర్హతలు కలిగి ఉండాలి. జీతభత్యాలు పొందే ఉద్యోగై ఉండకూడదు. ఏదైనా వ్యాపారం, ఉపాధి ద్వారా ఆదాయం పొందేవారు అనర్హులు
ప్రీరిక్రూట్‌మెంట్ పరీక్షకు హాజరు కావాలి

మూడేళ్ల పాటు ప్రోత్సాహకం బీమా సఖులుగా ఎంపిక చేసిన వారికి తొలిఏడాది ప్రతినెలా రూ.7 వేలు, రెండో ఏడాదిలో రూ.6 వేలు, మూడో ఏడాది రూ.5 వేలు వంతున ప్రోత్సాహక నగదు అందిస్తారు. సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలి. ఎంపిక పూర్తికాగానే శిక్షణ ఇచ్చి పథకాన్ని ముందుకు తీసుకెళ్తామని డీఆర్‌డీఏ పీడీ జయచంద్రగాంధీ తెలిపారు.

**జిల్లా వివరాలు..**

డ్వాక్రా సంఘాలు: 38,279
సంఘాల్లో సభ్యులు: 3,77,254
బీమా సఖులు : 360

## నీరు లాగదు.. తీరు మారదు

మొగల్తూరు : చేలల్లో నీరు బయటకు లాగే మురుగు కాలువలు గత పాలనలో ప్రక్షాళనకు నోచుకోలేదు. వేసవి ఎండలు తలపిస్తున్నా వాటిలో నేటికీ మోకాలు లోతు నీరు నిలిచి మడుగుల్లా ఉన్నాయి. దీంతో నరసాపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల రైతులు ఈ ఏడాది కూడా సార్వాలో సాగుకు వెనకడుగు వేస్తున్నారు.

దర్భరేవు డ్రెయిను.. నరసాపురం మండలం రాజుల్లంక వద్ద ప్రారంభమయ్యే దర్భరేవు డ్రెయిను సారవ, ఎల్‌బీచర్ల, పసలదీవి, రామన్నపాలెం, మొగల్తూరు, మోడి గ్రామాల పరిధిలో సూమారు 25 కిలోమీటర్ల మేర ప్రవహించి ముత్యాలపల్లి వద్ద ఉప్పుటేరులో కలుస్తోంది. దీనికి పలు ప్రాంతాల్లో ఉన్న పైపు కల్వర్టులు ధ్వంసమయ్యాయి. ఇవి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారాయి. సముద్ర పోటు, వర్షాలకు చేల్లోకి చేరిన నీరు బయటకు వెళ్లడంలేదు. వాటిని తొలిగించి వంతెనలు నిర్మించాల్సి ఉంది. కాలువ పొడవునా కిక్కిస పెరిగి అడవిని తలపిస్తోంది. దీని ఆయకట్టులో సుమారు ఆరువేల ఎకరాల వరకూ భూములు ఉన్నాయి. వాటిలో నాలుగు వేల ఎకరాలు చేలను రైతులు ఆక్వాచెరువులుగా మార్పు చేశారు. మిగిలిన రెండు వేల ఎకరాల వరిచేలకు దాళ్వాలో సాగునీరందక, సార్వాలో ముంపు ప్రభావంతో గత నాలుగేళ్లుగా అన్నదాతలు సాగు విరామం పాటిస్తున్నారు. రుస్తుంబాద.. సీతారామపురం వద్ద ప్రారంభమై లికితపూడి, సరిపల్లి వద్ద నత్తలావలోకి ప్రవహిస్తుంది. రుస్తుంబాద డ్రెయిను ఆయకట్టులో సుమారు 12 వందల ఎకరాలు ఉండగా సార్వాలో ఆ భూములన్నిటికీ సాగుకు ముందుకు రావడంలేదు.

# కర్షకులకు గట్టుకాలమే



నందికొట్కూరు : ఏదేని సంస్థను ఏర్పాటుచేయాలంటే ముందుగా ఆ గ్రామ ప్రజలతో సమావేశమవ్వాలి. కలిగే ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలను వివరించాలి. ఓ సౌర పరిశ్రమ ప్రాజెక్టు నిర్వాహకులు నిబంధనలను తుంగలో తొక్కారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే వారి పొలాల్లో కంచె ఏర్పాటు చేయడంపై రైతులు మండిపడుతున్నారు. మిడుతూరు, నందికొట్కూరు, కల్లూరు మండలాల పరిధిలోని సుమారు 4 వేల ఎకరాల్లో ఓ కంపెనీ సోలార్ ప్రాజెక్టు పనులు చేపడుతోంది. ఒక్క మిడుతూరు మండలం పైపాలెంలోనే 700 ఎకరాల సాగు భూమిలో పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నారు.

**జీవం తీస్తున్నారు** పైపాలెం, నాగలూటి గ్రామాల సమీపంలో సుమారు 1,200 ఎకరాల్లో గట్టు ప్రాంతం ఉంది. దీనిపై సుమారు రూ.36 లక్షలతో ఉపాధి పనుల కింద 18 ఫారంపాండ్స్‌ను ఏర్పాటు చేశారు. ఎనిమిది కుంటలను నిర్మించారు. ఆయా గ్రామాల్లోని పశువులు, జీవాల మేతకు, నీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేది. ప్రస్తుతం సౌర పరిశ్రమ ఏర్పాటు నేపథ్యంలో ఫారంపాండ్స్, కుంటలను ఆక్రమించారు. దీంతో పశువులు, జీవాలకు మేత కరవైంది. చివరికి రైతులు వాటిని అమ్ముకుంటున్నారు. " పైపాలెంలో గతంలో 6 వేల జీవాలు ఉండగా.. ప్రస్తుతం 1,500 ఉన్నాయి.. విధిలేక అమ్మేసుకొంటున్నారు.. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని " ఉపాధి హామీ క్షేత్ర మాజీ సహాయకుడు శివకుమార్ పేర్కొన్నారు.

**దారులు మూసేశారు**

పైపాలెం రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు వీలుగా ఉపాధి పనులతోపాటు మార్కెట్ యార్డు నిధులతో రహదారులు నిర్మించుకున్నారు. దీన్ని ఆక్రమించుకున్నారు. కేశాలు, లక్ష్మన్న పట్టా పొలాల్లో ప్రాజెక్టు పనులకు సంబంధించి పర్యవేక్షణకు ఓ పూరిల్లు వేశారు. దీనిని తొలగించాలని కోరగా కొందరు దుర్భాషలాడి దాడికి పాల్పడ్డారు. ఇదే గ్రామానికి చెందిన నాగశేషులు, నాగేశ్వరరావుకు చెందిన పొలంలో కంచె ఏర్పాటు చేశారు. ఎల్లమ్మకు చెందిన పొలంలో ఎలాంటి అనుమతులు లేకుండా విద్యుత్తు స్తంభాలు బిగించారు. " రెవెన్యూ అధికారులు సాగు భూమికి పట్టా ఇచ్చారు. 40 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నా. ప్రస్తుతం మా పొలంలోకి రానీయకుండా చుట్టూ కంచె వేశారు. చేసేది లేక కూలీ పనులకు వెళ్తున్నట్లు రైతు నాగేశ్వరరావు పేర్కొన్నారు.

**పొలంలో కంచె వేశారు**

నాగశేషులు, పైపాలెం

మా పెద్దల కాలం నుంచి వ్యవసాయం చేసుకుంటున్నాం. సాగులో ఉన్న పొలంలో సోలార్ కంపెనీవారు దౌర్జన్యంగా కంచె వేశారు. వాటిని తొలగించడం కష్టంగా ఉంది. ప్రస్తుతం పొగాకు సాగు చేస్తున్నా. పొలంలో వాహనాలను ఇష్టానుసారంగా నడపడంతో పంట దెబ్బతింది. పొలాలకు వెళ్లే రహదారిని కబ్జా చేయడమేకాక మాకు దారి లేకుండా చేశారు. మా పొలాలకు వెళ్తుంటే అడ్డుకుని దౌర్జన్యం చేస్తున్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

# రైతు నెత్తిన కమీషన్ కత్తి



ఎమ్మిగనూరు : వ్యవసాయ మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్లు రైతు నెత్తిన తూకం భారం మోపుతున్నారు. వేరుసెనగ ఉత్పత్తుల క్రయవిక్రయాలకు ఎమ్మిగనూరు మార్కెట్‌కు పేరుంది. ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని పలు మండలాలతోపాటు అనంతపురం జిల్లాలోని పలు గ్రామాలు, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల రైతులు తీసుకొస్తుంటారు. పంట ఉత్పత్తులు తీసుకొచ్చిన రైతులు దించిన కూలీ మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. దిగుబడులు కొనుగోలు చేసి వ్యాపారులు తూకం వేసినందుకు కూలీ డబ్బులు కమీషన్ ఏజెంట్లకు చెల్లిస్తారు. అయితే కమీషన్ ఏజెంట్లు వ్యాపారులు ఇచ్చే కూలీ డబ్బుతోపాటు మళ్లీ రైతుల నుంచి వసూలు చేస్తున్నారు.

**తక్‌పట్టీలు ఇవ్వకుండా మాయ**

మార్కెట్‌లో ఈ-నామ్ విధానం ద్వారా అమ్మకాలు జరుగుతున్నాయి. ఆన్‌లైన్ తక్‌పట్టీలు రైతులకు ఇవ్వాల్సి ఉంది. తక్‌పట్టీలో కమీషన్, కూలీ తదితర అంశాలు ఉంటాయి. వాటిని ఇక్కడ ఇవ్వడం లేదు.. కమీషన్ ఏజెంట్లు చీటీలపై రాసి ఇస్తున్నారు. తక్‌పట్టీలు రైతులకు అందజేస్తే అదనపు కూలీ, అదనపు కమీషన్ స్పష్టంగా తెలుస్తుంది. దీనిపై కమీషన్ ఏజెంట్లను ప్రశ్నించే అవకాశం ఉంది.


**బహిరంగంగా దోపిడీ**

రైతు తెచ్చిన ఉత్పత్తులను కుప్పగా పోసి టెండర్‌కు పెడతారు. అధిక ధర కోట్ చేసిన వ్యాపారి రైతు సరకును తూకం వేసి కొనుగోలు చేస్తారు. మధ్యవర్తిగా కమీషన్ ఏజెంటు ఉంటారు. ఈయన వందకు 2 శాతం కమీషన్ తీసుకోవాలి. కానీ, అదనంగా మరో 2 శాతం వసూలు చేస్తున్నారు.

టెండర్‌కు పెట్టిన దిగుబడులు బస్తాల్లో నింపి తూకం వేస్తారు. సరకు కొన్న వ్యాపారి కమీషన్ ఏజెంటుకు బస్తాకు రూ.10 కూలీ ఇస్తారు. అయితే కమీషన్ ఏజెంట్లు వ్యాపారి ఇస్తున్నా కూలీతోపాటు బస్తాకు అదనంగా మరో రూ.10 రైతు నుంచి వసూలు చేస్తారు.

ఈ సీజన్‌లో ఇప్పటి వరకు లక్ష బస్తాలకు పైగా అమ్మకాలు జరిగాయి. ఈ లెక్కన రైతు నెత్తిన రూ.10 లక్షల అదనంగా తూకం భారం పడినట్లే. " ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని" మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి పేర్కొన్నారు.

# శవాలు రోదిస్తున్నాయి..!




కొవ్వూరు : గతేడాది సెప్టెంబరు 10 అర్ధరాత్రి దేవరపల్లి మండలం చిలకావారి పాకలు సమీపంలో అదుపు తప్పిన మినీ లారీ పంట బోదెలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. అందులోని జీడిపిక్కల బస్తాల కింద చిక్కుకుని ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను తెల్లవారుజామున కొవ్వూరు సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. శవాగారంలో రెండు ఫ్రీజర్లే ఉండటంతో మిగిలిన వాటిని భద్రపరిచేందుకు బయట నుంచి ఫ్రీజర్లు తేవాల్సి వచ్చింది. గోపాలపురం సీహెచ్‌సీ వద్ద తాత్కాలిక శవాగారం ఉంది. ఒక మృతదేహం వస్తే పరవాలేదు. రెండు, మూడు ఒకేసారి వస్తే భద్రపర్చేందుకు పరుగులు పెట్టాల్సిందే. జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో శవాగారాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి చందాన్ని తలపిస్తోంది. మౌలిక వసతుల మాట అటుంచి కనీస అవసరాల మేరకు ఫ్రీజర్లు కూడా ఉండడం లేదు. సమీపంలోని ఆసుపత్రులు, దాతలు, స్వచ్ఛంద సంస్థల నుంచి తేవాల్సి వస్తోంది.

**ఒక్కోచోట ఒక్కోరకంగా..** అనపర్తి వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రి శవాగారంలో రెండు ఫ్రీజర్లు అవసరం కాగా ఒకటే ఉంది. అది కూడా మరమ్మతులకు గురైంది.

కొవ్వూరు 50 పడకల సీహెచ్‌సీలో రెండు ఫ్రీజర్లున్నాయి. అవి కూడా తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి.

కడియం 30 పడకల ఆసుపత్రిలో శవగారం లేదు.

గోపాలపురం సీహెచ్‌లో ఇటీవల తాత్కాలిక శవాగారం ఏర్పాటైనా ఫ్రీజరు లేదు. నిడదవోలు 30 పడకల ఆసుపత్రి శవాగారంలో ఒక ఫ్రీజరు ఉంది. మరొకటి అవసరం.

గోకవరం 30 పడకల ఆసుపత్రిలో ఏడాది కిందట శవాగారం నిర్మించారు. అయితే అక్కడి చేరడానికి సరైన దారి లేదు.

8 నెలలు.. 186 మృతదేహాలు..

ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు నెలాఖరు వరకు జిల్లాలోని వివిధ ఆసుపత్రుల్లోని శవాగారాలకు 186 మృతదేహాలను తీసుకొచ్చిట్లు గణాంకాలు చెబుతున్నాయి.

**ప్రభుత్వానికి నివేదించాం..**

ఒకేసారి ఎక్కువ మృతదేహాలు వచ్చినప్పుడు ఇబ్బంది ఎదురవుతోంది. జిల్లాలోని అన్ని సీహెచ్‌సీల్లో శవాగారాలు, ఫ్రీజర్ల పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించాం. స్వచ్ఛంద సంస్థలు, దాతలను ప్రోత్సహించి సౌకర్యాల కల్పనపై శ్రద్ధ చూపుతున్నాం. ఎం.పద్మ, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారిణి

## లింకు తెగిన చెరువులు

శ్రీకాళహస్తి : సోమశిల-స్వర్ణముఖి లింకు కాల్వ నీళ్ల మల్లెమడుగు, బాలాజీ జలాశయం చేర్చాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఈ క్రమంలో కాల్వ పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అయితే గత ఐదేళ్లలో కాల్వతో పాటు చెరువుల అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో కాల్వకు అనుబంధంగా ఉన్న చెరువుల రూపురేఖలు మారిపోయాయి. ప్రస్తుతం కాల్వతోపాటు చెరువుల్లో పిచ్చి మొక్కలు పెరిగి పోవడంతో కాల్వగుండా గ్రావిటీ మీద వచ్చే నీటిని నిల్వ చేయడం, ఆ నీటిని మల్లెమడుగు, బాలాజీ జలాశయానికి తరలించడం కష్టసాధ్యమే మరి. చెరువుల దుస్థితిపై ఆయకట్టు రైతులు పెదవి విరుస్తుండటం గమనార్హం.

**వ్యయం.. నిష్ఫలం**

చెరువుల్లో రివిట్‌మెంట్ ఏర్పాటు చేశాక ఏడాదికో, రెండేళ్లకొక పర్యాయం పిచ్చి మొక్కల తొలగింపు (జంగిల్ క్లియరెన్స్) చేస్తుంటారు. ఎస్ఎస్‌కెనాల్ పనుల్లో ప్రధాన భూమికను ఏర్పేడు మండలంలోని మేర్లపాక జలాశయం చేపట్టనుంది. కాల్వకు చివరి భాగంగా ఉన్నది ఈ చెరువు మాత్రమే. దీన్ని రూ.4 కోట్లు వ్యయంతో జలాశయంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో 2019 నాటికి రివిట్‌మెంట్ పనులు పూర్తి చేశారు. వైకాపా ఐదేళ్లు రివిట్‌మెంట్‌ను పట్టించుకున్న పాపాన



పోలేదు. దీంతో మేర్లపాక చెరువు కట్ట వెంబడి చేసిన రివిట్‌మెంట్‌పై చెట్లు పెరిగాయి. రివిట్‌మెంట్ రాళ్లు ఊడిపోయాయి. ఇదే విషయమై కలెక్టర్ వెంకటేశ్వర్‌తో పాటు జలవనరుల శాఖ అధికారులు మేర్లపాక చెరువును పరిశీలించారు. మళ్లీ మరమ్మతులు చేపట్టాల్సి ఉందని సంబంధిత శాఖ అధికారులు చెబుపున్నారు. కాల్వల పొడవునా పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ఆయకట్టు రైతులు ఆవేదనకు గురవుతున్నారు.

**సామర్థ్యం పెంపు**

రూ.450 కో ట్ల అంచనాతో సోమశిల-స్వర్ణముఖి లింకు కాల్వ పనులు ఏళ్లతరబడి కొనసాగుతూనే ఉన్నాయి. 20 15లో శ్రీకాళహస్తి మండలంలోని మామిడిగుంట, ఇలగనూరు, గుంటకిందపల్లి, ఉడమలపాడు, జింగిలిపాళెం, ఏర్పేడు మండలంలోని రాజులపాళెం, చింతలపాళెం, మేర్లపాక, మన్నసముద్రం చెరువుల సామర్థ్యం పెంచడంతోపాటు పంగూరు, మేర్లపాక చె రువులను జలాశయాలుగా అభివృద్ధి చే యాలని గతంలో ప్రణాళికలు సిద్ధం చేశా రు. రూ.40 కోట్ల వ్యయంతో ఈ చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. కట్ట పటిష్ఠతకు రివిట్‌మెంట్ పనులు పూర్తిచేశారు.

## మేల్కోకుంటే ముప్పే..!

పుత్తూరు : మున్సిపాలిటీలోని ఎస్ఆర్ చెరువు కలుజు కాలువ పూర్తిగా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీంతో చెరువు నిండితే ఆ నీరంతా ఇళ్లలోకి ప్రవహిస్తోంది. ఏటా జెండామాను వీధి ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారు. పుత్తూరు చెరువు నుంచి కలుజు నీరు పారే కాలువలను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఈ కారణంగా భవానీనగర్ ప్రాంత వాసులు వర్షం పడితే కునుకు లేని రాత్రులు గడపాల్సిన పరిస్థితి. అయితే గతేడాది ప్రధాన కాలువలో పూడిక తొలగించడం వల్ల కాస్త పర్వాలేదు.

పలమనేరు మున్సిపాలిటీలో ఎద్దుల చెరువు, కాకతోపు వీధి, ఓంశక్తి ఆలయం ప్రాంతాల్లో వర్షం వస్తే అక్కడి వాసులు ఖాళీ చేయాల్సిందే. వర్షాలు పడితే ఇక నిద్ర ఉండదు. కారణం ఆ చెరువులకు నీరు చేరే సప్లయ్ ఛానల్స్‌ను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఈ సమస్య పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

తిరుపతి నగరపాలక సంస్థలో ప్రధాన కాలువలు ఆక్రమించారు. దీంతో పలు కాలనీలు నీట మునుగుతున్నాయి. ఏటా వర్షాకాలంలో ఆయా కాలనీల వాసులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించాల్సిన పరిస్థితి. ప్రధానంగా మధురానగర్, రైల్వే కాలనీ, శివజ్యోతి నగర్, దొడ్డాపురం వీధి, రెడ్డిరెడ్డి కాలనీ, సత్యనారాయణపురం, జీవకోన, బైరాగిపట్టెడ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య ఉంది.

పుంగనూరు మున్సిపాలిటీలో ఏటిగట్టుపాళ్యెం, మారుతీనగర్, కౌండిన్య కాలువ ఆక్రమణల వల్ల పలు కాలనీల్లోకి నీరు చేరుతోంది. దీంతో వర్షాకాలం వస్తే ముంపునకు గురవడం వల్ల ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి, చిత్తూరు నగరపాలికలు, పుత్తూరు, నగరి, పలమనేరు, పుంగనూరు, కుప్పం, శ్రీకాళహస్తి,



వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు మున్సిపాలిటీలు ఉన్నాయి.. ఏ పురపాలక చూసినా ఇదే పరిస్థితి.. ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా పరిస్థితి మెరుగుపడటం లేదు.. చిన్న చినుకుపడితే కంటిపై కునుకు లేని కాలనీలు ఎన్నో ఉన్నాయి.. గతేడాది కురిసిన వర్షాలకు పలు కాలనీలు నీట మునిగాయి.. అయినా అధికారులు ఇప్పటివరకు అక్కడి పరిస్థితిని అంచనా వేసి చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు.. ప్రస్తుత వర్షాలకు వీధులన్నీ జలమయం అవుతున్నాయి.


**కాలువలపైనే నిర్మాణాలు..** ఉమ్మడి జిల్లాలోని నగర పాలికలు, పురపాలికల్లో ప్రణాళికాబద్ధంగా మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టలేదు. ఎప్పుడో దశాబ్దాల కిందట నిర్మించినవే నేటికీ ఉన్నాయి. దీనికితోడు పట్టణాల్లోని ప్రధాన వీధుల్లో డ్రైన్లు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టేశారు. దీంతో వర్షం వస్తే వీధులు చెరువులను తలపిస్తున్నాయి. ఈ డ్రైన్లపై నిర్మాణాలు చేపట్టడంతో కనీసం ఏడాదికి ఒక్కసారి కూడా శుభ్రం చేస్తున్న దాఖలాల్లేవు. దీంతో ప్రజలు వ్యాధులు బారిన పడుతున్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఏటా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. వట్రపాళెం పూర్తిగా మునకకు గురవుతోంది. సాయిన గర్, గిరిజన కాలనీ, మహదేవయ్యనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లోనూ ఇదే దుస్థితి. కాళంగి పరివాహక ప్రాంతంలోనూ మునక ప్రాంతాలు ఉన్నాయి.

చురకలు



# నిర్వహణ నీరు గారింది!

ఒంగోలు : జిల్లా వరప్రదాయినిగా ఉన్న గుండ్లకమ్మ జలాశయం పరిస్థితి అధ్వాన్నంగా మారింది. గత వైకాపా అయిదేళ్ల పాలనలో ఇక్కడి రెండు గేట్లు కొట్టుకుపోగా, కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తవి ఏర్పాటు చేసింది. అయితే ఇప్పటికీ శిథిల రక్షణ గోడలు..అసౌకర్యాలు వెక్కిరిస్తున్నాయి. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గుండ్లకమ్మ జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 3.859 టీఎంసీలు. 2008 రూ.165 కోట్లతో జలాశయం, రూ.100 కోట్లతో కాలువల నిర్మాణం చేపట్టారు. జిల్లాలోని 80,060 ఎకరాల ఆయకట్టు గుండ్లకమ్మ పరిధిలో ఉంది. ఇందులో కుడి కాలువ 28,000 ఎకరాల



కు, ఎడమ కాలువ 52,060 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తోంది.

**కూలిపోయిన రక్షణ గోడ :** జలాశయం ప్రారంభంలో ఒంపు మార్గంలో ఉన్న రక్షణ గోడ రెయిలింగ్ కొంతమేర శిథిలమై కూలిపోయింది. కొన్నిచోట్ల ఇనుపచువ్వలు బయటికొచ్చి ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు..సందర్శకులు అప్రమత్తంగా లేకుంటే అదుపుతప్పి పడిపోయే ప్రమాదముంది. దీనికి మరమ్మతులు చేపట్టే విషయాన్ని యంత్రాంగం విస్మరించింది. పార్కులో పర్యాటకులు కూర్చునే బెంచీలు కూడా ఎక్కడికక్కడే విరిగిపోయాయి. విద్యుత్తు స్తంభాలకు లైట్లు అమర్చే క్లాంపులు లేవు. జలాశయంలో మోడుబారిన చెట్లను తొలగించకపోవడంతో వీక్షకులకు ఇబ్బందికరంగా మారింది.

**నత్తనడకన పనులు:** గుండ్లకమ్మ జలాశయం చెంతనున్న కాటేజీలు శిథిలమయ్యాయి. పచ్చదనం కరవైంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కాటేజీల పనులు చేపట్టారు. అయితే ఇవి నత్తనడకన సాగుతుండటం ఆవేదన కలిగిస్తోంది. త్వరలో పూర్తిచేసి వీటిని అందుబాటులోకి తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు.

# ఆక్రమణల తొలగింపు

శ్రీకాళహస్తి : పట్టణానికి సమీపంలోని రాజీవ్‌నగర్‌లో మలి విడత ఆక్రమణల తొలగింపును అధికారులు చేపట్టారు. పకడ్బందీ ప్రణాళికతో వేకువజామున రెవెన్యూ, పోలీసు, పురపాలక శాఖ అధికారులు పురపాలక సంఘ కార్యాలయం వద్ద సమావేశం అయ్యారు. ఒక్కసారిగా రాజీవ్‌నగర్‌కు వెళ్లి ముందస్తు అనుమతులు లేకుండా నిర్మించిన ఇళ్లను కూలదోశారు. వేకువజామున కట్టడాలు కూల్చివేత సందర్భంగా పలువురు లబ్ధిదారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. వైకాపా హయాంలో ఇక్కడున్న ప్రభుత్వ స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించారు. దీనిపై అప్పట్లో సర్వత్రా విమర్శలు వెలువడ్డాయి. దీనిపై విజిలెన్స్ విచారణ జరపాలంటూ పలువురు నేతలు ప్రభుత్వానికి విన్నవించారు.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శ్రీకాళహస్తి-పిచ్చాటూరు మార్గంలో ఉన్న అనధికారిక కట్టడాలను కూలదోశారు. తాజాగా రాజీవ్‌నగర్‌లో ఆక్రమణలను గుర్తించి వాటిని తొలగించారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాలకు సంబంధించిన పునాదుల వరకు నిర్మించిన 35 కట్టడాలను కూల్చివేశారు. మూడు పెద్ద, నాలుగు ఇళ్లను కూల్చారు. వైకాపాకు చెందిన మైనార్టీ నేతకు సంబంధించిన రెండు ఇళ్లను కూల్చివేశారు. కట్టడాలు చేపట్టే సమయంలో అభ్యంతరం వ్యక్తం చేసి ఉంటే రూ.లక్షలు వ్యయం చేసి నిర్మాణాలు కట్టుకునే వారం కాదని, తీరా అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నాక కూలదోయడం సరికాదంటూ అధికారుల పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. అమ్మినోళ్లు, ప్రేక్షక పాత్ర చూసిన అధికారులు బాగున్నారని, తమ బతుకులు వీధిపాలు చేశారంటూ పలువురు బాధితులు ఆవేదనకు గురయ్యారు.

# మూడేళ్లు.. ఇంకెన్నాళ్లు!

ఏలూరు: ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటై మూడేళ్లయినా ఇంకా బాలారిష్టాలు వీడలేదు. కళాశాలకు శాశ్వత భవనాలు ఒనగూరలేదు. తాత్కాలిక భవనాల్లోనే నడుస్తోంది. ఇప్పటికే రెండు బ్యాచ్‌లకు ప్రవేశాలు కల్పించగా.. తాజాగా మూడో బ్యాచ్ ప్రవేశాలు జరుగుతున్నాయి. ఇంకా తరగతి గదులు, వసతిగృహాలు, రవాణా సౌకర్యం లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం తాత్కాలిక భవనాల్లో 300 మందికి బోధన చేయడానికి రెండు గ్యాలరీలు ఉన్నాయి. ఎంబీబీఎస్ రెండు, మూడో సంవత్సరం చదివే విద్యార్థులు ఆసుపత్రిలోనే ఉండి క్లినికల్ సేవల్లో పనిచేస్తారు.వారికి థియరీ, ప్రాక్టికల్ క్లాసులు నిర్వహించడానికి ఆసుపత్రిలో గ్యాలరీ నిర్మించి ఇవ్వాలని కోరినా ఏడాదిగా ఏపీ ఎంఎస్ఐడీసీ అధికారులు కాలం వెళ్లదీస్తున్నారు. ఈ విషయం డీఎంఈ దృష్టికి కళాశాల వర్గాలు తీసుకెళ్లాయి. సెప్టెంబరు 10 నాటికి పూర్తి చేస్తామని ఇంజినీరింగ్ అధికారులు చెప్పినా ఆ లోపు కాకపోవచ్చని అంటున్నారు.

**రెండు, మూడు నెలలు..**

ప్రస్తుతం ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న శాశ్వత భవనాల్లో ఒక దానిలో గ్యాలరీ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. లోపల బల్లలు, బెంచీలు, ఆడియో, వీడియో సిస్టమ్, ప్రొజెక్టర్లు, ఏసీ ఇలా మిగిలినవి పూర్తికి రెండు, మూడు మాసాలు పడుతుంది. ఇంటీరియర్ చేయాల్సి ఉంది.

**ఎన్ఎంసీ తనిఖీలకు వస్తే**

పీజీ సీట్లు కోరడంతో ఎన్ఎంసీ బృందాలు తనిఖీలకు వస్తే అసంపూర్తి నిర్మాణాలు, అధ్యాపకుల కొరత వారి కంట పడతాయోనని కళాశాల నిర్వాహకులు భయపడుతున్నారు. మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం గ్యాలరీ లేకుండా బోధన చేయకూడదు. వసతిగృహాల్లో సరిపడా బెడ్లు లేవు. సెప్టెంబరు 5 నుంచి మూడో సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభం కానున్నాయి.

# కూ.. చకచకా.. డబ్లింగ్



తిరుపతి: తిరుపతి- పాకాల- కాట్పాడి రైల్వేలైన్‌ను డబ్లింగ్ చేయాలన్నది దశాబ్దాలుగా ఉమ్మడి చిత్తూరు జిల్లావాసుల డిమాండ్. ఏప్రిల్‌లో కేంద్ర క్యాబినెట్ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపినా భూసేకరణపై రైల్వేశాఖ నుంచి స్పష్టత లేదు. ప్రాథమికంగా తిరుపతి- పాకాల వరకు సర్వే చేసినా.. పాకాల- కాట్పాడి లైన్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. తాజాగా జిల్లాతోపాటు తమిళనాడులోని వేలూరు జిల్లాలోనూ భూసేకరణ దిశగా కదలాలని రైల్వేశాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. రెవెన్యూ శాఖ అధికారులు ఈ అంశంపై దృష్టి సారించనున్నారు.తిరుపతి- పాకాల- కాట్పాడి రైలు మార్గంలో రోజూ 40కిపైగా రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఒకే లైన్ ఉండటంతో చిత్తూరులో ముఖ్యమైన రైళ్లు ఆగడం లేదు. ప్రయాణికులు తిరుపతి లేదా కాట్పాడిలో దిగాల్సిందే. ఎక్స్‌ప్రెస్ రైళ్లు వస్తే ప్యాసింజర్లు ఆగాల్సిందే. ఈ ఇబ్బందులు తీర్చేందుకు డబ్లింగ్ చేయాలన్న ప్రతిపాదనలకు కూటమి ప్రభుత్వంలో మోక్షం కలిగింది.

**పలు రంగాలకు ఊతం**

డబ్లింగ్ పూర్తయితే చిత్తూరు, తిరుపతి జిల్లాలు పర్యాటకం, పారిశ్రామికంగా పురోగమిస్తాయి. శ్రీసిటీ, రేణిగుంట, ఏర్పేడు ఈఎంసీలు, గూడూరు, సూళ్లూరుపేటలోని పారిశ్రామికవాడలతోపాటు చిత్తూరు జిల్లా నుంచి గ్రానైట్, మామిడి ఉత్పత్తుల రవాణా సులభతరమవుతుంది. రెండు మూడు రోజులు యాత్రికులు ఉండేలా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయొచ్చు.

**మార్చి నాటికి సర్వే**

తిరుపతి- పాకాల కాట్పాడి రైల్వే లైన్‌ను రెండు వరుసలుగా విస్తరించేందుకు ఆరు- ఎనిమిది నెలల్లో అవసరమైన స్థలాన్ని రైల్వేశాఖకు అప్పగించనున్నారు. పాకాల- కాట్పాడి మధ్య ఉన్న లైన్ చిత్తూరు జిల్లా పరిధిలోకి వస్తుంది. జిల్లాలో వచ్చే ఏడాది మార్చి నాటికి సర్వే ప్రక్రియను కొలిక్కి తీసుకురావాలని భావిస్తున్నారు. ఈలోగా డబ్లింగ్ పనులకు టెండర్లు ఖరారయ్యే అవకాశం ఉందని అధికారులు అనుకుంటున్నారు.

**త్వరగా భూసేకరణ చేస్తాం**

సీఎం చంద్రబాబు ఆదేశాలతో తిరుపతి- పాకాల డబ్లింగ్‌కు ప్రాథమికంగా సర్వే నిర్వహించాం. త్వరగా భూసేకరణ చేసి రైల్వేశాఖకు అప్పగిస్తాం. వీలైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

శుభం భన్సల్, తిరుపతి జేసీ

విషయం: తిరుపతి- కాట్పాడి రైల్వేలైన్ డబ్లింగ్
పూర్తయితే ఏటా పెరిగే ఆదాయం: రూ.120.85 కోట్లు
పొడవు: 104.39 కి.మీ.
వ్యయం: రూ.1,331.89 కోట్లు
ఆదా కానున్న సమయం: 24 నిమిషాలు

# టీడీఆర్‌ల కోసమే మాస్టర్ ప్లాన్



తిరుపతి : తిరుపతిలో ఐదు వేల ఇంటి నంబర్లను నివాస స్థితి నుంచి వాణిజ్య స్థితికి మార్చాలని వైకాపా హయాంలో నగరపాలక సంస్థ అధికారులు ప్రతిపాదించగా మీద రిజిస్ట్రేషన్ శాఖ మార్కెట్ విలువ పెంచింది. ఆ స్థలాల్లో చిన్నచిన్న షెడ్లు నిర్మించి టీడీఆర్‌లు అందజేశారు.అప్పట్లో మార్కెట్ విలువ నాలుగు రెట్లు పెంచి టీడీఆర్ బాండ్లు వైకాపా నేతల స్థలాలకు జారీ చేశారని తెలుస్తోంది.

కొందరు సామాన్యులకు సమాచారం చెప్పకుండా, నోటీసులు ఇవ్వకుండా, పరిహారం ఊసెత్తకుండా దౌర్జన్యంగా భూముల్లోకి చొరబడి అక్రమంగా రోడ్లు వేశారు. .. ఇటీవల జరిగిన టీడీఆర్ మేళాలో బాధితుల గోడు వింటే మాస్టర్‌ప్లాన్ రోడ్ల పేరుతో వైకాపా సాగించిన అరాచకాలు ఎన్నెన్నో.

తిరుపతి నగరంలో తానే అభివృద్ధి చేశానంటూ ఇన్నాళ్లూ గొప్పలు చెప్పుకొన్న మాజీ ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి.. ఆ పనుల్లో అవినీతికి కారణం మాత్రం అధికారులేనంటూ ప్లేటు ఫిరాయించడంపై నగరపాలక సంస్థ యంత్రాంగం తీవ్రంగా మండిపడుతోంది.

**నాటి అధికారి వెలిబుచ్చారిలా..**

వైకాపా నేతల సూచనలతో నిబంధనలు ఉల్లంఘించి మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మాణం చేపట్టాల్సి వచ్చిందని ఏడాది కిందట జరిగిన కౌన్సిల్ సమావేశంలో నాటి పట్టణ ప్రణాళికాధికారి బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మరుసటి రోజే ఆయన తెదేపా అధికారి అంటూ వైకాపా పెద్దలు ప్రకటించడం, తాజాగా శ్రీలక్ష్మి అవినీతి అధికారిణి అని పేర్కొనడం చర్చనీయాంశమైంది.

**నిధులు లేకపోయినా తీర్మానాలు**

టీడీఆర్‌ల కోసం రోడ్లు నిర్మించారా అనే సందేహం మొదటి నుంచి కలిగించేలా వైకాపా నేతలు వ్యవహరించారు. 2022 జులై 15న జరిగిన కౌన్సిల్ సమావేశంలో రూ.37.12 కోట్లతో 12 మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మించేందుకు తీర్మానించారు. ప్రభుత్వం నుంచి పైసా నిధులు రావని తెలిసినా, నగరపాలిక ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకున్నా.. వాటిని 22కు పెంచారు. నిర్మాణ వ్యయం రూ.60 కోట్లకు చేరింది. ఈ క్రమంలో నగరపాలిక అత్యవసరాల కోసం బ్యాంకుల్లో ఉంచిన ఫిక్స్‌డ్ డిపాజిట్లను సైతం రోడ్ల బిల్లులకు చెల్లించడం గమనార్హం.

మొత్తం మాస్టర్ ప్లాన్ రోడ్లు: 22
ప్రభావితమైన భూములు: 1,121
వైకాపా హయాంలో జారీ చేసిన టీడీఆర్‌లు: 442
కూటమి ప్రభుత్వం వచ్చాక: 267
ఇంకా పెండింగ్‌లో ఉన్నవి: 368

# వణుకుతున్న ‘పశ్చిమం’



ఆదోని : పశ్చిమ ప్రాంతంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఏ పల్లె చూసినా.. ఏ ఇల్లు చూసిన వయస్సుతో నిమిత్తం లేకుండా జ్వర బాధితులు ఉంటున్నారు. ఇందులో చాలా మంది మలేరియా, డెంగీ, టైఫాయిడ్ బాధితులే. కొందరు దూర ప్రాంతాలకు వెళ్లలేక గ్రామంలోనే చికిత్స పొందుతుండగా.. మరికొందరు ఆదోని, బళ్లారి, శిరుగుప్ప, రాయచూర్ వంటి ప్రాంతాలకు వెళుతున్నారు. ఆదోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు కొత్త నీరు రావడం, గ్రామాల్లో స్వచ్ఛత లోపించి, వీధులన్నీ మురికివాడలుగా మారాయి. ఇక దోమలు జనం మీద దండయాత్రలు చేస్తుండటంతో జనం జ్వరాలతో అల్లాడుతున్నారు. కోసిగి, కౌతాళం మండలాల్లోని బాధితులు అధికంగా ఉన్నారు. నదీతీర గ్రామాల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది.

**దండుకుంటున్న ప్రైవేట్ క్లినిక్‌లు**

విష జ్వరాలు ప్రబలడంతో ప్రైవేటు ఆస్పత్రులతో పాటు ఆర్ఎంపీలకు గిరాకీ పెరిగింది. ఇళ్ల వద్దనే వైద్య సేవలందించి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు. ఇటు పట్టణాల్లో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తే.. ఐదారు రోజులు చికిత్స చేసి.. రూ.20-30 వేలు బిల్లు వేస్తున్నారు. వైద్య సేవలు, ఔషధ గిరాకీ రూ.లక్షల్లో ఉంటోంది. పట్టణంలో ఓ పేరు మోసిన చిన్న పిల్లల ఆస్పత్రిలో రోజు వారి ఓపీ 200 దాటుతోంది. ఓపీ ధర రూ.200. ఒక్కో రోగికి కనీసం రూ.500 తగ్గకుండా మందులు రాస్తున్నారు. ఎస్కేడీ కాలనీలో ఏ ఆస్పత్రిలో చూసిన రోగులతో నిండి ఉంటున్నాయి. గ్రామాల వైపు అధికార యంత్రాంగం కన్నెత్తి చూడటం లేదని ప్రజలు వాపోతున్నారు.

**అటు రోగుల బారులు.. ఇటు సిబ్బంది కొరత** ఆదోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గత రెండు వారాలుగా రోజు వారీ ఓపీ 800 దాటుతోంది. ఇక రక్తపరీక్షల విభాగంలో 200 ఓపీ నమోదవుతోంది. వీటిలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి అనుమానిత కేసుల సంఖ్య 80 దాకా ఉంటోంది. సీబీపీ పరీక్షల కోసం అధికంగానే వస్తున్నారు. ఇంతటి ఆస్పత్రిలో 70 మంది వైద్యులుండాల్సిన చోట.. ఉన్నది కేవలం 17 మంది మాత్రమే. ఆరు అర్బన్ కేంద్రాల్లో కేవలం ముగ్గురు వైద్యులు మాత్రమే ఉన్నారు. ఆదోని డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీల్లోనూ అయిదుగురు వైద్యుల కొరత ఉంది. మంత్రాలయంలోని కల్లుదేవకుంట పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులూ ప్రసూతి సెలవులో ఉన్నారు. పెద్దకడబూరు మండలంలో ఒక వైద్యుడి పోస్టు ఖాళీ ఉంది. ప్రతి పీహెచ్‌సీకి ముగ్గురు స్టాఫ్‌నర్సులు ఉండాల్సి ఉండగా పది మంది దాకా కొరత ఉంది. పత్తికొండ, ఆలూరు పరిధిలో సైతం వైద్యులతో పాటు స్టాఫ్ నర్సుల కొరత వేధిస్తోంది.

## గోదావరిపై పెట్రోలింగ్

పోలవరం : పోలవరం ప్రాజెక్టు వెనుక భాగంలోని గోదావరిలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలకు అడ్డు కట్ట వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీని కోసం ప్రత్యేకంగా బోటు తయారవుతోంది. గోదావరిపై పెట్రోలింగ్ చేసేందుకు, పర్యాటకుల రాకపోకలకు ఉపయోగించేలా దీనిని తయారు చేస్తున్నారు. గోదావరిలో నిషేధిత వలలతో పెద్ద ఎత్తున చేపలు పట్టుకుని తరలిస్తున్న మత్స్యకారులు, పశువులను నది దాటించి అమ్మి సొమ్ము చేసుకుంటున్న ముఠాల ఆగడాలకు అడ్డుకట్ట పడనుంది.పోలవరం మండలం కొరుటూరు వద్ద అటవీశాఖ పర్యాటకుల బస కోసం కాటేజీలు నిర్మించింది. పర్యాటకులు ప్రైవేటు లేదా పర్యాటక శాఖ బోట్లపై అక్కడికి వచ్చి కాటేజీల్లో ఉండాల్సి రావడం తప్ప మరో మార్గం లేదు. తిరిగి మరుసటి రోజు బోట్లు వచ్చి తీసుకువెళ్లే వరకు అక్కడ ఉండాల్సిందే. ఫలితంగా పాపికొండల్లో బస చేయాలంటే పర్యాటకులు అంతగా ఆసక్తి చూపడం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర అటవీ శాఖాధికారులు కాంపా నిధులు రూ.20 లక్షలు మంజూరు చేశారు. వాటితో బోటు సమకూర్చుకుని.. గోదావరిలో పెట్రోలింగ్‌తో పాటు పర్యాటకుల రాకపోకలకూ దానిని ఉపయోగించనున్నారు. ప్రస్తుతం అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధి తాళ్లరేవులో బోటు ముస్తాబవుతోంది. త్వరలో పోలవరం తీసుకురానున్నారు.

# పేద పిల్లలకు పెద్ద ఊరట!

ఒంగోలు : రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలకు సాంఘిక సంక్షేమ వసతి గృహాలు కొండంత అండగా నిలుస్తున్నాయి. అత్యంత వెనుకబడిన జిల్లాలో 20 వేల మందికిపైగా విద్యార్థులు వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్నారు. పలుచోట్ల ఏళ్ల కిందట నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరడంతో తలదాచుకునే అవకాశం ఉండటం లేదు. సమస్యను గుర్తించిన కూటమి ప్రభుత్వం వీటి నిర్మాణానికి చర్యలు చేపట్టింది. జిల్లా ఖనిజ నిధి( డీఎంఎఫ్) నుంచి రూ.కోట్ల నిధులు కేటాయించి నిర్మాణం చేపడుతున్నారు.ఒంగోలు నగరంలోని సంతపేటలో బడికి వెళ్లే పిల్లల కోసం మూడు వసతి గృహాలు కలిపి ఒకే ప్రాంగణంలో భారీ భవన నిర్మాణాన్ని రూ.6.50 కోట్లతో చేపడుతున్నారు. ఇది పూర్తయితే మూడంతస్తుల్లో 500 మంది వరకు ఆశ్రయం పొందవచ్చు.ఒంగోలు నగరంలోని సక్కుబాయమ్మ కళాశాలలో బాలికల కోసం రెండు, మూడు వసతి గృహాల్లో అదనపు గదుల నిర్మాణం చేపడుతున్నారు. ఈ రెండింటికి పైఅంతస్థుల నిర్మాణానికి రూ.5.50 కోట్లు కేటాయించారు. ఇవి పూర్తయితే 450 మంది వరకు కళాశాల విద్యార్థినులు చదువుకునే అవకాశం ఉంటుంది.

ఒంగోలు నగరంలోని పీవీఆర్ పాఠశాల ప్రాంగణంలో బాలుర కోసం రూ.3 కోట్లతో భారీ భవనాన్ని నిర్మిస్తున్నారు. తూర్పుపాలెంలోని స్థలాన్ని కార్పొరేషన్‌కు అప్పగించి, తీసుకున్న ఈ స్థలంలో వసతి గృహం నిర్మిస్తున్నారు.

చీమకుర్తిలోని బాలికల వసతి గృహానికి రూ.2 కోట్లు, సంతనూతలపాడులో బాలుర వసతి గృహానికి రూ.2 కోట్ల నిధులు



కేటాయించారు.జిల్లాలోని 38 వసతి గృహాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, ఫ్లోరింగ్, తాగునీటి సౌకర్యం.. తదితర మరమ్మతు పనులు రూ.13 కోట్లతో చేపట్టారు. ఈ పనులు దాదాపు పూర్తికావొచ్చాయి.

కేంద్ర ప్రభుత్వం సాయమందించే ‘పీఎం అజయ్’ కార్యక్రమం ద్వారా ఒంగోలులో పాలిటెక్నిక్ కళాశాలలో వసతి గృహాలకు రూ.6 కోట్లు, యర్రగొండపాలెం, గిద్దలూరులో బాలబాలికలకు రూ.ఆరేసి కోట్లతో వసతి గృహాల నిర్మాణానికి ప్రతిపాదించారు.

**ఒంగోలులో స్టడీ సర్కిల్**

పోటీ పరీక్షలకు హాజరయ్యే జిల్లా అభ్యర్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. జిల్లా కేంద్రం ఒంగోలు నగరంలో అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం భవనాల కోసం అన్వేషణ చేపట్టారు. జేడీ శీలం భవనం పరిశీలించినా ప్రస్తుతం కళాశాల విద్యార్థులు ఉంటున్నారు. వారికి నూతనంగా నిర్మించే భవనం పూర్తయిన తరువాత అక్కడ పెట్టే యోచనలో ఉన్నారు. పేద విద్యార్థులకు మేలు చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిధులు అందుబాటులో ఉన్నందున భవన నిర్మాణాలు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. అంబేద్కర్ స్టడీ సర్కిల్ కూడా సాధ్యమైనంత తొందరలోనే ప్రారంభిస్తామన్నారు.

# పట్టాలు సృష్టించి.. నట్టేట ముంచి

కర్నూలు : ఓర్వకల్లులో రూ.50 కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి కొందరు దొంగ పట్టాలు సృష్టించి విక్రయించారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమాలు జరగ్గా తాజాగా వెలుగులోకి వచ్చాయి.


ఓర్వకల్లు పోలీసుస్టేషన్, తహసీల్దారు కార్యాలయ సమీపంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆనుకుని ఉన్న ఐదెకరాల ప్రభుత్వ భూమికి కొందరు అక్రమంగా పట్టాలు పుట్టించి అమ్మేశారు. సర్వే నంబరు 471/సిలో రెండెకరాలు, 614లో మూడెకరాలు, ఆదర్శ పాఠశాల సమీపంలో రెండెకరాలు, తహసీల్దారు కార్యాలయం ఎదురుగా సర్వే నంబరు 532/సిలో రెండెకరాల భూమికి పట్టాలు సృష్టించారు.

**సీల్, స్టాంపులు తయారుచేసి..** తహసీల్దారు కార్యాలయ సీల్, స్టాంపును తయారుచేసి పట్టాలపై ముద్రలు వేశారు. తహసీల్దారుగా గతంలో పనిచేసిన కృష్ణవేణి సంతకాన్ని ఫోర్జరీ చేశారు. ప్రభుత్వ స్థలంలో అనధికారిక లేఅవుట్ వేశారు. సెంటు రూ.2.50 లక్షలు, మరికొన్ని రూ.1.50 లక్షల చొప్పున అమ్మేశారు.

**ఒప్పందాలు చేసుకుని..**

కొన్ని ప్లాట్లు విక్రయించేందుకుగాను 2019 నుంచి ఒప్పందాలు కుదుర్చుకోవడం ప్రారంభించారు. ఎంత భూమిని.. ఎంత మొత్తానికి విక్రయిస్తున్నామన్న విషయాన్ని ఒప్పంద పత్రాల్లో రాసుకున్నారు. వీటికి 2019, 2020, 2021, 2022లో కుదుర్చుకున్నారు. 2006, 2011లో పట్టాలను జారీ చేసినట్లు చూపడం గమనార్హం.

ఓర్వకల్లు మండలంలో 2011లో పేదలకు పట్టాలిచ్చారు. ఆ



సంవత్సరంలో పట్టాలిచ్చినట్లు చూపితే ఎవరికీ అనుమానం రాదన్న ఉద్దేశంతో 2011లోనే పట్టాలిచ్చినట్లు చూపారు. వాస్తవానికి ఆ సంవత్సరంలో సర్వే నంబరు 532/సిలో పట్టాలు పంపిణీ చేశారు. నకిలీ పట్టాల్లో మాత్రం ఆ సర్వే నంబరు వేయలేదు.

**బాధితులకు మళ్లీ దొంగ పట్టాలు**

ఓర్వకల్లులో సర్వే నంబరు 614లోని ప్రభుత్వ భూమిని జూనియర్ కళాశాలకు ప్రభుత్వం కేటాయించింది. దీనిని ఆ కళాశాల ప్రిన్సిపల్ స్వాధీనం చేసుకున్నారు. ఆ భూమిలో స్థలాలు కొన్నవారు తాము మోసపోయినట్లు గుర్తించారు. స్థలాలు అమ్మినవారిని నిలదీశారు. దీంతో మరోచోట స్థలాలిస్తామని నచ్చజెప్పారు. వేరేచోట ఉన్న ప్రభుత్వ స్థలానికి తాజాగా మళ్లీ దొంగ పట్టాలు పుట్టించి బాధితుల చేతిలో పెట్టారు. నకిలీ పట్టాల వ్యవహారం వివాదాస్పదం కావడంతో కొందరు కొనుగోలుదారులు అక్రమార్కులను నిలదీశారు. దీంతో సుమారు 15 మందికి డబ్బులు వెనక్కి ఇచ్చేశారు.

## నీటి ట్యాంకర్లు.. కాకి లెక్కలు

గుత్తి : గుంతకల్లు, తాడిపత్రి, గుత్తి పురపాలికల్లో నీటి ట్యాంకుల నిర్వహణ గాడి తప్పింది. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు దప్పిక పాట్లు తీర్చడానికి ఏర్పాటు చేసిన ట్యాంకర్లతో సత్ఫలితాలు రావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. గుత్తిలోని కురువగేరి, దళితవాడ, కమాటంగేరిలకు పైపులైన్లు ఉన్నా కుళాయిలకు రావడం లేదు. పురపాలిక పరిధిలో ఒకరికి రోజుకు 70లీటర్లు తాగునీరు ఇవ్వాల్సి ఉండగా అమలు కావడం లేదు. పామిడి పెన్నా నుంచి వచ్చేనీరు గుత్తి ప్రజలకు చాలడంలేదు. వైటీచెరువు పథకం రెండు నెలలుగా పని చేయడం లేదు. మంగళవారం నుంచి నీరు ఇస్తున్నారు. సత్యసాయి పథకం కింద రోజుకు 10-15లక్షల లీటర్ల



నీరు సరఫరా అవుతోంది. కొన్ని కాలనీలకు మాత్రమే అందిస్తున్నారు. తాడిపత్రి పురపాలికలో రోజుమార్చి రోజు తాగునీరు ఇస్తున్నారు. గండికోట, పెన్నాలోని బోరుబావుల నుంచి సరఫరా అవుతున్నాయి. అక్కడి ప్రజలకు రోజుకు 91 లక్షల లీటర్లు నీరు అవసరం. అధికారులు మూడు ట్యాంకర్లతో పలు వార్డులకు సరఫరా చేస్తున్నారు.

గుంతకల్లు పురపాలికలో ఏడు ప్రైవేట్, రెండు పురపాలిక ట్యాంకర్లతో సీబీటీయూ, కాల్వగడ్డ, దోనిముక్కలరోడ్డు కాలనీలకు సరఫరా చేస్తున్నారు. మూడురోజులకోసారి నీరిస్తున్నారు. ఇక్కడి జనాభాకు రోజూ 1.26 కోట్ల లీటర్ల తాగునీరు అవసరం. ట్యాంకర్లకు అద్దెలు సక్రమంగా చెల్లించలేని పరిస్థితి నెలకొంది.

**ఇబ్బంది లేకుండా చూస్తున్నాం**

-హేమచంద్ర, డీఈఈ, గుత్తి

ట్యాంకర్లను సక్రమంగా నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం 8 ట్యాంకర్లు ఉన్నాయి. వాటితోనే శివారు కాలనీలకు నీరు ఇస్తున్నాం. ట్యాంకర్ ట్రిప్పుకు రూ.350 చెల్లిస్తున్నాం. సమస్య తీవ్రతను బట్టి ట్యాంకర్ల సంఖ్య పెంచుతాం.

## పట్టుదలే నడిపిస్తోంది!

గుంతకల్లు : పేద కుటుంబానికి చెందిన యువతి పట్టుదలతో పురుషులతో సమానంగా పోటీపడుతూ సత్తా చాటుకుంటున్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో మొట్టమొదటి మహిళా లోకో పైలెట్‌గా ప్రత్యేకత చాటారు అమలకుమారి. సహాయ పైలెట్‌గా ఉన్న ఆమె ఇటీవల పైలెట్‌గా పదోన్నతి పొంది ఆదర్శబాటలో పయనిస్తున్నారు. స్ఫూర్తిదాయక ప్రస్థానం ఆమె మాటల్లోనే విందాం..!

మాది చాలా పేద కుటుంబం. తండ్రి సైకిళ్లను మరమ్మతు చేస్తూ నన్ను, మా అక్కను చదివించారు. ఇందుకు ఎంతో కష్టపడ్డారు. ఇద్దరం బీటెక్ చేశాం. సోదరి సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడింది. రైళ్లలో పని చేయడం కష్టమని చాలా మంది చెప్పారు. అయినా ఎన్నడూ అధైర్య పడలేదు. పురుషులతో పోటీపడి పనిచేసి.. పేరు సంపాదించుకోవాలన్న పట్టుదలే నన్ను ఈ స్థాయికి చేర్చింది. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సమావేశాల్లో చెబుతుంటాను. అందుకే డ్రైవర్ కావాలని నిర్ణయించుకున్నా. రైల్వేలో 2019లో లోకో సహాయ పైలెట్‌గా



బాధ్యతలు చేపట్టాను. ఇంతవరకు విధుల్లో భాగంగా 98,903 కి.మీ. ప్రయాణించాను.

**అప్రమత్తంగా ఉంటేనే..**

ఉద్యోగం చిన్నదైనా.. బాధ్యత చాలా పెద్దది. విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా భారీ నష్టం జరుగుతుంది. ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలి. అధికారులు పూర్తి సహకారం అందజేస్తున్నారు. ఒక్కోసారి జంతువులు రైల్వేలైన్లపై వస్తుంటాయి. వాటి ప్రాణాలను కాపాడడానికి శాయశక్తులా కృషి చేస్తుంటా. ఇప్పటివరకూ చిన్న ప్రమాదం కూడా జరగలేదు. ఇకముందు అంతకుమించి అప్రమత్తంగా ఉంటా. గమ్యానికి సాఫీగా.. సురక్షితంగా చేర్చడమే నా కర్తవ్యం. ఏ రంగంలోనైనా పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా ముందుకెళితే విజయం సొంతమవుతుంది.

## రోడ్లపై నీళ్లు.. జనానికి అవస్థలు

విశాఖపట్నం: అల్పపీడనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా ముసురు పట్టింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దట్టమైన మబ్బులు కమ్ముకున్నాయి. భారీ వర్షం కురవడంతో కార్యాలయాలు, వ్యాపారాలు, పాఠశాలలకు, వివిధ పనులపై బయటకు వెళ్లేవారు అవస్థలు పడ్డారు. అక్కయ్యపాలెం, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆర్కే బీచ్‌లో తీరం కోతకు గురైంది. ఎంవీపీ సెక్టార్-3లో రహదారిపై భారీ వృక్షం కూలిపోయింది. భీమునిపట్నంలో 64 మిల్లీమీటర్లు, పరదేశిపాలెంలో 56, ఆనందపురం, పెందుర్తిలో 54, మహారాణిపేటలో 53, కాపులుప్పాడలో 51, గంభీరంలో 49 మి.మీ. వర్షపాతం నమోదైంది.

**కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు**

రానున్న రెండు రోజుల్లో వర్షాలు కురుస్తాయన్న వాతావరణ కేంద్రం హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో, ఆర్డీవో, మండల కార్యాలయాల్లో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేశామని డీఆర్వో భవానీశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని కేంద్రాల్లో 24 గంటలు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కలెక్టరేట్‌కు సంబంధించి 0891-2590100, 0891-2590102 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

# పల్లెవించి 'నిధి'



కర్నూలు : పల్లెల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తోంది. గ్రామాల్లో వివిధ పనులకు వీటిని ఖర్చు చేయాల్సి ఉంది. ఈ నిధులను గత వైకాపా ప్రభుత్వం పక్కదారి పట్టించింది. విద్యుత్తు బకాయిల పేరుతో మళ్లించింది. ఫలితంగా పల్లెల్లో కనీస వసతులు కరవయ్యాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఆర్థిక సంఘం నిధులకు ఉపాధి హామీ సొమ్ము జతచేసి 'పల్లె పండగ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పెద్దఎత్తున రహదారులు నిర్మించి జనం కష్టాలు తీర్చింది. ప్రస్తుతం ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన (పీఎంఏజీవై)ను పకడ్బందీగా అమలుచేసేలా చర్యలు చేపట్టింది.

**రూ.20 లక్షల చొప్పున..**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన (పీఎంఏజీవై)లో భాగంగా రెండో విడతలో 28 గ్రామాలు ఎంపికయ్యాయి. ఒక్కో గ్రామానికి రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ.5.60 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. 50 శాతానికిపైగా ఎస్సీలు ఉన్న గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంది. ప్రస్తుతం కేంద్రం నేరుగా ఎంపిక చేసిన ఆదర్శ గ్రామాల్లో పనులు వేగంగా సాగుతున్నాయి. పీఎంఏజీవై కింద తొలి దశలో 10 మండలాల పరిధిలో 11 ఆదర్శ గ్రామాలను ఎంపిక చేశారు. వీటికి రూ.2.20 కోట్లు కేటాయించారు. ఆయా ప్రాంతాల్లో సుమారు 70 శాతం పనులు పూర్తయ్యాయి.

**కేంద్రమే ఎంపిక చేసి..**

కర్నూలు జిల్లాలో హొళగుంద మండలం మార్లమడికి, గూడూరు మండలం గుడిపాడు, కె.నాగలాపురం, ఆస్పరి మండలం నగరూరు, నందవరం మండలం మాచాపురం, పెద్దకడబూరు మండలం మేకడోణ, కర్నూలు గ్రామీణ మండలం పసుపల, మంత్రాలయం మండలం బూదూరు, ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామాలను కేంద్రం ఎంపిక చేసింది. 8 మండలాల పరిధిలోని 9 గ్రామాలకు రూ.1.80 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో 46 పనులు చేపట్టనున్నారు.

నంద్యాల జిల్లాలో 14 మండలాల పరిధిలో 19 గ్రామాలను ఎంపిక చేశారు. ఒక్కో గ్రామానికి రూ.20 లక్షల ప్రకారం రూ.3.80 కోట్లు విడుదలయ్యాయి. ఈ జిల్లాలో 85 పనులు చేపట్టనున్నారు.

**ఏవి పనులు చేపడతారంటే..**

గ్రామాల్లో ప్రజలకు శుద్ధ జలం అందించడం.. పారిశుద్ధ్య మెరుగు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శౌచాలయాలు నిర్మించడం.. అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం.. రహదారి పనులు.. సౌర విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేసుకునేందుకుగాను నిధులు ఖర్చు చేస్తారు. ఎంపికైన ఆదర్శ గ్రామాలకు కేంద్రమిచ్చే రూ.20 లక్షలతోపాటు ఉపాధి, ఎంపీ ల్యాడ్స్ నిధులు విడుదల చేయడం ద్వారా గ్రామాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు అవకాశముంటుంది.

# కట్టలు తెగిన నిర్లక్ష్యం



నంద్యాల : సాగు, తాగునీటికి ఆధారమైన చిన్ననీటిపారుదల చెరువులకు కూటమి ప్రభుత్వం 'రూపు' తీసుకొస్తోంది. వీటి అభివృద్ధికి నిధులు కేటాయించింది. గత వైకాపా ప్రభుత్వ పాలనలో చెరువులను పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం తట్టెడు పూడిక తీయలేదు. ఫలితంగా చాలా ప్రాంతాల్లో ఆనవాళ్లు కోల్పోయాయి. చెరువు కట్టలు బలహీనపడ్డాయి. వర్షాలు పడి వీటిల్లో నీరు చేరిన సమయంలో కట్టలు తెగిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. చిన్న నీటిపారుదల శాఖ కింద కర్నూలు జిల్లాలో 310 చెరువుల పరిధిలో 33,313 ఎకరాల ఆయకట్టు ఉంది. నంద్యాల జిల్లాలో 116 చెరువుల కింద 48,515 ఎకరాల ఆయకట్టు ఉంది. చాలా ప్రాంతాల్లో చెరువులు అధ్వానంగా ఉండటంతో పొలాలు బీళ్లుగా మారాయి.

**రూ.5.50 కోట్లతో ఓఅండ్ఎం పనులు**

ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల పరిధిలో రూ.5.50 కోట్లతో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులు జరుగుతున్నాయి. నంద్యాల జిల్లాకు రూ.2.68 కోట్లు, కర్నూలు జిల్లాకు రూ.2.82 కోట్లు విడుదలయ్యాయి. ప్రతి నియోజకవర్గానికి సగటున రూ.45 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో చెరువుల స్లూయిస్‌లు, గేట్లు, షట్టర్ల మరమ్మతులతోపాటు కొత్తవి అమర్చడం తదితర పనులు జరుగుతున్నాయి.

**పథకాలను నిర్వీర్యం చేసి...**

గత వైకాపా ప్రభుత్వం వివిధ పథకాలను నిర్వీర్యం చేసింది. తన వాటా నిధులు విడుదల చేయకపోవడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు పథకాల కింద చెరువులను అభివృద్ధి చేయలేని పరిస్థితి ఏర్పడింది. కర్నూలు జిల్లాలో ఎన్‌డీఎంఎఫ్ కింద 27 పనులకు నిధులు మంజూరవగా 11 మాత్రమే పూర్తయ్యాయి. నంద్యాల జిల్లాలో ఏఐబీపీటీపీ కింద 46 చెరువులకు రూ.66.91 కోట్లు మంజూరవగా 31 ప్రాంతాల్లో పనులు ప్రారంభించారు. ఏనిమిది మాత్రమే అభివృద్ధి చేయగా చిన్న నీటిపారుదల చెరువులకు మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్‌ఆర్‌ఆర్ (రిపేర్స్, రెనొవేషన్, రెస్టొరేషన్) పథకం కింద నిధులు విడుదల చేస్తుంది. ఈ నిధుల కోసం ఉమ్మడి జిల్లాలో నూతనంగా పనులు చేపట్టాల్సిన చెరువులను చిన్న నీటిపారుదల శాఖ అధికారులు గుర్తించి ప్రతిపాదించారు. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం ఖర్చు చేస్తే 60 శాతం నిధులు కేంద్రం నుంచి విడుదలవుతాయి.

# నదిలో గట్లు.. కబ్జాకు ఆనవాళ్లు



తాడిపత్రి : పెన్నానది పరివాహక ప్రాంతంలో ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. అక్రమార్కులు మరో అడుగు ముందుకేసి నది మధ్యలోనే గట్లు, కంచె ఏర్పాటు చేసుకున్నారు. ఇదంతా గత వైకాపా ప్రభుత్వం నుంచే జరుగుతోంది. ప్రభుత్వం మారినా నాయకుల తీరులో మార్పు కనిపించలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

తాడిపత్రి నియోజకవర్గం పరిధిలో పెన్నానది సుమారు 64 కి.మీ. మేర ప్రవహిస్తుంది. నదిని యథేచ్ఛగా ఆక్రమించి పంటల సాగు చేపట్టారు. కిలోమీటర్ వెడల్పుతో ప్రవహించే పెన్నా ప్రస్తుతం వంద మీటర్లకు కూడా లేని దుస్థితి నెలకొంది.

**హద్దులు వేసి.. విక్రయాలు**

నాపరాళ్ల వ్యర్థాలతో గట్టు, ఇసుప కంచెలు వేసి ఆక్రమిస్తున్నారు. ఒక్కొక్కరు 5 నుంచి 10 ఎకరాల మేరకు కబ్జా చేయడం గమనార్హం. ఆ భూమిని పంట సాగుకు అనుకూలంగా మార్చుకున్నారు. మరికొందరు వాటిని విక్రయిస్తున్నారు. ఆలూరు, సజ్జలదిన్నె, తాడిపత్రి పరిసరాలు, ఇగుడూరు, చుక్కలూరు గ్రామాల పరిధిలోని వందల ఎకరాల్లో నదిని ఆక్రమించారు. కొంతకాలం పంటలు సాగు చేసుకుని తర్వాత అక్కడున్న ఇసుకను యథేచ్ఛగా తవ్వి.. తరలించి రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. నందలపాడు, అక్కన్నపల్లి, హుస్సేనాపురం, చుక్కలూరు పలు గ్రామాల పరిధిలో ఇలాంటి పరిస్థితి కొనసాగుతున్నా అధికారులు పట్టడం లేదు.

**ముంచుతున్న వరద**

ఆక్రమణలు కొనసాగుతుండటంతో వర్షాకాలంలో నది ప్రవాహం సమీపంలోని కస్తూర్బా, సమీకృత వసతిగృహంపై పడుతోంది. వరద ఆయా ప్రాంతాలను ముంచెత్తుతోంది. ఆ సందర్భాల్లో సెలవులు ప్రకటించాల్సి వస్తోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

**తగిన చర్యలు తీసుకుంటాం -సోమశేఖర్, తహసీల్దార్**

పెన్నానదిలో ఆక్రమణలు జరిగిన మాట వాస్తవమే. ప్రత్యేక బృందంతో విచారణ జరిపి.. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తాం. వారి ఆదేశాలతో తగు చర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేస్తాం.

## తేలని కేసులు.. రాలని కాసులు..!

విశాఖపట్నం: నగర ప్రజలంతా సకాలంలో పన్నులు చెల్లించి, విశాఖ అభివృద్ధికి సహకరించాలని జీవీఎంసీ రెవెన్యూ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో నిత్యం ప్రచారం చేస్తున్నారు. కానీ, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిల వసూళ్లపై దృష్టి సారించడం లేదని, జీవీఎంసీ ఆస్తులకు సంబంధించి న్యాయస్థానాల్లో ఉన్న కేసుల్ని త్వరితగతిన పరిష్కరించడంలో విఫలమవుతున్నారని ఆరోపణలున్నాయి.కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆర్ఐఎన్ఎల్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్- విశాఖ ఉక్కు) జీవీఎంసీకి రూ.150 కోట్లకుపైగా ఆస్తి, ఖాళీ స్థల పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉంది. గతంలో జీవీఎంసీ విధించిన ఆస్తి పన్నుపై విశాఖ ఉక్కు న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ కేసులో తుది తీర్పు వచ్చేంత వరకు 50 శాతం మాత్రమే పన్ను చెల్లించాలన్న కోర్టు ఆదేశాలతో ఇప్పటికీ ఏటా సగం మాత్రమే ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. రూ.30 కోట్లకు, ఏటా రూ.15 కోట్లు మాత్రమే చెల్లిస్తుండటంతో దాదాపు రూ.150 కోట్లు వరకు బకాయిలు ఉన్నాయి.బీచ్‌రోడ్డులో మత్స్యదర్శిని నుంచి రూ.6 కోట్లకుపైగా బకాయిలు పేరుకుపోయాయి. జ్ఞానాపురం పెట్రోల్‌బంకు



నుంచి రూ.3 కోట్లు వసూలు కావాల్సి ఉంది. జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్ వ్యాపారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో, ఇప్పటికీ తక్కువ అద్దెలు వసూలు చేయాల్సి వస్తుంది.

నగరంలో జీవీఎంసీకి చెందిన ఆస్తుల్ని లీజులకు తీసుకున్న వారు సకాలంలో అద్దె బకాయిలు చెల్లించకపోగా, ప్రజాప్రతినిధులను అడ్డుపెట్టుకుని పైరవీలకు పాల్పడుతున్నారు. నగర నడిబొడ్డున జీవీఎంసీకి చెందిన వేమన మందిరం గడువు ముగిసినా, ఇంకా లీజుదారుల చేతిలో ఉండటం గమనార్హం. ఇప్పటికీ నెలకు రూ.4 వేలు అద్దె ప్రాతిపదికన భవనాన్ని వినియోగించుకుంటున్నారు. దాన్ని స్వాధీనం చేసుకుని, తిరిగి లీజుకు ఇస్తే ఏడాదికి రూ.60 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.


ఇలా ప్రభుత్వ ఆస్తులపై బకాయిల వసూలు చేయడంలో, న్యాయస్థానాల్లో కేసులు పరిష్కరించడంలో అధికారులు వెనుకబడి పోవడంతో... జీవీఎంసీ ఆర్థికంగా నష్టపోతుంది.

## అక్రమార్కుల వేషాలు.. కనిపెట్టేందుకు మీనమేషాలు!!

మధురవాడ : జీవీఎంసీ 8వ వార్డు ఐటీహిల్స్ రోడ్డులోని వికలాంగుల కాలనీలో నకిలీ పట్టాల వెలికితీత వ్యవహారంలో రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. తూతూమంత్రంగా పరిశీలన చేయడంతో అది ఆక్రమణదారులకు వరంలా మారింది. ప్రభుత్వ జీవోలను అడ్డం పెట్టుకుని పలువురు చాపకిందనీరులా భూములను క్రమబద్ధీకరించుకుంటున్నారు. దీంతో కోట్లాది రూపాయల విలువ చేసే సర్కారు స్థలాలు అన్యాక్రాంత మవుతున్నాయి. కాలనీలో వీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళిక రోడ్డు కోసం కేటాయించిన భూమిని ఇళ్ల స్థలాలుగా మార్చి పట్టాల కోసం దరఖాస్తులు సమర్పించినట్లు తెలుస్తోంది. వీటిని అరికట్టాల్సిన అధికారులు... పట్టాలు అందించేందుకు దస్త్రాలు కూడా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. పట్టాల అక్రమ క్రమబద్ధీకరణ పూర్తయిన తర్వాత నివాసాలు నిర్మించుకునేందుకు ఇప్పటి నుంచే ఆయా స్థలాల్లో మట్టి గుట్టలు వేసి చదును చేసేందుకు ప్రణాళిక రచించారు.

**నకిలీలకు వారే అండ..!**

ఓ మంత్రి పేరు వాడుతున్న జోన్-2లోని ఓ రెవెన్యూ అధికారిణి అండదండలు కబ్జాదారులకు పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాలనీలో ఇచ్చిన పట్టాలకు ఆధార్ తనిఖీ చేయకుండా క్షేత్రస్థాయి ఉద్యోగులకు వీరే అడ్డు పడుతున్నట్లు తెలుస్తోంది. కాలనీలో అడుగు పెట్టకుండా ఎప్పటికప్పుడు సర్వే చేశామని ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు సమర్పిస్తున్నట్లు సమాచారం.



**జీవోలను అడ్డుపెట్టుకుని..**

వికలాంగుల కాలనీలో 296, 338 ప్రభుత్వ జీవోల ప్రకారంక్రమబద్ధీకరణ జరిగిన జాబితాను అధికారులు పరిశీలించాల్సి ఉంది. వీటికి సంబంధించిన లబ్ధిదారుల ఆధార్‌లు క్షుణ్ణంగా పరిశీలిస్తే ఒక్కొక్కరి పేరున రెండు, మూడు పట్టాలు ఉన్న విషయం వెలుగులోకి వస్తుంది. కాలనీలో పలువురికి భార్య, భర్తల పేరున వేర్వేరుగా మంజూరైన పట్టాలు ఉన్నాయి. కొన్ని నివాసాలకు ఇంటి పన్ను, విద్యుత్తు కనెక్షన్ లేకుండానే జీవీఎంసీ అధికారుల అండతో క్రమబద్ధీకరణ పేరిట రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. కొందరు ఆక్రమణదారుల పేరుమీద అయిదు, ఆరు స్థలాలకు విద్యుత్తు కనెక్షన్లు సైతం ఉన్నాయి.ఇప్పుడు మరోమారు అధికారుల అండతో జీఓ 30లో క్రమబద్ధీకరణకు ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆన్‌లైన్‌లో ఆధార్ నెంబరు జత చేసి చూస్తే వారి కుటుంబ సభ్యుల వివరాలన్నీ తెలుస్తాయని అధికారులు పైకి చెబుతున్నా... పట్టాల విషయంలో మాత్రం తెలియని మాయాజాలం నడుస్తోందని పలువురు అనుమానిస్తున్నారు. ఈ కబ్జాలను అరికట్టేందుకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ దృష్టి సారించాలని పలువురు సూచిస్తున్నారు. ప్రత్యేక అధికారితో ఆధార్ పరిశీలన చేయించి నకిలీ పట్టాలను రద్దు చేయించాలని కోరుతున్నారు.

చురకలు



## ట్రాన్స్‌పరెంట్ టాప్ లో అందాలతో గిలిగింతలు పెడుతున్న యాంకర్!


సినీ హీరోయిన్ మాత్రమే కాదు బుల్లితెర యాంకర్స్.. బుల్లితెర నటీనటులు కూడా సోషల్ మీడియాలో ఫాలోవర్స్ పెంచుకోవడానికి తెగ ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే.అందులో భాగంగానే నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ షో చేస్తూ ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు. అటు సీరియల్స్ లో నటించే నటీమణుల విషయాన్ని కాస్త పక్కన పెడితే.. ఇప్పుడు పలు షోల ద్వారా భారీ పాపులారిటీ సొంతం చేసుకొని యాంకర్ గా సత్తా చాటుతూ పేరు తెచ్చుకున్న లేడీ యాంకర్స్ సోషల్ మీడియాలో తెగ రచ్చ చేస్తున్నారు. అలాంటి వారిలో శ్రీముఖి కూడా ఒకరు అని చెప్పవచ్చు. ఈమె ఛానల్ తో సంబంధం లేకుండా అవకాశం వచ్చిన ప్రతి షోలో పాల్గొంటూ భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. ముఖ్యంగా బుల్లితెరపై ప్రసారమయ్యే పలు షోలలో హోస్ట్ గా వ్యవహరించడమే కాకుండా అవార్డు ఫంక్షన్లకు కూడా హోస్ట్ గా వ్యవహరిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అంతేకాదు సినిమా ఈవెంట్లకి కూడా స్పెషల్ గా హోస్టింగ్ చేస్తూ భారీగా సంపాదిస్తోంది అని కూడా చెప్పవచ్చు. బిగ్ బాస్ వంటి రియాల్టీ షోలలో కూడా కంటెస్టెంట్ గా పాల్గొన్న శ్రీముఖి.. తాజాగా బిగ్ బాస్ సీజన్ 9కి



సంబంధించి కామనర్స్ సెలక్షన్ కోసం ఏర్పాటుచేసిన అగ్నిపరీక్ష అనే మినీ షోకి కూడా హోస్ట్ గా వ్యవహరించింది. ఇప్పుడు నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అటు సాంప్రదాయంగా ఆకట్టుకుంటూనే ఇటు గ్లామర్ షో చేస్తూ రెండు వర్గాల అభిమానులను అలరిస్తోంది శ్రీముఖి. అందులో భాగంగానే తాజాగా బ్లూ కలర్ ట్రాన్స్‌పరెంట్ టాప్ ధరించిన ఈమె దీనికి కాంబినేషన్లో జీన్స్ ప్యాంటు ధరించింది. ఈమె మేకోవర్ ను ఫుల్ ఫిల్ చేయడం కోసం వైట్ కలర్ షూస్ ధరించిన శ్రీముఖి స్టైలిష్ గా ఉండడం కోసం గ్లాసెస్ కూడా ధరించింది. పైగా తన మేకోవర్ ను సింపుల్ జువెలరీ తో ఫుల్ ఫిల్ చేసింది అని చెప్పవచ్చు. మొత్తానికైతే శ్రీముఖి ట్రెండింగ్ అవుట్ ఫిట్ కి అభిమానులు ఫిదా అవుతున్నారు. ఇక్కడ ట్రాన్స్‌పరెంట్ టాప్ ధరించేసరికి అందాలతో అభిమానులే కాదు ఫాలోవర్స్, నెటిజన్స్ కూడా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని చెప్పడంలో సందేహం లేదు. అలా ఎప్పటికప్పుడు ఫ్యాషన్ లో సరికొత్త ట్రెండ్ క్రియేట్ చేస్తూ అందరి దృష్టిని ఆకట్టుకుంటుంది శ్రీముఖి. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్ లో 5 మిలియన్లకు పైగా ఫాలోవర్స్ కలిగి ఉన్న ఈ చిన్నది.. బుల్లితెర రాములమ్మగా భారీ రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. శ్రీముఖి కెరియర్ విషయానికి వస్తే.. అదుర్స్ అనే షో ద్వారా హోస్ట్ గా కెరియర్ ను ప్రారంభించిన శ్రీముఖి.. 2012లో అల్లు అర్జున్ హీరోగా, త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన జులాయి అనే సినిమాతో వెండితెరకు పరిచయమైంది. ఆ తర్వాత ప్రేమ ఇష్క్ కాదల్ సినిమాతో హీరోయిన్గా పరిచయమైన ఈమె.. నేను శైలజ, లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్, ధనలక్ష్మి తలుపు తడితే, సావిత్రి వంటి చిత్రాలలో నటించింది. తెలుగులోనే కాదు తమిళంలో కూడా సినిమాలు చేసింది ఈ ముద్దుగుమ్మ.

## ఈ స్టైల్ లో నిన్ను కొట్టేదెవరు శ్రీలీల

సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే యువ నటి శ్రీలీల, మరోసారి తన స్టైలిష్ ఫోటోలతో అభిమానులను ఆకట్టుకుంది. తాజాగా షేర్ చేసిన ఈ ఫోటోల్లో బ్లాక్ డ్రెస్‌తో అందంగా మెరిసిపోతోంది. లైటింగ్, ఎక్స్‌ప్రెషన్స్‌తో కలిపి ఈ ఫోటోలు ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి. నేటి ట్రెండీ ఫోటోషూట్లలో ఉండాల్సిన గ్లామర్, గ్రేస్ రెండూ కలిపినట్లుగా ఉన్నాయి. శ్రీలీల కెరీర్ ప్రారంభం కన్నడలో అయినా, తెలుగు సినిమాల్లో మాత్రం ఆమె స్టార్ ఇమేజ్ దక్కించుకుంది. “పెల్లిసంద%ಐ%”తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, “ధమాకా”లో రవితేజ సరసన నటించి బ్లాక్‌బస్టర్ హిట్ అందుకుంది. ఆ తర్వాత వరుసగా టాప్ హీరోల సినిమాల్లో భాగమవుతూ స్టార్ హీరోయిన్ లైన్‌లో నిలిచింది. ఆమధ్య మహేష్ బాబు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన గుంటూరు కారంలో కూడా



శ్రీలీల స్క్రీన్ ప్రెజెన్స్ బాగానే ఆకట్టుకుంది. ఆమెకు డ్యాన్స్‌లో ఉన్న ఎనర్జీ, ఎక్స్‌ప్రెసివ్ యాక్టింగ్ అన్నీ మాస్‌కి, క్లాస్‌కి బాగా కనెక్ట్ అయ్యాయి. దీంతో ప్రస్తుతం ఎక్కువమంది దర్శకులు, నిర్మాతలు తమ ప్రాజెక్ట్స్‌లో శ్రీలీలను సైన్ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ కొత్త ఫోటోషూట్‌కి అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. స్టన్నింగ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

అలాగే ఈ స్టైల్ లో నిన్ను కొట్టేదెవరు శ్రీలీల అంటూ మరికొందరు స్ట్రాంగ్ ఎలివేషన్స్ ఇస్తున్నారు. కొన్ని గంటల్లోనే లక్షల్లో లైక్స్ రావడం చూస్తే ఆమె పాపులారిటీ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. అంతేకాదు, టాలీవుడ్ నెక్స్ట్ బిగ్ స్టార్ హీరోయిన్‌గా ఆమెను పలువురు ఫ్యాన్స్ ఇప్పటికే ట్యాగ్ చేస్తున్నారు. ఇక రాబోయే రోజుల్లో ఆమె చేతిలో ఉన్న ప్రాజెక్ట్స్ కూడా బిగ్ బడ్జెట్ సినిమాలే కావడంతో, శ్రీలీల కెరీర్ మరింత హైప్ అందుకోవడం ఖాయం.




## లిటిల్ హార్ట్స్.. ఓవర్సీస్ లెక్క ఎంతవరకు వచ్చిందంటే?




లిటిల్ హార్ట్స్.. కొన్ని రోజులుగా ఎక్కడ చూసినా ఆ మూవీ కోసమే చర్చ నడుస్తోంది. చిన్న సినిమాగా విడుదలైన ఆ రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామా.. పెద్ద విజయం సాధించింది. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను అందుకుంటోంది. ఇప్పటికే ఎన్నో రికార్డులు బద్దలు కొట్టి.. సరికొత్త రికార్డులు నెలకొల్పుతోంది. ఎన్నో ఫీట్లను సాధిస్తోంది. తెలుగు రాష్ట్రాలతోపాటు ఓవర్సీస్ లో కూడా లిటిల్ హార్ట్స్ మూవీ దూసుకుపోతోంది. రిలీజ్ అయిన తొలి రోజు నుంచి ఓ రేంజ్ లో కలెక్షన్లు సాధిస్తోంది. నెవ్వర్ బిఫోర్ అనేలా సందడి చేస్తోంది. తాజాగా సినిమా అరుదైన ఘనతను అందుకుంది. నార్త్ అమెరికాలో వన్ మిలియన్ డాలర్స్ క్లబ్ లోకి చేరి లిటిల్ హార్ట్స్ ఔరా అనిపించింది. మొత్తానికి ఒక ప్రతిష్టాత్మక మైలురాయిని అందుకుని.. అతిపెద్ద బ్లాక్ బస్టర్స్ లో ఒకటిగా నిలిచింది. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలకు ఎల్లప్పుడూ తెలుగు డయాస్పోరా నుంచి అద్భుతమైన రెస్పాన్స్ లభిస్తుందని నిరూపించింది. లిటిల్ హార్ట్స్ వంటి చిన్న సినిమాలు ఇప్పటి వరకు చాలా తక్కువగా వన్ మిలియన్ డాలర్ క్లబ్ ఫీట్ ను అందుకున్నాయి. అదే సమయంలో ఇప్పటివరకు లిటిల్ హార్ట్స్ మూవీ ఇండియాలో రూ.24.90 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఓవర్సీస్ నుంచి రూ.9 కోట్లకు పైగా వరకు వసూలు చేసినట్లు సమాచారం. వరల్డ్ వైడ్ గా ఇప్పటి వరకు రూ.34 కోట్ల గ్రాస్ వసూలు చేసిందని.. రూ.30 కోట్ల లాభాన్ని అందుకుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కాగా సినిమా విషయానికొస్తే.. 90%ం% మిడిల్ క్లాస్ బయోపిక్ సిరీస్ ఫేమ్ మౌళి తనుజ్, అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్ మూవీ ఫేమ్ శివాని నాగారం లీడ్ రోల్స్ లో నటించారు. రాజీవ్ కనకాల, నరేష్, వాసుకి, సత్య కృష్ణన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. యంగ్ డైరెక్టర్ సాయి మార్తాండ్ సినిమాకు దర్శకత్వం వహించారు. 90%ం% మిడిల్ క్లాస్ బయోపిక్ సిరీస్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ నిర్మాతగా వ్యవహరించారు. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్ పై ఆయన రూపొందించగా.. ప్రముఖ డిస్ట్రిబ్యూటర్లు బన్నీ వాస్, వంశీ నందిపాటి థియేట్రికల్ హక్కులను కొనుగోలు చేశారు. వరల్డ్ వైడ్ గా సెప్టెంబర్ 5న గ్రాండ్ గా రిలీజ్ చేశారు. భారీ హిట్ ను సొంతం చేసుకున్నారు. పెద్ద ఎత్తున ప్రాఫిట్స్ అందుకుంటున్నారు.

## మెగా మేనల్లుడుతో మారుతి సినిమా.. కానీ?



మెగా మేనల్లుడు సాయి దుర్గ తేజ్ నటిస్తున్న తాజా సినిమా సంబరాల ఏటి గట్టు. రోహిత్ కేపీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్ గా నటిస్తున్నారు. సంబరాల ఏటి గట్టు మూవీని సెప్టెంబర్ 25న రిలీజ్ చేస్తామని మేకర్స్ ముందు చెప్పినప్పటికీ ఆ తర్వాత పలు కారణాల వల్ల సినిమాను పోస్ట్‌పోన్ చేస్తున్నట్టు క్లారిటీ ఇచ్చారు. సాయి దుర్గ తేజ్ సినిమా వచ్చి చాలా కాలమవుతున్న నేపథ్యంలో ఈ సినిమా వాయిదా పడటంతో అతని ఫ్యాన్స్ నిరాశకు గురయ్యారు.

అయితే సంబరాల ఏటి గట్టు వాయిదా పడినా, ఆ డిజప్పాయింట్‌మెంట్ ను బ్యాలెన్స్ చేయడానికి ఇప్పుడో క్రేజీ న్యూస్ వినిపిస్తోంది. సాయి దుర్గ తేజ్ ఓ క్రేజీ సినిమాను లైన్ లో పెట్టారని టాలీవుడ్ సర్కిల్స్ లో టాక్.

**క్రేజీ కాంబినేషన్ ను సెట్ చేసిన సాయి తేజ్...** వంశీ కృష్ణ దర్శకత్వంలో సాయి తేజ్ హీరోగా ఓ మూవీ రానుందని, ఆ సినిమాకు డైరెక్టర్ మారుతి కథను అందించనున్నారని తెలుస్తోంది. రీసెంట్ గా మిరాయ్ తో సూపర్ హిట్ ను అందుకున్న పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ క్రేజీ ప్రాజెక్టును నిర్మించనుందని అంటున్నారు. సాయి తేజ్ తో మారుతికి ప్రతీ రోజూ పండగే టైమ్ నుంచే మంచి బాండింగ్ ఏర్పడగా, ఆ అనుబంధంతోనే తేజ్ కు మారుతి ఓ కథ చెప్పారని, ఆ కథ నచ్చడంతో సాయి తేజ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది.

**గాంజా శంకర్ పై పెరుగుతున్న అనుమానాలు...** ఇదిలా ఉంటే సాయి తేజ్ సంబరాల ఏటిగట్టు తో పాటూ గతంలో సంపత్ నంది దర్శకత్వంలో గాంజా శంకర్ సినిమాను కూడా అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. కానీ ఆ సినిమా టైటిల్ వివాదాస్పదంగా ఉందని మరియు పలు కారణాల వల్ల దాని గురించి తర్వాత ఎలాంటి అప్డేట్స్ రాలేదు. మధ్యలో ఓదెల2 ప్రమోషన్స్ లో ఈ సినిమా గురించి అడిగినా సంపత్ నంది ఆ మూవీపై ఏ స్పష్టతా ఇవ్వకపోవడంతో అసలు గాంజా శంకర్ ఉంటుందా లేదా అని డౌట్ గా మారింది. చూస్తుంటే సంబరాల ఏటిగట్టు తర్వాత సాయి తేజ్ చేయబోయే మూవీ వంశీ కృష్ణ దర్శకత్వంలోనే అనిపిస్తోంది.

## 20 ఏళ్లు.. ఇలా తమన్నాకే సాధ్యం

సినిమా ఇండస్ట్రీలో హీరోలు ఇరువై.. ముప్పై ఏళ్లు కొనసాగడం సర్వ సాధారణం. కానీ హీరోయిన్స్ మాత్రం అయిదు పదేళ్లు మాత్రమే ఉంటున్నారు. పదేళ్ల తర్వాత కూడా ఉన్నారు అంటే ఉన్నారు అన్నట్లే ఉంటారు. అంటే చాలా తక్కువ సినిమాలు చేయడం, ప్రాధాన్యత లేని పాత్రల్లో కనిపించడం, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారడం వంటివి మనం చూస్తూ ఉంటాం. కానీ అతి కొద్ది మంది మాత్రం 20 ఏళ్లు దాటినా హీరోయిన్‌గా బిజీగా ఉంటారు. బాలీవుడ్‌లో ఇలా కొందరు ఉన్నారు. కానీ సౌత్ ఇండియాలో మాత్రం ఇలా రెండు దశాబ్దాల పాటు బిజీగా ఉండటం, ఆ తర్వాత కూడా బిజీగా సినిమాలు చేయడం అనేది లేదు. కానీ రెండు దశాబ్దాల సినీ జర్నీ తర్వాత కూడా మిల్కీ బ్యూటీ తమన్నా బిజీగా ఉండటం ఆమెకు మాత్రమే సాధ్యం అన్నట్లుగా ఆమె ఫ్యాన్స్‌తో పాటు ప్రతి ఒక్కరూ అంటున్నారు.

**అల్లుడు శీను సినిమాలో తమన్నా ఐటెం సాంగ్...** తమన్నా ప్రస్తుతం నాలుగు అయిదు సినిమాలు చేస్తుంది. అవన్నీ హిందీ సినిమాలు కావడం విశేషం. మరో వైపు సౌత్‌లో తెలుగు, తమిళ్ భాషల్లో క్రమం తప్పకుండా సినిమాలు చేస్తూనే ఉంది. హీరోయిన్‌గానే కాకుండా



ఐటెం సాంగ్స్‌లో చేయడం మనం చూస్తూ ఉన్నాం. సాధారణంగా హీరోయిన్స్ ఐటెం సాంగ్‌లు చేయడంను కొందరు తప్పుబడుతారు. కానీ మిల్కీ బ్యూటీ ఐటెం సాంగ్స్ చేయడం మొదలు పెట్టిన తర్వాత చాలా మంది హీరోయిన్స్ ఆ దిశగా అడుగులు వేశారు అనడంలో సందేహం లేదు. మొదటగా ఈమె తెలుగులో అల్లుడు శీను సినిమాలో ఐటెం సాంగ్ చేసింది. ఆ సినిమాలో సమంత హీరోయిన్ అయినప్పటికీ తమన్నా ఐటెం సాంగ్ చేయడం ద్వారా సినిమా వెయిట్ పెరిగింది, అంతే కాకుండా హీరోయిన్ స్థాయి క్రేజ్ దక్కింది. తమన్నా ఐటెం సాంగ్ వల్ల అల్లుడు శీను సినిమా స్థాయి మరింతగా పెరిగింది అనడంలో సందేహం లేదు.

**హ్యాపీడేస్ తో తమన్నా టాలీవుడ్‌లో బిజీ...** మిల్కీ బ్యూటీ తమన్నా ఇండస్ట్రీలో 2005లో ఎంట్రీ ఇచ్చింది. తెలుగులో శ్రీ మూవీతో మంచు మనోజ్‌తో కలిసి తన నటన ప్రస్థానం మొదలు పెట్టింది. హీరోయిన్‌గా మొదటి సినిమా ఆమెకు తీవ్రంగా నిరాశను మిగిల్చింది. మొదటి సినిమా ఫ్లాప్ కావడంతో తెలుగులో వెంటనే ఆఫర్ రాలేదు. తమిళ్ లో ఒకటి రెండు సినిమాలు చేసిన తర్వాత లక్కీగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో హ్యాపీ డేస్ సినిమాను చేసే అవకాశం దక్కించుకుంది. ఆ సినిమాలో చాలా మందిలో ఒక అమ్మాయిగా ఉన్నప్పటికీ తన నటనతో మెప్పించింది. అక్కడ నుంచి వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. టాలీవుడ్‌లో ఈ అమ్మడికి బిగ్గెస్ట్ టర్నింగ్ పాయింట్ అంటే కొంచెం ఇష్టం కొంచెం కష్టం. ఆ సినిమాలో నటనతో మంచి మార్కులు దక్కించుకుంది. కమర్షియల్‌గా 100% లవ్ సినిమా ఈమె స్థాయిని పెంచింది అనడంలో సందేహం లేదు.

## అక్టోబర్ 15 - అక్టోబర్ 30 మధ్య కత్రిన ఇంకా ఏం దాస్తోంది?

అక్టోబర్ 15 – అక్టోబర్ 30కి మధ్య కత్రిన జీవితంలో ఏం జరగబోతోంది? ఏదైనా ఊహించనిది జరుగుతోందా! అంటే దానికి సమాధానం ఇక్కడ ఉంది. ఆ రెండు తేదీల మధ్య కత్రిన తన అభిమానులకు ఒక శుభవార్త చెప్పబోతోంది. అది తన గర్భంలో పెరుగుతున్న బిడ్డకు జనన సమయం. ఆ సమయంలో పండంటి బిడ్డను ప్రసవించి, ఆ బిడ్డను ప్రేమగా ముద్దాడబోతోంది. విక్ కాట్ జీవితంలో అది చాలా ప్రత్యేకమైన క్షణం కాబోతోంది. ప్రస్తుతానికి విక్కీ కౌశల్– కత్రిన జంట ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించలేదు. కానీ కత్రిన బేబి బంప్ ఫోటోలు మాత్రం ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. ఈ జంట అధికారికంగా ఈ వార్తను ప్రకటించకపోయినా కానీ, అభిమానులు ఇప్పటికే చాలా ఉత్సాహంగా ఉన్నారు. కత్రినా కైఫ్ మూడవ త్రైమాసికంలో ఉందని కథనాలొస్తున్నాయి. జాతీయ మీడియాల కథనం ప్రకారం.. కత్రినకు 9వ నెల. వచ్చే నెలలో బిడ్డ పుట్టనుంది. అక్టోబర్ 15 – అక్టోబర్



30కి మధ్యలో ప్రసవం జరగనుందని వార్తలు వస్తున్నాయి. %ప్రస్తుతానికి కత్రిన భర్త విక్కీ కౌశల్ ఈ విషయాన్ని రహస్యంగా ఉంచేందుకు ఇష్టపడుతున్నారు. బిడ్డ పుట్టిన తర్వాత దానిని వెల్లడించాలనుకుంటున్నారు అని ప్రముఖ మీడియా తన కథనంలో పేర్కొంది. విరాట్ కోహ్లీ– అనుష్క శర్మ తమ రెండవ గర్భధారణ సమయంలో చేసినట్లుగానే, విక్ కాట్ కూడా వారి బిడ్డను మీడియా గ్లేర్‌కి దూరంగా ఉంచాలని ప్లాన్ చేస్తున్నట్టు గుసగుస వినిపిస్తోంది. తాజాగా లీకైన ఫోటోను బట్టి కత్రినా బేబీ బంప్ ప్రకటన షూట్‌లో కనిపించిందా? అనే సందేహాల్ని కూడా కొందరు వ్యక్తం చేస్తున్నారు. అయితే బేబి బంప్ తో ప్రకటనలో నటించాలన్నా కత్రినకు బేబి బంప్ ఉంటేనే అది అభిమానుల్లో ఉత్సుకతను పెంచుతుందని కొందరు లాజిక్ ని కూడా వెతుకుతున్నారు. విక్కీ కౌశల్–కత్రినా కైఫ్ జంట ప్రేమ పెళ్లి గురించి తెలిసిందే. సుమారు రెండేళ్ల పాటు సీక్రెట్ గా డేటింగ్ చేసిన ఈ జంట డిసెంబర్ 2021లో వివాహం చేసుకున్నారు. రాజస్థాన్‌లో సింపుల్ వెడ్డింగ్ ప్లాన్ చేయగా కొద్దిమంది బంధుమిత్రులు మాత్రమే హాజరయ్యారు. కత్రిన చివరిగా మెర్రీ క్రిస్మస్ లో నటించింది. టైగర్ 3లో కూడా కనిపించింది. విక్కీ కౌశల్ %–%చావా%–% చిత్రంతో అద్భుత విజయం అందుకున్నాడు. తదుపరి భన్సాలీ దర్శకత్వంలో లవ్ అండ్ వార్ లో నటిస్తున్నాడు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536